

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




ఆదివారం | 31-8-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 136 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి రా.12.58 తదుపరి నవమి, నక్షత్రం: అనూరాధ సా.5.27 తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: రా.11.37-1.23, దుర్ముహూర్తం: సా.4.47-5.36, అమృతఘడియలు: శేషం ఉ 7.36, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.04, సూర్యాస్తమయం: 6.26 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఎమ్మెల్యేలు.. వసూల్‌రాజాలు!



...ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేయాల్సిన శాసనసభ్యులే ఇప్పుడు ప్రజలపాలిట సమస్యగా మారుతున్నారు. కొందరు శాసనసభ్యులు లేని అధికారాలను సంక్రమింపజేసుకొని నియోజకవర్గాలలో ప్రజలు గాలి పీల్చుకోవాలన్నా తమ అనుమతి తప్పనిసరన్నట్టు వ్యవహరిస్తున్నారు.

..ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేయడం, గెలిచిన వారు తిరిగి ఆ డబ్బు రాబట్టుకోవడానికి తెగబడటం అనేది ఒక విష వలయంగా మారింది. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక శాసనసభ్యులకు పట్టపగ్గాలు లేకుండా పోయాయి. వ్యవస్థలంటే భయం లేకుండా పోయింది. మీరు అందిన కాడికి దోచుకోండి, నన్ను మాత్రం ఏమీ అడగకండి అంటూ శాసనసభ్యులకు జగన్ రెడ్డి లైసెన్స్ ఇచ్చేశారు.

..జగన్ రెడ్డి హయాంలో శాసనసభ్యులు అనుసరించిన ధోరణినే కొందరు కూటమి ఎమ్మెల్యేలు ఇప్పుడు ఆదర్శంగా తీసుకుంటున్నారు. విచిత్రం ఏమిటంటే, శాసనసభకు తొలిసారిగా ఎన్నికైన వారు, కొత్తగా రాజకీయ అరంగేట్రం చేసిన రాజకీయ కుటుంబాల వారసులు ఇలాంటి అరాచకాలకు అధికంగా పాల్పడుతున్నారు.

..కూటమి ఎమ్మెల్యేల పోకడల గురించిన సమాచారం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా వెళుతోంది. అయినా వారిని ఆయన కట్టడి చేయలేకపోతున్నారు. బరితెగించిన ఎమ్మెల్యేలను సందర్భం వచ్చినప్పుడల్లా హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా వారి వైఖరిలో మార్పు లేదు.

..పలువురు శాసనసభ్యులు కట్టు తప్పుతున్నారని తెలిసినా చంద్రబాబు మెతక వైఖరి ఎందుకు ప్రదర్శిస్తున్నారన్నదే ఇప్పుడు ప్రశ్న. కూటమి ప్రభుత్వానికి శాసనసభలో తిరుగులేని మెజారిటీ ఉంది. పాతిక మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకున్నా వచ్చే నష్టం ఏమీ లేదు. వారిని దారిలో పెట్టడానికి చంద్రబాబు కొరడా ఝుళిపించాలి. మంచితనం, మెతక వైఖరి అన్ని వేళలా మంచివి కావు. నచ్చజెప్పడానికి చేసిన ప్రయత్నాలు ఫలించనప్పుడు భయపెట్టడం ఒక్కటే మార్గం.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

ప్రతి చెరువూ నింపుతాం!

"ఎవరిది అరాచక రాజకీయమో, ఎవరిది అభివృద్ధి రాజకీయమో ప్రజలే తేల్చుకుంటారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం.. వైసీపీకి నూకలు చెల్లిపోయాయనడానికి సంకేతం. -చంద్రబాబు

సీమ అభివృద్ధికి బ్లూప్రింట్

రతనాల సీమగా మారుస్తానని ముందే చెప్పా: సీఎం

- ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా నా సంకల్పాన్ని అడ్డుకోలేరు
- ఏ పని కావాలన్నా వెంకన్నపై భారమేసి బుల్లెట్‌లా దూసుకెళ్తా
- పోలవరం, బనకచర్ల ప్రాజెక్టుల పూర్తి, వంశధార-పెన్నా అనుసంధానం నా జీవితాశయం
- కుప్పానికి కృష్ణమ్మ రాకతో మనసు పులకించింది
- కృష్ణా పుష్కరాలు రెండేళ్ల ముందే వచ్చినట్లుంది
- హంద్రీ-నీవాకు 1999లో నేనే శంకుస్థాపన చేశా
- రెండు దశల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు
- 33 లక్షల మందికి తాగునీరు కూడా: చంద్రబాబు
- కుప్పంలో కృష్ణమ్మకు జలహారతి


కుప్పంలో హంద్రీనీవా కాలువ వద్ద జలహారతి ఇచ్చి కృష్ణమ్మకు సారె సమర్పిస్తున్న సీఎం చంద్రబాబు


హంద్రీనీవా ద్వారా తరలించిన కృష్ణా జలాలతో నింపిన పరమ సముద్రం చెరువులో బోటింగ్ చేస్తూ సీఎం చంద్రబాబు అభివాదం

కుప్పం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ అభివృద్ధికి బ్లూ ప్రింట్ సిద్ధం చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని ముందే మాటిచ్చానని గుర్తుచేశారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా తన సంకల్పాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి సుజల స్రవంతి పథకాలను పూర్తి చేసి అన్ని నియోజకవర్గాలకూ నీళ్లిస్తామని తెలిపారు. హంద్రీ-నీవా కాలువ నుంచి కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు చెందిన చిట్టచివరి చెరువు, కుప్పం పట్టణంలోని పరమసముద్రం చెరువుకు కృష్ణా జలాలు వచ్చిన సందర్భంగా శనివారం ఆయన జలహారతి ఇచ్చారు. అక్కడే పైలాన్‌ను ఆవిష్కరించారు. ఆ సమీపంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. 'కుప్పానికి కృష్ణమ్మ రాకతో

మిగతా 13వ పేజీలో...


విశాఖలో 'సేనతో సేనాని' సమావేశంలో ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

జన సైనికుల కోసం త్రిశూల్

గుర్తింపు-నాయకత్వం-భద్రత

'సేనతో సేనాని' సమావేశంలో **డిప్యూటీ సీఎం పవన్**

- దసరా తర్వాత నాయకులకు శిక్షణ
- పనిచేసేవారినే బాధ్యులుగా తీసుకుంటాం
- పదేళ్ల సమయం ఇవ్వండి నాకు.. దేశ పునర్నిర్మాణ నేతలుగా మారుస్తా
- మండల స్థాయి నుంచి పార్టీని పర్యవేక్షిస్తా
- ప్రతి రోజూ నాలుగు గంటలు కేటాయిస్తా
- సినిమాల్లో హీరోనే అయినా 'లోపల రగిలే అగ్నిగుండం' ఉంది
- కూటమిలో కోపతాపాలు వద్దు
- మేమొచ్చాక చాలానే చేశాం
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాం
- పోలవరానికి వేల కోట్లు తెచ్చాం
- 67 లక్షల మంది తల్లులకు ఆర్థిక సాయం
- దీపం-2 కింద ఉచితంగా కోటి సిలిండర్లు
- బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
- పంచాయతీల్లో 4 వేల కి.మీ. సీసీ రోడ్లు
- 1.2 కోట్ల మందికి తాగునీరు అందించాం

"గత పదేళ్లలో ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొన్నాను.. అవమానాలు భరించాను.. ఇష్టమైన సినిమాలనూ వదులుకున్నాను.. కుటుంబాన్ని విస్మరించాను.. పిల్లల ఎదుగుదలను కూడా గమనించలేకపోయాను. అయితే పార్టీని మాత్రం వదల్లేదు.
- జన సేనాని పవన్ కల్యాణ్

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): క్రియాశీల కార్యకర్తలు నాయకులుగా ఎదిగేందుకు రోడ్ మ్యాప్ రూపొందించానని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. దసరా తర్వాత 'త్రిశూల్' పేరిట శిక్షణ ఇస్తామని తెలిపారు. త్రిశూల్ అంటే

మిగతా 13వ పేజీలో...


12

హాయ్! నేను షియావో!

- ఎస్‌సీఓ సదస్సులో అత్యాధునిక ఏఐ హ్యుమనాయిడ్ రోబో సేవలు
- ఇంటర్వ్యూ చేసిన ఏఎన్ఐ వార్తా సంస్థ
- భావోద్వేగాలను గుర్తించే అల్గారిథమ్స్
- తక్షణ సమాచారం ఇచ్చే డేటాబేస్‌లు
- సాంస్కృతిక తటస్థత, కచ్చితమైన సమాచారం, పనితీరులో మెరుగుదల.. ఇవే నా ప్రమాణాలు: షియావో హీ


చైనాలోని తియాన్‌జిన్ విమానాశ్రయంలో ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న కళాకారులు

ట్రంప్ సుంకాలు చట్టవిరుద్ధం

- 'ఐఈఈపీఏ' చట్టం అడ్డగోలు టారిఫ్‌లు విధించేలా అధ్యక్షుడికి అధికారాలు ఇవ్వలేదు
- అమెరికా ఫెడరల్ అప్పీల్స్ కోర్టు తీర్పు
- సుప్రీంకోర్టులో అప్పీలుకు వీలుగా అక్టోబరు 14 వరకు తీర్పు అమలు నిలిపివేత
- తీర్పు ఏకపక్షం.. టారిఫ్‌లు కొనసాగుతాయి
- సుంకాలు తొలగిస్తే అమెరికా సర్వనాశనం
- ఉత్పత్తిదారులు, రైతులకు తీవ్ర నష్టం: ట్రంప్

న్యూయార్క్, ఆగస్టు 30: ప్రపంచ దేశాలపై, ముఖ్యంగా భారత్‌పై అడ్డగోలు సుంకాలతో విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అక్కడి ఫెడరల్ అప్పీల్స్ కోర్టు షాకిచ్చింది. వివిధ దేశాలపై ట్రంప్ వేసిన భారీ సుంకాలు చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. ఈ సుంకాల విధింపు కోసం ట్రంప్ 'అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ)'ను అడ్డుపెట్టుకున్నారని.. నిజానికి ఆ చట్టం అధ్యక్షుడికి

మిగతా 12వ పేజీలో...

ప్రపంచం దృష్టంతా ఆ ముగ్గురిపైనే!

- ఎస్‌సీవో సదస్సు కోసం చైనాకు చేరిన మోదీ.. నేడు జిన్‌పింగ్‌తో భేటీ
- రేపు పుతిన్‌తో సమావేశం

జపాన్ బుల్లెట్ రైలులో మోదీ

- ప్రధాని షిగేరుతో కలిసి ప్రయాణం
- నోబెల్‌కు మోదీ సిఫారసు చేయలేదనే భారత్‌పై ట్రంప్ అక్కసు: ఎన్‌వై టైమ్స్

ఆసుపత్రి రౌండ్స్‌లో డాక్టర్‌కు గుండెపోటు



14

- యువ కార్డియాక్ సర్జన్ మృతి
- చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఘటన

ప్రాణాలు పోస్తూనే ఆగుతున్న ఊపిరి!

- విధుల్లో ఒత్తిడితో కుప్పకూలుతున్న వైద్యులు

ప్రభుత్వంలో వైసీపీ ఫేక్‌లు!



- ఏకంగా ఫేక్ జీవోల సృష్టి
- సర్కారు ప్రతిష్ఠ దిగజార్చే యత్నం
- సచివాలయంలోని కీలక విభాగాల్లో జగన్ సానుభూతిపరుల హల్‌చల్
- వారి అండతోనే జీవోలు.. లీకులు
- నాడు జగన్ ప్రమాణ స్వీకారంతోపాటే సచివాలయం, శాఖల్లో ఒకేసారి బదిలీలు
- కూటమి సర్కారులో నేటికీ మీనమేషాలు
- నకిలీ పోస్టులు, జీవోలపై ఖండనకే సరి
- కఠిన చర్యలు తీసుకోకపోతే కష్టాలే

వైసీపీ ఫేక్ ముఠా పేట్రేగి పోతోంది. ఏది వాస్తవమో.. ఏది అవాస్తవమో.. గుర్తించలేనంతగా చెలరేగిపోతోంది. ఇప్పటి వరకు రాజధాని అమరావతిపై విషం కక్కిన వైసీపీ నకిలీ ముఠా.. ఇప్పుడు ప్రభుత్వ వ్యవహారాల్లోనూ చొరబడింది. జీవోల విషయంలోనూ నకిలీ మకిలి అంటిస్తోంది. ఈ బురదను కడుక్కోవడం, నకిలీలకు చెక్ పెట్టడం వరకే పరిమితమవుతున్న చంద్రబాబు ప్రభుత్వం.. ఫేక్ ముఠాపై కఠిన చర్యలకు ఉపక్రమించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

నకిలీ: అమరావతిలో కుల వివక్ష అంటూ వీడియోల హల్‌చల్.
నిజం: తమిళనాడులో జరిగిన ఘటనకు మసిపూసి ఇక్కడ జరిగినట్లుగా ఫేక్ ప్రచారం.

నకిలీ: జీవో 1575ను సృష్టించి.. ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలు ఇవ్వలేక.. విరమణ వయసు పెంచారని ప్రచారం.
నిజం: జీవో 1575.. ఓ ఐఏఎస్ అధికారి ఇంటి అద్దెకు సంబంధించిన జీవో.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేలా వైసీపీ ఫేక్ గ్యాంగులు రోజు రోజుకూ బరితెగిస్తున్నాయి. ఏకంగా ఫేక్ జీవో(నకిలీ ఉత్తర్వులు)లు సృష్టిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు అమరావతిపైనా.. దివ్యాంగుల పింఛన్లపైనా అసత్య ప్రచారాలు చేసిన వైసీపీ ఫేక్ ముఠా.. ఈసారి ఫేక్ జీవోలతో ప్రజల్లో గందరగోళం సృష్టించి, ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నాలు

మిగతా 14వ పేజీలో...

బొగ్గు కాదు బూడిద!

- బ్రహ్మదీయ కోల్ బ్లాక్‌లో 26 శాతం బూడిదే
- రూ.వేల కోట్ల ఆదాయం రావడం ఒట్టి మాటే
- ప్రభుత్వాన్ని హెచ్చరించిన అధ్యయన సంస్థ
- జగన్ హయాంలో ఏపీకి కేటాయించిన కేంద్రం
- ఏ అధ్యయనం చేయకుండానే గుడ్డిగా ముందుకు
- అనుమతులు, భూసేకరణకు 120 కోట్ల వ్యయం
- మరో రూ.1,300 కోట్లు పెట్టుబడులకూ సిద్ధం
- ఆ బొగ్గు ఎందుకూ పనికిరాదని తాజాగా నిర్ధారణ

గ్రేట్ ఎస్కేప్

- ప్రాజెక్టు నుంచి తప్పుకోవాలని నిర్ణయం
- రూ.313 కోట్ల బ్యాంక్ గ్యారంటీలు వెనక్కొచ్చే చాన్స్
- కూటమి సర్కారు ముందుచూపుతో తప్పిన భారం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని కూటమి సర్కారు పెనుభారం నుంచి త్రుటిలో బయటపడింది. జార్ఖండ్‌లోని బ్రహ్మదీయ బొగ్గు గనిలో 26 శాతం బూడిదే ఉందని తాజాగా వెల్లడైంది. దీంతో ఆ ప్రాజెక్టుపై రూ.1,300 కోట్ల పెట్టుబడులు పెట్టాలని భావించిన ప్రభుత్వం ఒక్కసారిగా అప్రమత్తమైంది. కేంద్రంతో సంప్రదించి ఏకంగా ప్రాజెక్టు నుంచి బయటపడాలని

మిగతా 12వ పేజీలో...

ఆలయాల నిధులు దేవుళ్లకు మాత్రమే.. 3

మతపరమైన విధులకే వినియోగించాలి.. ఇతరత్రా మళ్లించరాదు: మద్రాస్ హైకోర్టు

ఎఫ్-1 వీసా నిబంధనల్లో త్వరలో మార్పులు 12

అమల్లోకి వస్తే వర్సిటీ, కోర్సుల మార్పు కష్టమే.. కోర్సులు చేస్తూ ఉండిపోలేరు

వరుస మరణాల మిస్టరీ ఏంటి?



సర్వేలో వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మీ

- గుంటూరు జిల్లా తురకపాలెంలో బెంబేలెత్తిస్తున్న అంతుచిక్కని వ్యాధి
- ఇటీవల కాలంలో 30 మంది మృతి
- జ్వరం, కీళ్ల నొప్పులతో మొదలు
- వైద్యం చేసినా నిరుపయోగమే
- కొత్త సూక్ష్మజీవి కారణమనే భయం
- వివరాలు సేకరించిన వైద్య ఆరోగ్య శాఖ
- ల్యాబ్ పరీక్షలకు రోగుల రక్త నమూనాలు

గుంటూరు మెడికల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో అప్పటి వరకు ఆరోగ్యంగా, చలాకీగా ఉన్న వారు అంతుచిక్కని వ్యాధితో ఉన్నట్టుండి పడిపోతున్నారు. జ్వరం, కీళ్ల నొప్పులతో మొదలవుతున్న వ్యాధి చివరకు ప్రాణాలు తీసేస్తోంది. గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో ఈ పరిస్థితి నెలకొంది. ఈ చిన్న గ్రామంలో ఇటీవల 30 మంది అర్ధంతరంగా మరణించారు. వ్యాధితో బాధపడుతున్నవారిని ఆసుపత్రికి తరలించినా ఉపయోగం ఉండటం లేదని బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కొత్త వైరస్ లేదా బ్యాక్టీరియా వల్ల ఈ మరణాలు సంభవిస్తున్నాయా? అని గ్రామస్థులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. వరుస మరణాలతో వారు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. ఈ మరణాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ దృష్టి సారించింది. ఎపిడిమిక్ సెల్ ద్వారా శుక్ర, శనివారాల్లో గ్రామంలో సర్వే నిర్వహించారు. అది ఇంకా కొనసాగనుంది. ఎపిడిమిక్ బృందంతో పాటు గుంటూరు వైద్య కళాశాలకు చెందిన ఎస్‌పీఎం, మైక్రో బయాలజీ వైద్యనిపుణులు, జనరల్ మెడిసిన్ వైద్యుల బృందం తురకపాలెంలో పర్యటించారు. మృతి చెందిన 25 మంది వ్యక్తులను గుర్తించి వారి కుటుంబ సభ్యులతో మరణ కారణాలపై పలు ప్రశ్నలు అడిగి (వెర్బల్ అటాప్సీ) వివరాలు తెలుసుకున్నారు. ముందస్తు జాగ్రత్తగా వ్యాధి అనుమానిత కుటుంబ సభ్యుల నుంచి రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. గ్రామంలో మంచినీటి నమూనాలను కూడా కోసం సేకరించి పరీక్షిస్తున్నారు.

దోమ కాటు వల్ల వస్తోందా?

దోమ కాటు వల్ల కొందరు ఈ వ్యాధి బారిన పడ్డారని గ్రామస్థులు చెబుతున్నారు. దోమ కుట్టిన ప్రాంతంలో బొబ్బలు మాదిరిగా ఏర్పడ్డాయని తెలిపారు. అనంతరం వ్యాధిగ్రస్తులు మృతి చెందారు. మరి కొందరికి చీప్ లిక్కర్ అలవాటు కూడా ఉందని తేలింది. దీని ప్రభావం ఏమైనా ఉందా అనేది నిర్ధారించాల్సి ఉంది. అయితే మరణాలకు వైరస్/బ్యాక్టీరియా జ్వరాలు కారణం కాదని వైద్య బృందాలు తమ ప్రాథమిక పరిశీలనలో వెల్లడైనట్లు తెలిసింది. ఇప్పటి వరకు గుర్తించిన 25 మంది మృతుల్లో 10 మంది మహిళలు, 15 మంది పురుషులు ఉన్నారు. వీరిలో ఆరుగురు 65 ఏళ్లు పైబడిన వారు ఉండగా, మిగిలిన 19 మంది 60 ఏళ్లలోపు వారే. ఈ మరణాలకు జీవనశైలి వ్యాధులే కారణమని కొందరు నిపుణుల అభిప్రాయం. అయితే అసలైన కారణాలు ఏమిటో నిగ్గు తేలాల్సి ఉంది. రెండు రోజుల్లో రక్తనమూనాలు, నీటి నమూనాల పరీక్ష ఫలితాలు వైద్య ఆరోగ్య శాఖకు అందుతాయని తెలిసింది.

ఎమ్మెల్యే రాకతో వెలుగులోకి..

ఇటీవల తురకపాలెంలో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆ గ్రామానికి వెళ్లారు. అప్పుడు ఈ మరణాల గురించి తెలిసింది. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు సుమారు 30 మంది చనిపోయినట్లు తెలియడంతో ఎమ్మెల్యే వెంటనే ఈ విషయాన్ని డీఎంహెచ్‌వో దృష్టికి తెచ్చారు. ఆ తర్వాత తాత్కాలికంగా గ్రామంలో సర్వే చేసి మిన్నకుండిపోయారు. ఆ తర్వాత కూడా మరో మూడు మరణాలు సంభవించడంతో, స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని నేరుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆరోగ్య శాఖ డైరెక్టరేట్ కలెక్టర్ నాగలక్ష్మిని వివరణ కోరింది. వెంటనే స్పందించిన కలెక్టర్.. ఈ మరణాలపై సమగ్ర నివేదిక అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మిని ఆదేశించారు. దీంతో వైద్యా ఆరోగ్య యంత్రాంగం చర్యల చేపట్టింది.

జ్వరాలు, కీళ్లనొప్పులతో చనిపోతున్నారు



తురకపాలెంలో గడిచిన కొంతకాలంగా 30 మందికి పైగా చనిపోయారు. అందరూ జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడ్డారు. నెల కిందట మా నాన్న శౌరీబాబు జ్వరం, కీళ్ల నొప్పుల బారిన పడ్డారు. గుంటూరులో ప్రైవేటు వైద్యశాలలో చేర్పించాం. కీళ్ల దగ్గర నీరు చేరిందని, తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌గా మారిందని డాక్టర్లు తెలిపారు. అంతుబట్టని జబ్బుకు చికిత్స పొందుతూ మానాన్న మృతి చెందారు. ప్రభుత్వం స్పందించి గ్రామంలో తగిన చర్యలు చేపట్టాలి.

- పౌలేష్, తురకపాలెం



నెల్లూరులో జరిగిన 'స్త్రీ శక్తి' ర్యాలీ సందర్భంగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి నారాయణ సతీమణి రమాదేవి, మహిళలు



నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలో 'స్త్రీ శక్తి' విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, మహిళలు

కదిలిన స్త్రీ శక్తి

ఉచిత బస్సు విజయవంతంపై పలుచోట్ల ర్యాలీలు

- భారీ సంఖ్యలో పాల్గొన్న మహిళా లోకం
- నెల్లూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం
- హామీలన్నీ నెరవేరుస్తున్నాం: మంత్రి నారాయణ
- చంద్రబాబు ఎప్పటికీ మహిళా పక్షపాతే..
- నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- చంద్రగిరిలో ర్యాలీకి పోటెత్తిన నారీమణులు

నెల్లూరురూరల్/కొలిమిగుండ్ల/చంద్రగిరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (స్త్రీ శక్తి పథకం) విజయవంతంపై శనివారం రాష్ట్రంలోని పలుచోట్ల భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు మంత్రులు, నాయకులతో పాటు మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. నెల్లూరులో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నెల్లూరు నగర టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్త్రీ శక్తి ర్యాలీలో మంత్రి నారాయణ, రమాదేవి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ తన అపార అనుభవంతో సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ పేద, నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు ఉపయోగపడేవని తెలిపారు. చెప్పిన మాట ప్రకారం మెగా డీఎస్సీ నిర్వహణ ద్వారా దాదాపు 16 వేల మంది నూతన ఉపాధ్యాయుల నియామకాలు పూర్తి కావొచ్చాయన్నారు. నగరంలోని గాంధీబొమ్మ నుంచి పప్పుల వీధి వరకు ఈ ర్యాలీ కొనసాగింది.



తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగిన భారీ ర్యాలీ

చంద్రబాబు, పవన్, లోకేశ్‌లకు ధన్యవాదాలు

నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండల కేంద్రంలో జరిగిన ఉచిత బస్సు విజయోత్సవ ర్యాలీలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. ర్యాలీకి మండల వ్యాప్తంగా మహిళలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎప్పటికీ మహిళా పక్షపాతిగా ఉంటారని పేర్కొన్నారు. ప్రభుత్వంపై విషం చిమ్మడమే లక్ష్యంగా వైసీపీ నాయకులు పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. తిరుపతి జిల్లా చంద్రగిరిలోనూ భారీ సంఖ్యలో మహిళలు ర్యాలీ చేపట్టారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లకు ధన్యవాదాలు చెబుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకరరెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, నాని సతీమణి సుధారెడ్డి పాల్గొన్నారు.

సగం బార్లు మిగులు

- ఘోరంగా విఫలమైన కొత్త బార్ పాలసీ
- 466 బార్లకే లాటరీలో లైసెన్స్‌లు జారీ
- రేపటి వరకు గడువు పొడిగింపు
- ఎల్లుండి లాటరీ తీస్తామన్న ఎక్సైజ్ శాఖ
- దరఖాస్తులే రాని 421 బార్లకు త్వరలోనే రీనోటిఫికేషన్

అమరావతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కొత్త మద్యం పాలసీ మొట్టమొదటిసారి రాష్ట్రంలో ఘోరంగా విఫలమైంది. గతంలో షాపులకు గానీ, బార్లకు గానీ పాలసీ ప్రకటిస్తే వ్యాపారులు ఎగబడేవారు. అలాంటిది తొలిసారి ఈ వ్యాపారం వద్దంటూ వెనకడుగు వేయడం విస్తుగొల్పుతోంది. సగానికిపైగా బార్లకు ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం గమనార్హం. చివరకు మిగతావాటికే శనివారం లాటరీ నిర్వహించి లైసెన్సీలను ఎంపిక చేశారు. ఓపెన్ కేటగిరీలో 840, కల్లుగీత కులాలకు 84 బార్లకు (మొత్తం 924) ఇటీవల నోటిఫికేషన్ జారీ అయింది. ఓపెన్ కేటగిరీ బార్లు 388, గీత కులాల బార్లు 78 శనివారం లాటరీలోకి వచ్చాయి. ఇంకా 458 బార్లు దరఖాస్తులు రాక మిగిలిపోయాయి. వీటిలో 37 బార్లకు నాలుగు కంటే తక్కువ దరఖాస్తులు అందాయి. 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ తీయాలనే నిబంధన ఉండడంతో వాటికి లాటరీ నిర్వహించలేదు. ఈ 37 బార్లకు దరఖాస్తులు సమర్పించే గడువును సోమవారం సాయంత్రం 6 గంటల వరకు పొడిగించారు. 2న లాటరీ తీస్తారు. అసలు దరఖాస్తులు రాని 421 బార్లకు త్వరలో రీనోటిఫికేషన్ జారీచేస్తామని ఎక్సైజ్ శాఖ వెల్లడించింది. కోనసీమ జిల్లాలో ఒక్క బార్‌కు మాత్రమే లాటరీ తీశారు. విశాఖ, ఎన్టీఆర్, గుంటూరు, తిరుపతి జిల్లాల్లో కొంత మెరుగు. మరీ ఆశ్చర్యంగా గీత కులాల బార్లలోనూ 6 మిగిలిపోయాయి. గీత కులాలకు రాష్ట్రవ్యాప్తంగా 84బార్లు కేటాయించారు. వాటికి లైసెన్స్ ఫీజు 50 శాతమే. తీరా చూస్తే ఆరు బార్లకు 4 దరఖాస్తులు రాక లాటరీనే నిర్వహించలేదు.

పూర్తిగా తప్పిన అంచనా..

ఈ స్థాయిలో బార్ పాలసీ విఫలమవుతుందని ఎక్సైజ్ అధికారులు ఊహించలేదు. అయితే ఈ పాలసీ బాగోలేదని వ్యాపారులు తొలి నుంచీ చెబుతూనే వచ్చారు. వారిని పట్టించుకోకుండా అన్ని బార్లకూ దరఖాస్తులు అందుతాయనే భ్రమలో అధికారులు ఉండిపోయారు. తీరా చివరి రోజు వచ్చే నాటికి దరఖాస్తుల సంఖ్య చూసి కంగుతిన్నారు. అది కూడా మూడు రోజులు గడువు పొడిగించడంతో ఈ సగం బార్లయినా వెళ్లాయి. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. కేవలం 56 బార్లకే దరఖాస్తులు వచ్చాయి. ఇప్పుడు దరఖాస్తులే రాకుండా మిగిలిపోయిన 421 బార్లకు రీనోటిఫికేషన్‌లో లైసెన్సీలు కచ్చితంగా వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే మిగిలిపోయిన బార్లపై వ్యాపారుల్లో పెద్దగా ఆసక్తి ఉండదని ఎక్సైజ్ శాఖ వర్గాలే అంటున్నాయి.



బార్‌లకు లాటరీ తీసే కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మి శా, బార్ లైసెన్సులు పొందిన గీత వృత్తిదారులు

'ఈ-పంట' సమాచారమే రైతు పథకాలకు కీలకం

- సెప్టెంబరులోగా నమోదు పూర్తి చేయాలి: అగ్రి డైరెక్టర్ డిల్లీరావు

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ-పంట నమోదు ప్రక్రియను సెప్టెంబరు 30లోగా పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం 'ఈ-పంట' నమోదుపై వ్యవసాయ, ఉద్యాన, పట్టు శాఖల మండల, జిల్లా అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇప్పటి వరకు 2.61కోట్ల ల్యాండ్ పార్శిల్స్‌లో కేవలం 21.07లక్షల ల్యాండ్ పార్శిల్స్ (8%) మాత్రమే చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు, వ్యవసాయ రంగానికి అమలు చేసే పథకాలకు ఈ-పంట సమాచారం కీలకమని గుర్తు చేశారు. పంటలు సాగైన భూమితో పాటు వ్యవసాయేతర, బీడు భూములను కూడా ఈ-పంట పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. విపత్తు నష్టాలు, ఉల్లి, తోతాపురి మామిడి, బర్లీ పొగాకు ధరల వంటి అంశాల్లో ఈ-పంట సమాచారం అత్యంత కీలకమైందని చెప్పారు. ఉద్యాన, పట్టు శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ 40లక్షల ఎకరాల ఉద్యాన పంటల విస్తీర్ణంలో ఇప్పటికి కేవలం 6వేల ఎకరాలే నమోదు చేశారన్నారు. ఇక నుంచి ప్రతి వారం సమీక్ష జరుపుతామని చెప్పారు.

అగ్రి ఇంజనీర్లకు పదోన్నతులు

వ్యవసాయశాఖలో 2024-25 ప్యానల్ సంవత్సరానికి ఐదుగురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు పదోన్నతులు లభించాయి. అయితే నలుగురు డీఈఈలకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా ప్రభుత్వం పోస్టింగులిస్తూ శనివారం ఉత్తర్వులు ఇచ్చింది.



నరేంద్రనాథ్

ఐటీబీపీ కానిస్టేబుల్ ఆత్మహత్య

» 56వ బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌లో ఘటన

ఆనందపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం పందలపాక సమీపంలోని 56వ ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌లో ఒక కానిస్టేబుల్ (జీడీ) శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్టు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు. కర్నూలు జిల్లా డోన్ మండలం ఆర్ఎస్ రంగాపురం ప్రాంతానికి చెందిన జగదల నరేంద్రనాథ్ (32) ఐటీబీపీలో కానిస్టేబుల్‌గా (జీడీ)గా పనిచేస్తున్నారు. 2014లో పోలీస్ శాఖలో చేరిన నరేంద్రనాథ్ గత 15 నెలలుగా 56వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. శుక్రవారం గార్డు విధులు నిర్వర్తిస్తూ రాత్రి ఏడు గంటల ప్రాంతంలో బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌లోని మామిడి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు బెటాలియన్ ఇన్‌చార్జి సూరజ్ ప్రకాష్‌జోషి ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి సీఐ చింతా వాసునాయుడు, ఎస్ఐ సంతోష్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. నరేంద్రనాథ్ కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతున్నారని, గతంలో ఢిల్లీలో చికిత్స తీసుకున్నారని తెలిసింది. నెల రోజుల కిందట ఒకసారి ఆత్మహత్యకు యత్నించినట్టు సమాచారం.

ప్రాణం తీసిన కుటుంబ కలహాలు

» ఆత్మహత్య చేసుకున్న అసిస్టెంట్ ప్రొఫెసర్

» రావికంపాడు వద్ద రైలు కింద పడి మృతి

» తనను క్షమించాలంటూ వాట్సాప్ మెసేజ్



శ్రీనివాస్

తొండంగి/తుని రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మట్ల శ్రీనివాస్(36) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ కలహాలే అతడి మరణానికి కారణమని తెలుస్తోంది. ఆత్మహత్య చేసుకునే ముందు 'నన్ను క్షమించండి' అంటూ తల్లిదండ్రులకు, పిల్లలకు వాట్సాప్ మెసేజ్ పెట్టారు. కాకినాడ జిల్లాలోని తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని తొండంగి మండలం రావికంపాడు రైల్వే యార్డు సమీపంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. తుని రైల్వే ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు, మృతుడి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తొండంగి మండలం రావికంపాడు గ్రామానికి చెందిన మట్ల శ్రీనివాస్(36) కాకినాడ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీలో కాంట్రాక్టు పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 13ఏళ్లుగా పనిచేస్తున్నారు. అతడు భార్య దివ్య, పిల్లలు సాన్విత(11), అవినాష్(8)లతో కలిసి కాకినాడలో నివసిస్తున్నారు. భార్యభర్తల మధ్య వచ్చిన వివాదం కారణంగా అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో భార్య కేసు పెట్టారు. దీంతో మనస్తాపానికి గురైన పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్నానంటూ తండ్రికి చెప్పి బయటకు వెళ్లారు. ఇంటి నుంచి వెళ్లిన శ్రీనివాస్ రావికంపాడు రైల్వే యార్డు సమీపంలో రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని రైల్వే పోలీసులు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్తానని చెప్పి.. వెళ్లిన కాసేపటికే 'క్షమించండి' అంటూ సాన్విత, అవినాష్, అమ్మానాన్నలకు మెసేజ్ పెట్టాడని, దాన్ని చూసి అతడి కోసం గాలించగా.. రైలు పట్టాలపై శవమై కనిపించాడని బంధువులు చెప్పారు. గతంలో రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో శ్రీనివాస్ తల్లి గంగ నడవలేని స్థితిలో ఉన్నారు. తనకు మందులు తెచ్చి ఇచ్చి.. ఇంతలోనే ఈ దారుణానికి పాల్పడ్డాడని ఆ తల్లి విలపిస్తోంది. తండ్రి కూడా తీవ్ర అనారోగ్యంతో ఉన్నారు. ఇంటికి ఆసరాగా ఉన్న కొడుకు.. కళ్లెదుటే కడతేరిపోవడంతో వారిని ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు.

వచ్చే మార్చికల్లా డయాఫ్రం వాల్

» 2027 డిసెంబరునాటికి ఈసీఆర్ఎఫ్ డ్యాం పూర్తి

» పోలవరం ఇంజనీరింగ్ అధికారుల వెల్లడి

» రెండోరోజూ ప్రాజెక్టు వద్ద విదేశీ నిపుణులు, కేంద్ర అధికారుల పర్యటన

» నేడు రాజమండ్రిలో మరోసారి సమావేశం



పోలవరం ప్రాజెక్టు వద్ద నెలకొల్పిన క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌లో విదేశీ నిపుణులు, అధికారులు

అమరావతి/పోలవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జలశక్తి శాఖతో చేసుకున్న ఒప్పందం మేరకు వచ్చే ఏడాది మార్చి నాటికి డయాఫ్రం వాల్‌ను పూర్తి చేస్తామని పోలవరం ప్రాజెక్టు అధికారులు తెలిపారు. 2027 డిసెంబరునాటికి ప్రధానమైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాంను నిర్మిస్తామని చెప్పారు. పోలవరం పర్యటనలో భాగంగా రెండో రోజు ప్రాజెక్టు, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో అమెరికా, కెనడా నిపుణులు జియాస్ ఫ్రాంకో డి సిస్కో, డేవిడ్ బి.పాల్, కెనడాకు చెందిన రిచర్డ్ డొనెల్లీ, కేంద్ర జలశక్తి శాఖ అధికారులు.. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకూ మెటీరియల్ నాణ్యతా పరీక్షల తీరును పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ల్యాబ్ పనితీరును పరిశీలించాక.. నిపుణులతో పాటు కేంద్ర జలశక్తి శాఖ కూడా సంతృప్తి వ్యక్తం చేసింది. ఇప్పటి వరకూ నాణ్యతా పరీక్షలు కాంట్రాక్టర్ల ల్యాబ్‌లలో కొనసాగగా.. విదేశీ నిపుణుల సూచనలతో జలవనరుల శాఖ అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆడ్హాక్ ల్యాబ్‌లో తాజాగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నాణ్యతా ప్రమాణాల ఫలితాలను పరిగణనలోకి తీసుకుని.. నిర్మాణాలపై నిపుణులు జలవనరుల శాఖకు తుది సూచనలు చేస్తారు. ఉదయం 11.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో గ్యాప్ 1, 2 నిర్మాణం తదితర అంశాలపై ఏకబిగిన 7 గంటలు సమీక్షించారు. ఇందులో అత్యధిక భాగం.. ఈసీఆర్ఎఫ్ డ్యాంను నిర్మించే గ్యాప్-1, గ్యాప్-2 ప్రాంతాలపై దృష్టి సారించారు. ఈ రెండు నిర్మాణాల డిజైన్లను జలశక్తి శాఖ, నిపుణుల బృందం పరిశీలించి.. సంతృప్తి వ్యక్తం చేశాయి. ఈఎన్‌సీ నరసింహమూర్తి, మేఘా సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీశ్‌బాబు ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పనుల్లో వివిధ దశలను వివరించారు. డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు, నాణ్యతపైనా నిపుణులు, కేంద్ర అధికారులు సంతృప్తి చెందారు. నిర్మాణం ఎప్పటిలోగా పూర్తి చేస్తారని నిర్మాణ సంస్థ బావర్‌ను నిపుణులు ప్రశ్నించారు. ముందస్తు ఒప్పందం మేరకు.. 2026 మార్చినాటికి పూర్తిచేస్తామన్న విశ్వాసాన్ని ఆ సంస్థ వ్యక్తం చేసింది.

ప్రైమావీరా సాఫ్ట్‌వేర్‌ను మరింత అభివృద్ధి చేయాలి..

పోలవరం ప్రాజెక్టు నిర్మాణాల డిజైన్లు.. పనులు, వ్యయాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్ ప్రైమావేరా ద్వారా అందుబాటులో ఉంచాలని ఎప్పటి నుంచో కేంద్ర జలశక్తి శాఖ ఆదేశిస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం తొలిసారిగా అదే సాఫ్ట్‌వేర్ ద్వారా అంతర్జాతీయ నిపుణులకు, కేంద్ర బృందానికి ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణ పనుల వివరాలను వెల్లడించే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నాన్ని కేంద్ర బృందం స్వాగతించి అభినందించింది. అయితే కొన్ని సమస్యలు కనిపిస్తున్నాయని.. వాటిని సరిదిద్దుకోవాలని.. ఈ సాఫ్ట్‌వేర్‌ను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించింది. కాగా.. నిపుణులు, కేంద్ర బృందాల సభ్యులు ఆదివారం రాజమహేంద్రవరంలో జలవనరుల శాఖ అధికారులతో పోలవరం నిర్మాణాల తీరు, డిజైన్లపై మరోసారి సమీక్ష నిర్వహిస్తారు.

ఆలయాల నిధులు దేవుళ్లకు మాత్రమే..

ఇతర కార్యక్రమాలకు మళ్లించరాదు

» మతపరమైన విధులకే వినియోగించాలి

» గుడుల అభివృద్ధి, నిర్వహణకు వాడాలి

» వాటికే భక్తులు విరాళంగా ఇస్తారు.. మద్రాస్ హైకోర్టు స్పష్టీకరణ

» కల్యాణ మండపాల నిర్మాణానికి తమిళనాడు ప్రభుత్వం ఇచ్చిన జీవోలు కొట్టివేత

చెన్నై, ఆగస్టు 30: భక్తులు విరాళంగా ఇచ్చిన నిధులు దేవుడికి మాత్రమే చెందుతాయని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. ఇతర కార్యక్రమాలకు ఆ నిధులను మళ్లించకూడదని తేల్చి చెప్పింది. ఆ నిధులను మతపరమైన, దాతృత్వ కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని పేర్కొంది. ఈ మేరకు మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ తీర్పు ఇచ్చింది. ఆలయాల నిధులతో కల్యాణ మండపాలు నిర్మించడానికి 2023-25 మధ్య తమిళనాడు ప్రభుత్వం ఇచ్చిన ఐదు జీవోలను జస్టిస్ ఎస్ఎం సుబ్రమణియమ్, జస్టిస్ జీ అరుల్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. ఆలయాల నిర్వహణ, అభివృద్ధికి మాత్రమే ఆలయాల నిధులు వినియోగించాలని, కల్యాణ మండపాలు వంటి వాణిజ్య అవసరాలకు వాటిని మళ్లించకూడదని చెప్పింది. హిందూ రెలిజియస్ అండ్ చారిటబుల్ ఎండోమెంట్స్ యాక్ట్- 1959 ప్రకారం పూజలు, అన్నదానం, యాత్రికుల సంక్షేమం, పేదలకు సహాయం వంటి కార్యక్రమాలకు తప్ప, ఆదాయార్జన కార్యక్రమాలకు నిధులను మళ్లించకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆలయాల్లో అర్చనాది కైంకర్యాలు, నిర్వహణ, అభివృద్ధికి భక్తులు స్థిర, చరాస్తులు సమర్పిస్తారని, వీటిని ప్రభుత్వ నిధులుగా భావించరాదని పేర్కొంది. ఆలయాలతో భక్తులకు భావోద్వేగంతో కూడిన ఆధ్యాత్మిక అనుబంధం ఉంటుందని తెలిపింది. ఆలయాల నిధుల మళ్లింపును సవాల్ చేస్తూ రవికుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు విచారించింది. ఈ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ వీరా కథియరావన్ వాదనలు వినిపించారు. హెచ్ ఆర్ అండ్ సీఈ చట్టంలోని 36 ఏ, బీ సెక్షన్ల ప్రకారం ఆలయాల నిధులు వినియోగించుకోవచ్చని అన్నారు. ప్రభుత్వం నిర్మించే కల్యాణ మండపాలు స్వాభావికంగా హిందువులకు ఉద్దేశించినవే అని చెప్పారు. ఇప్పటి వరకు ఎలాంటి నిధులు విడుదల కాలేదన్నారు. ఈ వాదనలను హైకోర్టు తిరస్కరించింది. ఒక్కసారి ఇలాంటి వాటికి అనుమతి ఇస్తే ఆలయాల నిధులు పక్కదారి పట్టే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది. హిందూ భక్తుల హక్కులకు భంగం వాటిల్లినట్లే అవుతుందని పేర్కొంది.

ఊరేగింపులకు భద్రత.. పోలీసులదే బాధ్యత!

» వినాయక నిమజ్జనాలపై హైకోర్టు స్పష్టీకరణ

» సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరణ

» ఆదోని డీఎస్పీ దాఖలు చేసిన అప్పీల్ కొట్టివేత

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించే విగ్రహాల నిమజ్జనాలను పురస్కరించుకుని చేసే ఊరేగింపులు శాంతియుతంగా, సాఫీగా సాగేందుకు తగిన భద్రత కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులదేనని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అవసరమైతే అదనపు భద్రతా బలగాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. కర్నూలు జిల్లా, ఆదోనిలో ఈనెల 31న ప్రధాన రహదారి మీదుగా వినాయక నిమజ్జనం ఊరేగింపు నిర్వహణకు విశ్వహిందూ పరిషత్, వినాయక ఉత్సవ కమిటీకి అనుమతి ఇవ్వడంతో పాటు భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యానికి ధర్మాసనం నిరాకరించింది. మరోవైపు, ఇతర మతాల మనోభావాలు దెబ్బతీయకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని నిర్వాహకులకు స్పష్టం చేసింది. ఆదోని డీఎస్పీ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం శనివారం ఉత్తర్వులు ఇచ్చింది. కర్నూలుజిల్లా, ఆదోనిలో వినాయక విగ్రహాలను ఎల్ఎల్‌సీ కాలువలో నిమజ్జనం చేసేందుకు పట్టణంలోని ఆర్ట్స్ కాలేజ్, శ్రీకృష్ణదేవాలయం, ఎమ్మిగనూరు సర్కిల్, అనంత మంగళ ఆంజనేయస్వామి దేవస్థానం, నిర్మలా టాకీస్, టూటౌన్ పోలీస్ స్టేషన్, శ్రీనివాస బ్రిడ్జి, కొత్తబ్రిడ్జి రూట్‌లో ఊరేగింపునకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఎ. బసవన్న గౌడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి పిటిషనర్ సమర్పించిన వినతిలో పేర్కొన్న రూట్ మ్యాప్‌లో వినాయక నిమజ్జన ఊరేగింపునకు అనుమతించాలని పోలీసులను ఆదేశించింది. ఊరేగింపును పర్యవేక్షించడంతో పాటు సమస్యలు సృష్టించేవారిపై కన్నేసి ఉంచేందుకు కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఊరేగింపుని రికార్డు చేయాలని పోలీసులను ఆదేశించింది. అయితే, విశ్వహిందూ పరిషత్ ఇచ్చిన రూట్ మ్యాప్‌లో మసీదు ఉందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉన్నందున సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేయాలని ఆదోని డీఎస్పీ ధర్మాసనం ముందు అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. డీఎస్పీ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. విశ్వహిందూ పరిషత్ ప్రతిపాదించిన దారిలో 2011లో ఓసారి రెండు వర్గాల మధ్య ఘర్షణలు జరిగాయన్నారు. మసీదు ఉన్న ప్రాంతంలో కాకుండా వేరే మార్గంలో వెళ్లాలని మాత్రమే పోలీసులు సూచించారని తెలిపారు. ఈ వాదనలను ద్విసభ్య ధర్మాసనం తోసిపుచ్చింది.

12 పర్యాటకంలో 12 వేల కోట్ల పెట్టుబడులు

» పీపీపీ విధానంలో పర్యాటక రంగ అభివృద్ధి

» టూరిస్ట్ సర్క్యూట్‌లతో స్థానిక ప్రాంతాల సందర్శన

» పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ విశాఖలో యాత్రీ నివాస్ ప్రారంభం



విశాఖలో యాత్రీనివాస్ ప్రారంభం సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేశ్. చిత్రంలో ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావు ఉన్నారు

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో ముందుకు వెళుతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. రాష్ట్రంలో పర్యాటక రంగానికి ఇప్పటివరకూ రూ.12 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. విశాఖపట్నంలోని అప్పుఘర్ వద్ద రూ. 13.5 కోట్లతో అభివృద్ధి చేసిన హరిత రిసార్ట్ (యాత్రీ నివాస్)ను ఆయన శనివారం ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావులతో కలిసి ప్రారంభించారు. యాత్రీ నివాస్‌లో గదులు, సమావేశ మందిరం పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లలో పర్యాటక రంగాన్ని వైసీపీ నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఏపీటీడీసీకి చెందిన హోటళ్లు, రిసార్ట్‌ను ఆధునికీకరించి పర్యాటకులకు అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. అల్లూరి జిల్లాలోని తైడా, జంగిల్ బెల్స్ పనులు వేగవంతం చేశామన్నారు. విశాఖపట్నం వచ్చే పర్యాటకులు సింహాచలం, అనకాపల్లి, స్థానిక ప్రాంతాలు సందర్శించేలా టూరిస్ట్ సర్క్యూట్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సాయం చేస్తోందని వెల్లడించారు. లంబసింగి, వంజంగి గ్రామాల్లో కేంద్ర సహకారంతో పర్యాటక అభివృద్ధికి చర్యలు చేపటామన్నారు. వివిధ పథకాల కింద అఖండ గోదావరి, గండికోట, సూర్యలంక బీచ్‌లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

సెప్టెంబరు 5 నుంచి ఫుడ్ ఫెస్టివల్: ఎంపీ ఎం.శ్రీభరత్

విశాఖలో హోటల్స్‌తో కలిసి పర్యాటక శాఖ ఫుడ్ ఫెస్టివల్‌ను సెప్టెంబరు 5 నుంచి 7 వరకు నిర్వహిస్తోందని ఎంపీ శ్రీభరత్ చెప్పారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను పర్యాటక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అంతకుముందు మంత్రి దుర్గేశ్.. ఆర్కే బీచ్‌రోడ్డులో హాప్ ఆన్.. హాప్ ఆఫ్(డబుల్ డెక్కర్) బస్సుల టికెట్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ జగదీశ్, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జయమాధవి పాల్గొన్నారు.

నేడు విజయనగరానికి గోవా గవర్నర్

విజయనగరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు ఆదివారం విజయనగరం జిల్లాకు రానున్నారు. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి ఆయన విజయనగరం వస్తుండడంతో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి అశోక్ గజపతిరాజు రోడ్డుమార్గంలో 4.15 గంటలకు విజయనగరంలోని నివాసానికి చేరుకుంటారు. ఆది, సోమవారాల్లో విజయనగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు.

మహిళా కమిషన్‌కు త్వరలో వెబ్‌సైట్

» సులభంగా గుర్తుండేలా కొత్త టోల్ ఫ్రీ నంబర్ తెస్తాం: రాయపాటి శైలజ

రాజమహేంద్రవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర మహిళా కమిషన్‌కి ఇప్పటి వరకూ వెబ్‌సైట్ లేదు. త్వరలో అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నాం. అలాగే ప్రస్తుత టోల్‌ఫ్రీ నంబరులోని అంకెలు తగ్గించి సులభంగా గుర్తుండే విధంగా నూతన నంబరును అందుబాటులోకి తెస్తాం' అని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మహిళా భద్రతపై నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'స్కూళ్లల్లో విద్యపైనే దృష్టి పెడుతున్నాం. హక్కులు, బాధ్యతలను తెలియచేసే, వాస్తవిక దృక్పథాన్ని పెంచే అంశాలనూ పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు మోరల్ క్లాసెస్ ఉండేవి. వాటిని పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత నేడు ఉంది. కారణాలేమైనా గృహ హింస కేసుల సంఖ్య పెరిగింది. ఆడపిల్లలు పెద్దలు చెప్పినా వినిపించుకోకుండా సోషల్ మీడియా, ఆన్‌లైన్ స్నేహాలు అంటూ చదువుకోవాల్సిన వయసులో తీసుకునే తొందరపాటు నిర్ణయాల వల్ల కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అమ్మాయి, అబ్బాయి ఎలా నడుచుకోవాలి? ఎలా గౌరవించుకోవాలి? వంటి అంశాలపై ఇంట్లో పెద్దలు కూడా వారికి చెప్పాలి' అని శైలజ సూచించారు. మహిళా పోలీస్ స్టేషన్లలో 90 శాతం మహిళా ఉద్యోగులు, కౌన్సెలర్లు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రభుత్వానికి సిఫారసు చేశాం' అని చైర్‌పర్సన్ తెలిపారు.

హౌసింగ్‌లో 23 మంది ఏఈలకు పదోన్నతి

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పని చేస్తున్న 23 మంది హౌసింగ్ ఏఈలకు ప్రభుత్వం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(డీఈఈ)గా పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదోన్నతులు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికనే అమలవుతాయని, న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై తుది తీర్పులను అనుసరించి ఎప్పుడైనా నోటీసులు ఇవ్వకుండా, కారణాలు చెప్పకుండానే తిరిగి ఏఈలుగా నియమిస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్‌గా విల్సన్

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్‌గా నెల్లూరుకు చెందిన ఆర్‌డీ విల్సన్‌ను ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్లపాటు ఈ పదవిలో ఆయన కొనసాగుతారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీవారి సేవలో డీజీపీ, జస్టిస్ జ్యోతిర్మయి





తిరుమల ఆలయం ముందు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, హరీశ్‌కుమార్ గుప్తా

తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన స్వామిని దర్శించుకున్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కూడా వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

14, 15 తేదీల్లో తిరుపతిలో మహిళా పార్లమెంటేరియన్ల సమావేశం

» 18 నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

నర్సీపట్నం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 14, 15 తేదీల్లో తిరుపతిలో మహిళా పార్లమెంటేరియన్ల సమావేశం నిర్వహిస్తున్నట్టు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి 300 మంది మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సమావేశానికి హాజరవుతారన్నారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వనున్నదని తెలిపారు. సెప్టెంబరు 14న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, సీఎం చంద్రబాబు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, 15న ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవుతారని వివరించారు. 18 నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమవుతాయని అయ్యన్న చెప్పారు.

ఇన్‌చార్జి డీఎంఈగా రఘునందన్

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖలో కీలకమైన వైద్య విద్య డైరెక్టర్(డీఎంఈ)గా డాక్టర్ జి.రఘునందన్‌కు అవకాశం దక్కింది. అదనపు డైరెక్టర్‌గా రెండేళ్లు పూర్తి చేసుకుని, మరో ఏడాదిపైన సర్వీస్ ఉన్న సీనియర్ వైద్యుడిని మాత్రమే డీఎంఈగా నియమించాలని ప్రభుత్వం ముందుగానే నిర్ణయించింది. ఆ అర్హతలున్న ఏకైక సీనియర్ వైద్యుడు రఘునందన్ మాత్రమే కావడంతో ఆయనను ఇన్‌చార్జి డీఎంఈగా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం డీఎంఈగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ డీవీఎల్ నరసింహం ఆదివారం రిటైర వుతుండటంతో ఆయన స్థానంలో కొత్త డీఎంఈని నియమించాల్సి వచ్చింది. ఎవరిని నియమించాలన్న అంశంపై మంత్రి కార్యాలయం దాదాపు నెల రోజులు కసరత్తు చేసింది. చివరికి అన్ని అర్హతలున్న రఘునందన్ పేరును మంత్రి కార్యాలయం ప్రతిపాదించింది. ఆయన నియామకానికి సీఎం చంద్రబాబు కూడా ఆమోదం తెలిపారు. దీంతో ఇన్‌చార్జి డీఎంఈగా రఘునందన్‌ను నియమిస్తూ ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా గుత్తి గ్రామానికి చెందిన రఘునందన్ ఆర్థోపెడిక్స్ వైద్యుడిగా సేవలందించారు. కడప, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం, విజయవాడ బోధనాస్పత్రుల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం డీఎంఈ కార్యాలయంలో అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహిస్తున్నారు. డీఎంఈగా తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు, మంత్రి సత్యకుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఏనుగు దాడిలో గుంటూరు జిల్లా వ్యక్తి మృతి

తమిళనాడు నీలగిరి జిల్లాలో ఘటన

చెన్నై, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని నీలగిరి జిల్లాలో ఏనుగు దాడి చేయడంతో గుంటూరు జిల్లాకు చెందిన వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పెన్స్ టాక్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లో వంటమాస్టర్‌గా పని చేస్తున్న గుంటూరు జిల్లాకు చెందిన పేర్లి సుగంధరావు (36) శుక్రవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో తన గది నుంచి బయటకు వచ్చాడు. అదే సమయంలో అక్కడకు వచ్చిన ఏనుగు.. అతనిపై హఠాత్తుగా దాడి చేసింది. దీంతో అతను అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఊటీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

• ఆర్కే RK

తెలుగునాట ఇప్పుడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక నియోజకవర్గంలో సగటున 30 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. వచ్చే ఎన్నికల నాటికి ఈ మొత్తం ఇంకా పెరుగుతుంది. తెలుగు రాష్ట్రాలలో ఎన్నికలు ఖరీదైన వ్యవహారంగా మారాయి. 1985 ఎన్నికల్లో వెనుకబడిన శ్రీకాకుళంలోని ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి తెలుగు దేశం తరపున పోటీ చేసిన ప్రతిభా భారతికి అయిన ఎన్నికల వ్యయం ఎంతో తెలుసా? కేవలం పది వేల రూపాయలు! అదే ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల నుంచి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన జీవన్ రెడ్డికి అయిన వ్యయం 15 వేల రూపాయలు మాత్రమే. తన వద్ద ఉన్న పది వేలు సరిపోవని, మరో ఐదు వేలు పార్టీ తరపున ఇప్పిస్తే గెలిచి వస్తానని ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎన్టీఆర్‌ను జీవన్ రెడ్డి కోరగా, మరుసటి రోజు ఎన్టీఆర్ ఆ ఐదు వేలూ సర్దుబాటు చేయించారు. అప్పట్లో పదివేలు మాత్రమే ఖర్చు చేసిన నియోజకవర్గాలలో ఇప్పుడు పది కోట్లు కూడా సరిపోవడం లేదు. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో ఖర్చు వంద కోట్లు దాటుతోంది. దీంతో ఎన్నికల్లో చేసిన ఖర్చును తిరిగి రాబట్టుకోవడం కోసం శాసనసభ్యులు బరితెగించాల్సి వస్తోంది.

ఎమ్మెల్యేలు.. వసూల్ రాజాలు!

తెలుగునాట.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పలువురు శాసనసభ్యులు వారి ముఖ్యమంత్రులకు కంట్లో నలుసుల్లా తయారవుతున్నారా? ఎం.ఎల్.ఎ. అంటే మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ.. అంటే చట్టసభ సభ్యులు. చట్టసభల్లో చట్టాలు చేస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేయాల్సిన శాసనసభ్యులే ఇప్పుడు ప్రజలపాలిట సమస్యగా మారుతున్నారు. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో కొంత మంది శాసనసభ్యులు లేని అధికారాలను సంక్రమింప జేసుకొని ఆయా నియోజకవర్గాలలో ప్రజలు గాలి పీల్చుకోవాలన్నా తమ అనుమతి తప్పనిసరి అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. 2004 నుంచి ప్రారంభమైన ఈ ధోరణి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో వెర్రి తలలు వేస్తోంది. జగన్మోహన్ రెడ్డి హయాంలో శాసనసభ్యులకు అపరిమిత స్వేచ్ఛను ఇవ్వడంతో వారు ప్రభుత్వ కార్యాలయాలను తమ అజమాయిషీలోకి తెచ్చుకున్నారు. ఇప్పుడు కూటమి ఎమ్మెల్యేలకూ అదే ఆదర్శమైంది. గతానికి భిన్నంగా ఈ జాడ్యం ఇప్పుడు తెలంగాణకు కూడా విస్తరించింది. 2009లో ఎమ్మెల్యేగా ఎన్నికైన లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ మంచినీటి సరఫరా, డ్రైనేజీ వంటి స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చిన వారిని ఉద్దేశించి, వాటి గురించి స్థానిక ప్రజాప్రతినిధులైన కార్పొరేటర్లకు చెప్పాలని సూచించేవారు. ఇది ప్రజలకు రుచించలేదు. అది వేరే విషయం! 1983కు ముందు గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఉనికి ఉండేది కాదు. అక్కడి ప్రజా సమస్యలను స్థానిక సంస్థలే పరిష్కరించేవి. అప్పట్లో ఎమ్మెల్యేలు ప్రజలకు పెద్దగా అందుబాటులో ఉండేవారు కారు. ఎమ్మెల్యేలను కలుసుకోగలిగే పరిస్థితి జిల్లా స్థాయిలో కొద్దిమందికే ఉండేది. ఇక మంత్రులు, జిల్లా కలెక్టర్లను కలుసుకోవడం అరుదైన అవకాశంగా ఉండేది. అలా కలుసుకోగలిగిన వారికి పలుకుబడి ఉన్నట్టు పరిగణించేవారు. ఆ తర్వాత ఎన్టీఆర్ హయాంలో ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేశారు. దీంతో ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరగక తప్పలేదు. ఫలితంగా ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలను, కుటుంబ పంచాయితీలను పరిష్కరించవలసిందిగా కూడా ఎమ్మెల్యేలను కోరేవారు. మొగుడూ పెళ్లాల పంచాయితీలు తామెందుకు పరిష్కరించాలని ఆ రోజుల్లో ఎమ్మెల్యేలు విసుక్కొనేవారు. హైదరాబాద్‌లో ఉండే తమ ఎమ్మెల్యేలను తెలంగాణ జిల్లాలకు చెందిన ప్రజలు వచ్చి కలుసుకొని బాధలు చెప్పుకొనేవారు. కొంతమందైతే తిరుగు ప్రయాణాలకు చార్జీలు ఇవ్వవలసిందిగా ఎమ్మెల్యేలను కోరేవారు. తమను కలవడానికి వచ్చిన వారికి కాఫీ, టీలు తాగించడంతో పాటు భోజనం, వసతి కూడా ఏర్పాటు చేయవలసి రావడంతో శాసనసభ్యులు ఆర్థికంగా నలిగిపోయేవారు. పెళ్లిళ్లు, చావులకు వెళ్లడం విధిగా మారింది. అదే సమయంలో ఖర్చుల కోసం డబ్బు కూడా డిమాండ్ చేసేవారు. తెలంగాణలో ఇప్పటికీ ఈ పరిస్థితి ఉంది. కొంత కాలం క్రితం ఒక లారీ డ్రైవర్ తమ నియోజకవర్గ ఎమ్మెల్యేకు ఫోన్ చేసి తాను డ్యూటీ మీద దూరంగా ఉన్నాననీ, పురిటి నొప్పులతో బాధపడుతున్న తన భార్యను ఆస్పత్రిలో చేర్పించి ప్రసవం చేయించవలసిందిగా కోరారు. ఇలాంటి విచిత్రమైన అనుభవాలను శాసనసభ్యులు గతంలో పంచుకొనేవారు. ఇదంతా గతం. ఇప్పుడు ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాలకు సామంత రాజులుగా, దండ నాయకులుగా తయారయ్యారు. తెలంగాణలో కూడా ఈ పోకడలు మొదలయ్యాయి. తెలంగాణలో యూరియా కొరత ఇప్పుడు ప్రధాన సమస్యగా ఉంది. రైతులు ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన రామగుండం ఎరువుల కంపెనీ తెలంగాణలో ఉన్నప్పటికీ సాంకేతిక సమస్యలు తలెత్తి ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో యూరియా కొరత మరింత తీవ్రమైంది. ఈ పరిస్థితుల్లో ఎవరైనా ఏమి చేస్తారు? ఎరువుల ఫాక్టరీలో మరమ్మతులను వేగంగా పూర్తిచేయించి ఉత్పత్తి తిరిగి ప్రారంభమయ్యేలా చేస్తారు. కానీ అధికార పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. మరమ్మతుల కాంట్రాక్టు పొందిన సంస్థ ప్రతినిధులు తనను కలసి తన సంగతి ఏమిటో తేల్చకపోతే ఎలా అని భీష్మించుకొని కూర్చున్నారు. ఈ వ్యవహారం మంత్రి, ముఖ్యమంత్రి వరకూ వెళ్లింది. దీంతో సంబంధిత శాఖ మంత్రి కల్పించుకొని సదరు ఎమ్మెల్యేను పిలిపించుకొని సర్దిచెప్పారు. ఈ ధోరణిని ఏమనాలి? ఇల్లు తగలబడుతుంటే బొగ్గులు ఏరుకోవడానికి ప్రయత్నించినట్టుగా లేదా? కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన కూడా తమ పార్టీ ఎమ్మెల్యేలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ఈ విషయంలో ఒకరికొకరు ఆదర్శం అయ్యారు. ఫలితంగా తెలంగాణలో గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాలలో ఎమ్మెల్యేల ఆధిపత్యం పెరిగిపోయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారం చేయాలన్నా ఎమ్మెల్యేల అనుమతి తప్పనిసరి చేశారు. పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ కట్టాలన్నా శాసనసభ్యుడి అనుమతి ఉండాలని నిర్దేశించారు. దీంతో యావత్ అధికార యంత్రాంగం రాజకీయ నాయకుల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. ఒకవైపు లేని అధికారాలను అనుభవిస్తూ, మరోవైపు భూ కబ్జాలు, దందాలలో ఎమ్మెల్యేలు మునిగితేలారు. ఫలితంగా 2023 ఎన్నికలకు ముందు భారత రాష్ట్ర సమితికి చెందిన శాసనసభ్యులపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. అయినప్పటికీ ఆ ఎన్నికల్లో కేసీఆర్ అభ్యర్థులను మార్చకుండా పాతవాళ్లు అందరికీ టికెట్లు ఇచ్చారు. అప్రతిష్ఠపాలైన శాసనసభ్యులను మార్చి ఉంటే కేసీఆర్ అధికారం కోల్పోయి ఉండేవారు కాదన్న అభిప్రాయం భారత రాష్ట్ర సమితి ముఖ్యులలో ఇప్పటికీ ఉంది.

నాడు 10 వేలు.. నేడు 30 కోట్లు!

ప్రభుత్వ వ్యవహారాలలో శాసనసభ్యులు జోక్యం చేసుకొనే విధానం 2004 నుంచే మొదలైంది. దీంతో శాసనసభ్యులు అక్రమ సంపాదనకు అలవాటుపడ్డారు. ఇప్పుడు అదొక హక్కుగా మారింది. ముఖ్యమంత్రులు సైతం ఎమ్మెల్యేలను అదుపు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి రాష్ట్రంలో 2004 తర్వాత పైస్థాయిలో అవినీతి వ్యవస్థీకృతం అయింది. అదే సమయంలో మీరు కూడా సంపాదించుకోండి అన్నట్టుగా ఎమ్మెల్యేలకు స్వేచ్ఛ ఇచ్చారు. దీంతో చట్టసభల సభ్యులు జనం మీద పడ్డారు. ఐదేళ్లపాటు సంపాదించిన డబ్బుతో ఎన్నికల్లో మళ్లీ గెలవడానికి విచ్చలవిడిగా ఖర్చు చేయడం మొదలుపెట్టారు. దీంతో తెలుగునాట ఇప్పుడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక నియోజకవర్గంలో సగటున 30 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. వచ్చే ఎన్నికల నాటికి ఈ మొత్తం ఇంకా పెరుగుతుంది. తెలుగు రాష్ట్రాలలో ఎన్నికలు ఖరీదైన వ్యవహారంగా మారాయి. 1985 ఎన్నికల్లో వెనుకబడిన శ్రీకాకుళంలోని ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి తెలుగుదేశం తరఫున పోటీ చేసిన ప్రతిభా భారతికి అయిన ఎన్నికల వ్యయం ఎంతో తెలుసా? కేవలం పది వేల రూపాయలు! అదే ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసిన జీవన్ రెడ్డికి అయిన వ్యయం 15 వేల రూపాయలు మాత్రమే. తన వద్ద ఉన్న పది వేలు సరిపోవని, మరో ఐదు వేలు పార్టీ తరఫున ఇప్పిస్తే గెలిచి వస్తానని ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎన్టీఆర్‌ను జీవన్ రెడ్డి కోరగా, మరుసటి రోజు ఎన్టీఆర్ ఆ ఐదు వేలూ సర్దుబాటు చేయించారు. అప్పట్లో పదివేలు మాత్రమే ఖర్చు చేసిన నియోజకవర్గాలలో ఇప్పుడు పది కోట్లు కూడా సరిపోవడం లేదు. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో ఖర్చు వంద కోట్లు దాటుతోంది. దీంతో ఎన్నికల్లో చేసిన ఖర్చును తిరిగి రాబట్టుకోవడం కోసం శాసనసభ్యులు బరితెగించాల్సి వస్తోంది. విత్తు ముందా? చెట్టు ముందా? అన్నట్టుగా పరిస్థితి తయారైంది. చివరికి ముఖ్యమంత్రులు కూడా ఎమ్మెల్యేలను అదుపు చేయలేని పరిస్థితులు దాపురించాయి. ఇక ప్రభుత్వానికి బొటాబొటీ మెజారిటీ ఉంటే ఎమ్మెల్యేలను సంతృప్తిపరచడానికే ముఖ్యమంత్రి తన సమయాన్ని వెచ్చించాల్సి వస్తోంది. తెలంగాణలో అధికార పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే అసంతృప్తితో ఉన్నట్టు తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితులు ఆయనతో మాట కలపగా 'ఎన్నికల్లో ఖర్చు చేసిన పైసలు రాబట్టుకోవాలిగా! 25 కోట్ల రూపాయలు పంపండి!' అని కోరారట. దీంతో సదరు మధ్యవర్తులు వెనుదిరగాల్సి వచ్చింది.

హద్దు మీరుతున్న ఎమ్మెల్యేలను బ్లాక్ లిస్టులో పెట్టి, వారిని ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోతే అందరూ దారిలోకి వస్తారు. తమది మంచి ప్రభుత్వమే కాదు– బలమైన, ధృఢమైన ప్రభుత్వమని ప్రజల్లో నమ్మకం కలిగించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబుదే!

బాబు కృషి బూడిదపాలు!

ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేయడం, గెలిచిన వారు తిరిగి ఆ డబ్బు రాబట్టుకోవడానికి తెగబడటం అనేది ఒక విషవలయంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి మరింత వికటిస్తోంది. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక శాసనసభ్యులకు పట్టపగ్గాలు లేకుండా పోయాయి. వ్యవస్థలంటే భయం లేకుండా పోయింది. మీరు అందిన కాడికి దోచుకోండి, నన్ను మాత్రం ఏమీ అడగకండి అంటూ శాసనసభ్యులకు జగన్‌రెడ్డి లైసెన్స్ ఇచ్చేశారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని కూడా కళ్లు మూసుకోమన్నారు. ఎమ్మెల్యే చెప్పిన మాట వినాల్సిందే అని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఫలితంగా రాష్ట్రంలో ఒక రకమైన అరాచక వాతావరణం ఏర్పడింది. రూల్ ఆఫ్ లా గాలికి పోయింది. సహనం నశించిన ప్రజలు 2024 ఎన్నికల్లో అధికార వైసీపీని 11 సీట్లకే పరిమితం చేసి, కూటమికి అఖండ మెజారిటీని కట్టబెట్టారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని దారిలోకి తేవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ముఖ్యమంత్రికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంతో ఏర్పడిన సత్సంబంధాలను వాడుకుంటూ రాష్ట్రానికి ప్రాజెక్టులు, పథకాలు తీసుకురావడానికి చంద్రబాబు కృషి చేస్తున్నారు. ఆయన ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కూడా ముఖ్యమంత్రి కోరిన విధంగా రాష్ట్రానికి సహాయ సహకారాలు అందిస్తోంది. ఉదాహరణకు యూరియా కొరతనే తీసుకుందాం. తెలంగాణలో ఉన్నంత తీవ్రంగా ఆంధ్రప్రదేశ్‌లో యూరియా కొరత లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం కోరిందే తడవుగా కేంద్రం పది వేల టన్నుల యూరియాను సమకూర్చింది. త్వరలో మరో 30 వేల టన్నుల యూరియా సరఫరా కాబోతోంది. విశాఖను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి కూడా కేంద్ర ప్రభుత్వం ఉదారంగా సహకరిస్తోంది. రాష్ట్రాభివృద్ధికి ఉన్నత స్థాయిలో కృషి జరుగుతున్న వేళ క్షేత్ర స్థాయిలో కొంత మంది ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్న తీరును ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. జగన్‌రెడ్డి హయాంలో శాసనసభ్యులు అనుసరించిన ధోరణినే కూటమి ఎమ్మెల్యేలు ఇప్పుడు ఆదర్శంగా తీసుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైలు కదలాలంటే స్థానిక శాసనసభ్యుడి అనుమతి తప్పనిసరి చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఇటీవల ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఒక ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం వెళ్లగా, స్థానిక ఎమ్మెల్యేతో ఒక మాట చెప్పించండి అని సబ్ రిజిస్ట్రార్ అడిగారట. ఆస్తుల క్రయ విక్రయాలతో ఎమ్మెల్యేలకు ఏం పని? అని ప్రశ్నిస్తే సమాధానం ఉండదు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు లే అవుట్లు వేయాలన్నా ఎమ్మెల్యేల అనుమతి తప్పనిసరి. భూ వినియోగ మార్పిడి జరగాలన్నా స్థానిక శాసనసభ్యుణ్ణి సంతృప్తిపరచాలి. చివరికి ఇళ్లు, కార్యాలయ భవనాల నిర్మాణం కోసం మునిసిపల్ అనుమతులు కావాలన్నా శాసనసభ్యుడి పర్మిషన్ ఉండాల్సిందే. జగన్‌రెడ్డి హయాంలో జరిగినట్టుగానే ఇప్పుడు కూడా జరగడం ఏమిటి? అని ప్రజలు చిరాకు పడుతున్నారు. విచిత్రం ఏమిటంటే, శాసనసభకు తొలిసారిగా ఎన్నికైన వారు, కొత్తగా రాజకీయ అరంగేట్రం చేసిన రాజకీయ కుటుంబాల వారసులు ఇలాంటి అరాచకాలకు అధికంగా పాల్పడుతున్నారు. గతంలో శాసనసభ్యులుగా పనిచేసిన వారు ఇలా అన్నింటిలో తల దూర్చడం లేదు. నియోజకవర్గాలను చెరబట్టిన ఎమ్మెల్యేల వల్ల పైస్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన కృషి బూడిదలో పోసిన పన్నీరు అవుతోంది. కూటమి ఎమ్మెల్యేల పోకడల గురించిన సమాచారం ముఖ్యమంత్రి దృష్టికి కూడా వెళుతోంది. అయినా వారిని ఆయన కట్టడి చేయలేకపోతున్నారు. బరితెగించిన ఎమ్మెల్యేలను సందర్భం వచ్చినప్పుడల్లా చంద్రబాబు హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా వారి వైఖరిలో మార్పు లేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత అంటూ ఉంటే అది ఎమ్మెల్యేల వల్లేనని ముఖ్యమంత్రికి తెలియంది కాదు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఇటీవలే అటవీ శాఖ సిబ్బందిపై దాడి చేశారు. అటవీ సంరక్షణ చట్టం ప్రకారం ఇది తీవ్ర నేరం. అయినా సదరు ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారే కానీ అరెస్టు చేయలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఒక ఎమ్మెల్యే భర్త ఆగడాలు శ్రుతి మించాయని నివేదికలు అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు తమ నియోజకవర్గాల్లో అమలు కావాలన్నా కూడా తమను సంతృప్తిపరచాలని కొందరు ఎమ్మెల్యేలు మొరాయిస్తున్నారు. పై నుంచి ఫోన్ చేసి చెప్పినా వారు పట్టు వీడటం లేదు. పలువురు శాసనసభ్యులు కట్టు తప్పుతున్నారని తెలిసినా ముఖ్యమంత్రి చంద్రబాబు మెతక వైఖరి ఎందుకు ప్రదర్శిస్తున్నారన్నదే ఇప్పుడు ప్రశ్న. కూటమి ప్రభుత్వానికి శాసనసభలో తిరుగులేని మెజారిటీ ఉంది. పాతిక మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకున్నా వచ్చే నష్టం ఏమీ లేదు. ఈ విషయంలో ప్రజల తప్పేమీ లేదు. వారు కూటమి ప్రభుత్వానికి అఖండ మెజారిటీ కట్టబెట్టి సుస్థిర ప్రభుత్వాన్ని అందివ్వాలని ఆశీర్వదించారు. అయినా పరిస్థితిలో మార్పు రాకపోవడానికి కారణం ఏమిటి? మా వాళ్లను అదుపు చేయడానికి ఏం చేయాలో అర్థం కావడం లేదని కూటమికి చెందిన ఒక ఎమ్మెల్యే వాపోయారు. గతంలో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు శాసనసభ్యులు బాధ్యతగా ఉండేవారు. వారిలో భయం ఉండేది. ఇప్పుడు నక్సలైట్ల భయం లేకపోవడంతో బరితెగిస్తున్నారు. కొన్ని ఉదంతాలు వింటుంటే మళ్లీ నక్సలైట్లు బలపడాలనిపిస్తోందని మరో సీనియర్ ఎమ్మెల్యే చెప్పుకొచ్చారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నిజానికి శాసనసభ్యులను కట్టడి చేయడం అంత కష్టమేమీ కాదు. అధికారం అండ చూసుకొనే కదా వారు రెచ్చిపోతున్నారు? ఆ అధికారాన్ని వారికి దూరం చేస్తే దారిలోకి వస్తారు కదా? ఇటీవలి కాలంలో మరీ బరితెగించిన శాసనసభ్యులు ఎవరో ముఖ్యమంత్రికి సమాచారం లేకపోలేదు. అలాంటి వారిని అదుపు చేయడానికి ఒకటే మార్గం ఉంది. బరితెగించిన వారి జాబితా రూపొందించి జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫోన్ చేసి ఫలానా ఎమ్మెల్యే ఆదేశాలను పట్టించుకోవద్దని చెబితే దారికి వస్తారు కదా? నియోజకవర్గాలలో ఎమ్మెల్యే మాట చెల్లుబాటు కాకపోతే వారి పరిస్థితి నీటిలో నుంచి బయటపడిన చేపలా తయారవదా? ఈ చిన్న లాజిక్‌ను చంద్రబాబు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియడం లేదు. ఇటు తెలంగాణలో, అటు ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యేలను కట్టడి చేయకుండా దోచుకోవడానికి అనుమతించిన కేసీఆర్, జగన్‌రెడ్డికి ఏ దుస్థితి పట్టిందో చూస్తున్నారు కదా!



చంద్రబాబుపై నమ్మకంతో ఎంతో మంది పార్టీ ఫండ్ ఇచ్చారు. ఆయన కూడా పలువురిని ఒప్పించి, మెప్పించి నిధులు సేకరించి పార్టీ అభ్యర్థులకు అందించారు. అయినా ఎన్నికల్లో గెలవడానికి ఆస్తులు అమ్ముకున్న వారిలా కొంత మంది ఇలా బరితెగించడం ఎందుకు? శాసనసభ్యులకు అపరిమిత అధికారాలు కల్పిస్తూ రావడం వల్లనే ప్రస్తుత దుస్థితి. ప్రభుత్వ కార్యాలయాల రోజువారీ కార్యక్రమాలతో ఎమ్మెల్యేలకు ఏం పని? అధికారులు స్వేచ్ఛగా తమ విధులను నిర్వర్తించే వెసులుబాటు కల్పించాలి కదా? ప్రభుత్వం వేరు– ఎమ్మెల్యే వేరు. అధికార కూటమికి చెందిన వారైనంత మాత్రాన శాసనసభ్యులు చెప్పినంత మాత్రాన అధికారులు, పోలీసులు నడుచుకోవాలని ఏ చట్టంలో ఉంది? చట్టాలు, నిబంధనల అమలు బాధ్యత అధికారులదే! ఎమ్మెల్యే చెప్పారని తప్పు చేసిన అధికారికి మినహాయింపు ఉంటుందా? శాసనసభ్యులు కూడా తాము కేవలం ఐదేళ్ల కాలానికే ఎన్నికయ్యామన్న వాస్తవాన్ని విస్మరించి తమ అధికారం శాశ్వతమని ఎందుకు విర్రవీగుతున్నారో అర్థం కావడం లేదు. అధికారం శాశ్వతం కాదని తెలిసి కూడా వల్లమాలిన అధికారదర్పాన్ని ఒలకబోస్తే రేపటి పరిస్థితి ఏమిటి అన్నది తెలుసుకోవాలి కదా?

దండోపాయమే మందు!

ఈ సందర్భంగా మహాభారతంలోని ధృతరాష్ట్రుడి పాత్ర గురించి చెప్పుకొందాం. ధృతరాష్ట్రుడికి పాండవుల మీద ప్రేమ ఉండేది. తమ్ముడి పిల్లలకు న్యాయం చేయాలని కోరుకొనేవారు. అయితే నిండు సభలో పాండవులకు అన్యాయం జరిగిన సందర్భాలలో కూడా కుమారులైన కౌరవులను కట్టడి చేయలేక మౌనంగా ఉండేవారు. ద్రౌపది వస్త్రాపహరణం సమయంలో కూడా ధృతరాష్ట్రుడు మౌనంగా ఉండిపోయారు. అన్యాయాన్ని నిలువరించే ప్రయత్నం చేయలేదు. ఫలితంగా మహాభారత సంగ్రామం జరిగి కౌరవులు అందరూ హతమయ్యారు. కురు సామ్రాజ్యం అంతరించి పోయింది. అలా అని ధృతరాష్ట్రుడు మంచివాడు కాడని చెప్పలేం. చెడును, అన్యాయాన్ని నిలువరించని వారు ఫలితం అనుభవిస్తారని చెప్పడానికి మహాభారతంలో ఈ ఉదంతాలను పేర్కొని ఉంటారు. వర్తమానంలోకి వస్తే, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మరో ధృతరాష్ట్రుడిగా మిగిలిపోకూడదు. శాసనసభ్యుల పోకడలను అదుపుచేయని పక్షంలో వచ్చే ఎన్నికల్లో కౌరవులకు పట్టిన గతే కూటమి సభ్యులకు పట్టదా? మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం కనుక యుద్ధం బదులు ఎన్నికలు జరుగుతాయి. ప్రజాభిమానం కోల్పోయిన వారందరూ ఓడిపోతారు. రాష్ట్రాన్ని ఒడ్డున పడేయగలరని ఆయన మీద ప్రజలకు నమ్మకం ఉంది. ప్రజల్లో ఉన్న ఈ నమ్మకం కొనసాగాలంటే దారి తప్పిన శాసనసభ్యులను వెంటనే దారిలో పెట్టడానికి చంద్రబాబు కొరడా ఝళిపించాలి. మంచితనం, మెతక వైఖరి అన్ని వేళలా మంచివి కావు. నచ్చజెప్పడానికి చేసిన ప్రయత్నాలు ఫలించనప్పుడు భయపెట్టడం ఒక్కటే మార్గం. నిజానికి కొద్ది మంది మినహా మెజారిటీ ఎమ్మెల్యేలకు ఎన్నికల సమయంలో పార్టీ పరంగానే ఆర్థిక సహాయం అందింది. చంద్రబాబుపై నమ్మకంతో ఎంతో మంది పార్టీ ఫండ్ ఇచ్చారు. ఆయన కూడా పలువురిని ఒప్పించి, మెప్పించి నిధులు సేకరించి పార్టీ అభ్యర్థులకు అందించారు. అయినా ఎన్నికల్లో గెలవడానికి ఆస్తులు అమ్ముకున్న వారిలా కొంత మంది ఇలా బరితెగించడం ఎందుకు? శాసనసభ్యులకు అపరిమిత అధికారాలు కల్పిస్తూ రావడం వల్లనే ప్రస్తుత దుస్థితి. ప్రభుత్వ కార్యాలయాల రోజువారీ కార్యక్రమాలతో ఎమ్మెల్యేలకు ఏం పని? అధికారులు స్వేచ్ఛగా తమ విధులను నిర్వర్తించే వెసులుబాటు కల్పించాలి కదా? ప్రభుత్వం వేరు– ఎమ్మెల్యే వేరు. అధికార కూటమికి చెందిన వారైనంత మాత్రాన శాసనసభ్యులు చెప్పినంత మాత్రాన అధికారులు, పోలీసులు నడుచుకోవాలని ఏ చట్టంలో ఉంది? చట్టాలు, నిబంధనల అమలు బాధ్యత అధికారులదే! ఎమ్మెల్యే చెప్పారని తప్పు చేసిన అధికారికి మినహాయింపు ఉంటుందా? శాసనసభ్యులు కూడా తాము కేవలం ఐదేళ్ల కాలానికే ఎన్నికయ్యామన్న వాస్తవాన్ని విస్మరించి తమ అధికారం శాశ్వతమని ఎందుకు విర్రవీగుతున్నారో అర్థం కావడం లేదు. అధికారం శాశ్వతం కాదని తెలిసి కూడా వల్లమాలిన అధికారదర్పాన్ని ఒలకబోస్తే రేపటి పరిస్థితి ఏమిటి అన్నది తెలుసుకోవాలి కదా? తప్పు చేస్తున్న వారిని దారిలోకి తెచ్చుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నయానో భయానో చేసిన, చేస్తున్న ప్రయత్నాలు ఫలించనందున ఇక మిగిలింది దండోపాయమే. హద్దు మీరుతున్న ఎమ్మెల్యేలను బ్లాక్ లిస్టులో పెట్టి వారిని ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోతే అందరూ దారిలోకి వస్తారు. తమది మంచి ప్రభుత్వమే కాదు– బలమైన, దృఢమైన ప్రభుత్వమని ప్రజల్లో నమ్మకం కలిగించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబుదే!

అపూర్వ ఆధునిక దేవాలయం

తెలంగాణలో మొట్టమొదటి ప్రైవేటు తెలుగు గ్రంథాలయం – శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషా నిలయం ఈ ఏడాది సెప్టెంబర్ 1వ తేదీతో 125వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్నది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని భాషానిలయం ఒకరోజు వేడుకలను ప్రాంగణంలో ఘనంగా నిర్వహించాలని నిలయం సంకల్పించింది. నిజానికి ఈ శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషా నిలయం తరతరాల తెలుగుజాతి వైభవానికి మచ్చుతునక. పేరుకు గ్రంథాలయం కానీ, తెలుగువారికి ఒక కూడలి స్థానంగా అవతరించిన ఒక అపూర్వ ఆధునిక దేవాలయం, ఒక సార్వత్రిక విశ్వవిద్యాలయమిది.

ఇప్పటికి 125 సంవత్సరాల క్రితం తెలుగువారిలో నూతన చైతన్యాన్ని తీసుకువస్తూ ఒకవంక జాతీయోద్యమానికి, మరోవంక గ్రంథాలయ ఉద్యమానికి నమూనాగా దీనిని ఆనాటి పెద్దలు తీర్చిదిద్దినారు. ఈ సంస్థను ఒక గ్రంథాలయంగా నడుపుతూ తెలుగు పుస్తకాలు చదివే అలవాటును జనసామాన్యంలో వృద్ధి చేశారు.

ఉత్తేజితులైన తెలుగువారు ఇక్కడే ప్రథమ నిజాం ఆంధ్రోద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ భాషా నిలయాన్ని కేంద్రస్థానంగా చేసుకొని ఆనాటి యువకులు ఇక్కడ ఎన్నో సంస్థలు నెలకొల్పారు, ఎన్నో ఉద్యమాలు నడిపారు. భాషా నిలయానికి అనుబంధంగా ఒక తెలుగు పాఠశాల కూడా నెలకొల్పి కొన్నాళ్లు జయప్రదంగా నడిపారు. తాను స్వయంగా సంస్కృతాంధ్ర భాషలలో పాండిత్యం కలిగి ఉండటమే కాకుండా తరతరాలకు కరదీపికలైన మహాకావ్యాలకు శ్రీకారం చుట్టిన అష్టదిగ్గజాలైన మహాకవులకు నెలవైన శ్రీకృష్ణదేవరాయల కాలాన్ని స్వర్ణయుగమని ముందుతరాలు మరచిపోకుండా ఉండాలనే తలంపుతో శ్రీకృష్ణదేవరాయల పేరున ఈ భాషా నిలయం స్థాపించినట్లు స్థాపకులలో ముఖ్యులు, తొలి నలభై సంవత్సరాలు భాషా నిలయం అధ్యక్షులుగా సేవలందించిన పోషకులు రాజా నాయని వెంకటరంగారావు 1952లో భాషానిలయం స్వర్ణోత్సవాల సందర్భంగా తెలిపారు. స్వర్ణోత్సవ స్వాగత సమితి అధ్యక్షులుగా వారు చేసిన ప్రసంగంలో "అప్పుడే మార్కెట్‌లోకి తాజాగా వచ్చిన రాబర్ట్ సీవెల్ రాసిన 'ఫర్‌గాటన్ ఎంపైర్' గ్రంథంలో శ్రీకృష్ణదేవరాయల శౌర్యప్రతాపాలు, రాజనీతి ధురంధరత్వం తనను, తన మిత్రులు కొమర్రాజు వెంకట లక్ష్మణరావులను ఎంతగానో ఆకర్షించాయని, సంస్కృతాంధ్రభాషల వికాసానికి రాయలవారు చేసిన సేవలు తమను తన్మయులను చేసిన ఫలితంగా ఆ ఆంధ్రభోజుని అజరామరుణ్ణి చేయడానికి, ఆంధ్రభాషకు తొంటివికాసము సాధించడానికి శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయంను స్థాపించి"నట్లు వివరించారు.


ఈ భాషా నిలయం స్థాపించిన రాజా నాయని వెంకటరంగారావు, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, రావిచెట్టు రంగారావులకు తోడుగా ఆదిపూడి సోమనాథరావు, మైలవరపు నరసింహశాస్త్రి నిలిచారు. ఆ తరువాత కాలంలో హైదరాబాద్ రాష్ట్ర తొలి ప్రజా ముఖ్యమంత్రిగా పనిచేసిన సాహితీవేత్త బూర్గుల రామకృష్ణరావు చేయూత కూడా ఈ భాషా నిలయానికి లభించింది. వీరు భాషా నిలయానికి అధ్యక్షులుగా మూడుసార్లు, కార్యదర్శిగా ఒకసారి సేవలు అందించారు. పోలీసు యాక్షన్‌కు ముందు 1940 నుంచి కీలక సమయంలో హైదరాబాద్ నగర కొత్వాలుగా పనిచేసిన రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి ఈ భాషా నిలయానికి పదేళ్ల పాటు అధ్యక్షులుగా ఉన్నారు. ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు, ఆదిరాజు వీరభద్రరావు మొదలగువారు కార్యదర్శులుగా ఈ సంస్థ ప్రగతికి ఎంతగానో పాటుపడ్డారు. రావిచెట్టు రంగారావు 1901 నుంచి దాదాపు పదేళ్ల పాటు భాషా నిలయం కార్యదర్శిగా పనిచేసి 1910లో ఆకస్మికంగా పరమపదించారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషా నిలయం కలకాలం నిలవాలని కాంక్షిస్తూ, నిలయానికి సొంతభవనం కోసం భూమి కొనుగోలుకు రావిచెట్టు రంగారావు ధర్మపత్ని శ్రీమతి లక్ష్మీనరసమ్మ తన భర్త స్మృత్యర్థం 1911లో రూ. 3,000 విరాళంగా ఇచ్చారు. ఆ సొమ్ముతోనే ఇప్పుడు భాషానిలయం ఉన్నచోట పెంకుటిల్లు కొని, కొన్ని మార్పులు చేసి గ్రంథాలయాన్ని నెలకొల్పారు. 1915లో మాడపాటి హనుమంతరావు భాషా నిలయం కార్యదర్శిగా ఉన్న తరుణంలో అంతకు ముందు గల భవనం తొలిదశకు విఖ్యాత ఆంధ్ర ప్రముఖుడు, విద్యావేత్త కట్టమంచి రామలింగారెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఆనాటి నుంచి దినదిన ప్రవర్ధమానమై నగరం నడిబొడ్డున ఉన్న ఈ భాషా నిలయం అనేకమంది సాహితీప్రియులను ఆకర్షిస్తూ తెలుగువారి సమగ్రతను కాపాడుతూ ఎంతో వైవిధ్యమైన, స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఈ సంస్థను దర్శించని ఆంధ్రప్రముఖులు లేరనవచ్చును.



శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషా నిలయం "125వ స్థాపన దినోత్సవ సందర్భంగా భాషా నిలయం భవన నిర్మాణానికి నూట పదేళ్ల క్రితం భారీ విరాళం ఇచ్చిన ప్రథమదాత, భాషా నిలయం తొలి కార్యదర్శి రావిచెట్టు రంగారావు సతీమణి పేరున ప్రతి ఏటా ప్రదానం చేస్తున్న 'శ్రీమతి రావిచెట్టు లక్ష్మీనరసమ్మ స్మారక పురస్కారం – 2025' హైదరాబాద్ బుక్ ట్రస్ట్‌కు చెందిన శ్రీమతి గీతారామస్వామికి తెలంగాణ శాసనమండలి అధ్యక్షులు గుత్తా సుఖేందర్ రెడ్డి సెప్టెంబర్ 1న ప్రదానం చేస్తారు. సాయంత్రం 6:15 గం.లకు భాషా నిలయంలోని రావిచెట్టు రంగారావు సభా నిలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి భాషా నిలయం అధ్యక్షులు డా. కె.వి. రమణాచారి అధ్యక్షత వహిస్తారు. ఈ సందర్భంగా భాషానిలయం పురోభివృద్ధికి కృషిచేసిన కురువృద్ధులు, 90ఏళ్లు దాటిన ప్రముఖులు – నూతి శంకరరావు, కె. చంద్రప్రకాశరావు, ఎ.వి. జనార్ధన్‌రావులను శాసనమండలి అధ్యక్షులు సత్కరిస్తారు. 'భాగ్యనగరం భాషా నిలయం' సాహిత్యరూపకాన్ని 'భువనవిజయం' ఫక్కీలో ప్రయోగాత్మకంగా ప్రదర్శించనున్నారు. 125వ స్థాపన దినోత్సవం సందర్భంగా "పౌర గ్రంథాలయాలు – నాడు, నేడు" అనే అంశంపై గ్రంథాలయ సదస్సును భాషానిలయం నిర్వహించనున్నది. 'తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్' అధ్యక్షులు డా. రియాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ సదస్సును ప్రారంభిస్తారు. ప్రొ. ఎస్. సుదర్శన్‌రావు కీలకోపన్యాసం చేస్తారు.

◆ టి. ఉడయవర్లు
గౌరవ కార్యదర్శి
శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
ఆదివారం 31 ఆగస్టు 2025





• అరటిపండ్లలో వినాయకుడు

జగ్గయ్యపేట పట్టణంలోని బంగారపుకొట్ల సెంటర్‌లో ఉన్న స్వయంభు విఘ్నేశ్వరస్వామిని శనివారం వినూత్నంగా అలంకరించారు. స్వామికి పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించాక.. అరటిపండ్లు, బెల్లంతో అలంకరించారు. అర్చకులు భరధ్వాజ్ ఆధ్వర్యంలో వేదపండితుడు పిల్లలమర్రి నాగకృష్ణశర్మ పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి. - జగ్గయ్యపేట



ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానదిలో వినాయక నిమజ్జనం



స్మార్ట్.. టూ లేట్..

జిల్లాలో నత్తనడకన స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ

- ఇవ్వాల్సిన కార్డులు 5,87,135
- ఇప్పటి వరకు ఇచ్చినవి 2,59,003
- ఇంకా ఇవ్వాల్సినవి 3,23,132
- విజయవాడలో 26.05 శాతం మేర పంపిణీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లాలో స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ నత్తనడకన నడుస్తోంది. పంపిణీ ప్రారంభించి నాలుగు రోజులు కావస్తున్నా రెవెన్యూ యంత్రాంగం నుంచి సహకారం లోపించటంతో ఇప్పటికి కేవలం 44.11 శాతం మేర మాత్రమే రైస్ కార్డులను పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 5,87,135 రైస్‌కార్డులు ఉన్నాయి. ఇప్పటి వరకు కేవలం 2,59,003 స్మార్ట్ రైస్‌కార్డులనే పంపిణీ చేశారు. ఇంకా 3,23,132 స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేయాల్సి ఉంది. అత్యధికంగా ఎ.కొండూరు మండలంలో 69.63 శాతం, అత్యల్పంగా విజయవాడ నగర పరిధిలో 26.05 శాతం కార్డులను పంపిణీ చేశారు.

నగరంలో నత్తనడకన

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడు విజయవాడలోనే ఉన్నాయి. దాదాపు సగం జనాభా నివసించే విజయవాడలో మిగతా 6లో..

రాయబారులు

బార్ల దరఖాస్తుల్లో సిండికేట్ హవా

అనుకూలమైన వాటికే దరఖాస్తులు

- మిగిలిన వాటికి దరఖాస్తులు పడకుండా జాగ్రత్తలు
- గీత కార్మికుల బార్లను పంచుకున్న సిండికేట్లు
- జిల్లాలో 62 బార్లకు లాటరీ పూర్తి
- మరో 68 బార్లకు త్వరలో రీ-నోటిఫికేషన్
- ఒక బార్‌కు రెండు, 12 బార్లకు ఒకే దరఖాస్తు

కొద్దినెలల క్రితం మద్యం దుకాణాలు పంచుకున్న సిండికేట్లు ఇప్పుడు బార్లను పంచుకున్నాయి. ఓపెన్ కేటగిరీ బార్లు, గీత కార్మికులకు కేటాయించిన బార్లకు వచ్చిన దరఖాస్తుల్లో సిండికేట్ ఛాయలు స్పష్టంగా కనిపించాయి. తమకు అనుకూలంగా ఉన్న బార్లకు మాత్రమే దరఖాస్తులు చేసుకుని మిగిలిన వాటికి దరఖాస్తులు పడకుండా సిండికేట్ చక్రం తిప్పింది.



కలెక్టరేట్‌లో లాటరీ తీస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : జిల్లాలో 130 ఓపెన్ కేటగిరీ, 10 గీత కార్మికులకు బార్లను కేటాయిస్తూ ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. 130 ఓపెన్ కేటగిరీ బార్లలో 62 బార్లకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. గీత కార్మికులకు కేటాయించిన అన్ని బార్లకు ఒక్కో దానికి పది దరఖాస్తులు అందాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చిన బార్లకు అధికారులు లాటరీ తీశారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు లాటరీ ద్వారా బార్లను కేటాయించారు. దరఖాస్తులు వచ్చిన 62 బార్లకు లాటరీ తీసి అభ్యర్థులను ఎంపిక చేశారు. బార్‌ను దక్కించుకున్న వ్యక్తి ఇచ్చిన గడువులోపు ఫీజును చెల్లించకపోతే తర్వాత వారికి కేటాయించేలా రిజర్వ్ 1 (ఆర్-1), రిజర్వ్ 2 (ఆర్-2)కు లాటరీ తీశారు. దరఖాస్తులు వచ్చిన 62 బార్‌ల్లో 57 బార్లకు ఒక్కో దానికి ఒక్కొక్కరు చొప్పున నాలుగు దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వ మిగతా 6లో..

'రిజర్వేషన్'ను పంచుకున్న సిండికేట్

జిల్లాలో పది బార్లను గీత కార్మిక కులాలకు కేటాయించారు. ఈ బార్‌ల్లో ఒక్కో దానికి 10-12 దరఖాస్తులు వచ్చాయి. కేటాయించిన పది బార్లకు అభ్యర్థులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. గీత కులాలకు సంబంధించిన వ్యక్తులతో సిండికేట్లకు చెందిన నేతలు దరఖాస్తులు దాఖలు చేయించారు. ఈ రిజర్వేషన్ కేటగిరీ బార్లకు ఈవిధంగా దరఖాస్తులు రావడానికి ప్రధాన కారణం లైసెన్స్ ఫీజు. రిజర్వేషన్ బార్లకు లైసెన్స్ ఫీజును ప్రభుత్వం రూ.35 లక్షలుగా నిర్ణయించింది. ఓపెన్ కేటగిరీ బార్ల ఫీజులో సగం ఫీజునే చెల్లించాలి. అందుకోసమే సిండికేట్‌లో కీలక వ్యక్తులు గీత కులాలకు చెందిన వారి పేరుతో దరఖాస్తులు దాఖలు చేయించారు. రిజర్వేషన్ కేటగిరీలో అన్ని బార్లకు లాటరీ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేశారు.

68 బార్లకు రీ నోటిఫికేషన్

జిల్లాలో 68 బార్‌లకు అధికారులు రీ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఈ 68 బార్‌ల్లో 55 బార్‌లకు ఎలాంటి దరఖాస్తులు రాలేదు. ఒక బార్‌కు రెండు దరఖాస్తులే వచ్చాయి. 12 బార్‌లకు ఒక్కొక్కరు చొప్పున దరఖాస్తు చేశారు. నిబంధనల ప్రకారం దరఖాస్తులు రాకపోవడంతో త్వరలో ఈ 68 బార్‌లకు రీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.



మత్తు కలిపింది ఇద్దరినీ..

ఇంటర్ కాలేజీలో డ్రగ్స్ అలవాటైన శ్రీవాత్సవ్

అవే అలవాట్లు ఉన్న అమ్మాయితో పరిచయం, ప్రేమ

- ఇద్దరూ డ్రగ్స్ కోసం బెంగళూరు పయనం
- అంతటితో ఆగకుండా విశాఖపట్నానికి సరఫరా
- బస్సు విజయవాడ రాగానే పట్టుకున్న పోలీసులు
- ఎండీఎంఏతో పాటు ఎల్ఎస్‌డీ డ్రగ్ స్వాధీనం
- విశాఖపట్నం ప్రేమజంట కేసులో కొత్త కోణాలు
- ప్రేమికులిద్దరికీ వచ్చేనెల 13 వరకు రిమాండ్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : వైజాగ్‌కు చెందిన అర్జాల శ్రీవాత్సవ్, బొడ్డేపల్లి హవీల డిలైట్.. 19 గ్రాముల ఎండీఎంఏతో పాటు ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను ఈగల్ బృందం పట్టుకుని మాచవరం పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ ఇద్దరినీ పోలీసులు ఒకటో ఏసీఎంఎం కోర్టులో శనివారం హాజరుపరచగా, 13వ తేదీ వరకు రిమాండ్ విధించారు. ఈ ఇద్దరి వద్ద ఎండీఎంఏతో పాటు ఎల్ఎస్‌డీ మిగతా 6లో..



పర్యాటకం ప్రైవేట్‌కు..

విజయవాడ డివిజన్ యూనిట్లన్నీ కట్టబెట్టే ప్రయత్నాలు

రూ.10 కోట్ల వార్షికాదాయం వచ్చే పర్యాటక యూనిట్లను రూ.4.50 కోట్లకు 33 ఏళ్ల పాటు ఎవరైనా ప్రైవేట్ సంస్థలకు కట్టబెడతారా? ఘనత వహించిన టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) అధికారులు ఇప్పుడదే చేస్తున్నారు. అతి తక్కువకు పర్యాటక యూనిట్లను కట్టబెట్టడంతో పాటు కేవలం 4 శాతం కడితే నెలరోజుల్లో అప్పగించేస్తామన్న బంపర్ ఆఫర్ కూడా ఇచ్చారు. పర్యాటక శాఖ ఎండీ, చైర్మన్లు కాదంటున్నా.. ఉద్యోగులు ఆందోళన చేస్తున్నా.. పట్టించుకోకుండా పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్‌జైన్ తీసుకున్న ఈ నిర్ణయంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి.

- రూ. 10 కోట్ల ఆదాయమిచ్చేవి రూ. 4.50 కోట్లకే..
- బరంపార్కు, భవానీద్వీపం, సూర్యలంక బీచ్ రిసార్ట్స్, సాగర్, విజయపురి సౌత్ హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు..
- ప్రైవేట్‌కు అప్పగించేందుకు ఆర్ఎఫ్‌పీ విడుదల చేసిన ఏపీటీడీసీ
- పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్‌జైన్ అత్యుత్సాహం
- ఎండీ, చైర్మన్లు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకుండా నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ డివిజన్ పరిధిలోని మూడు జిల్లాల్లోని ఆరు పర్యాటక యూనిట్లను గంపగుత్తగా ప్రైవేట్ సంస్థ చేతుల్లో పెట్టేందుకు పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ (ఆర్ఎఫ్‌పీ)ను విడుదల చేసింది. వస్తున్న ఆదాయానికి భిన్నంగా కారుచౌకగా ప్రైవేట్ సంస్థకు లీజుకిచ్చేలా నోటిఫికేషన్ ఇవ్వటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ జిల్లాలో హరిత బెర్మ్‌పార్క్, భవానీ ద్వీపం, బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్ రిసార్ట్స్, పల్నాడు జిల్లా పరిధిలోని ఎత్తిపోతల హరిత హోటల్, నాగార్జున సాగర్, విజయపురి సౌత్ హరిత హోటల్, ధ్యానబుద్ధ ప్రాజెక్టులను రూ.4.50 కోట్ల అతి తక్కువ రెవెన్యూ షేర్‌తో ప్రైవేట్ సంస్థలను ఆహ్వానించింది. వీటన్నింటినీ వేర్వేరుగా కాకుండా గంపగుత్తగా ప్రైవేటుకు మిగతా 6లో..

లాభాల్లో ఉన్నప్పటికీ..

విజయవాడలోని హరిత బరం పార్కు ద్వారా ఏడాదికి రూ.4 కోట్ల ఆదాయం వస్తోంది. భవానీ ద్వీపం ద్వారా రూ.2 కోట్ల ఆదాయం వస్తోంది. సూర్యలంక బీచ్ రిసార్ట్స్ ద్వారా రూ.3 కోట్ల ఆదాయం వస్తోంది. మిగిలిన ప్రాజెక్టుల ద్వారా రూ.కోటి ఆదాయం వస్తోంది. ఇక్కడే రూ.10 కోట్ల లెక్క తేలుతుండగా, రూ.4.50 కోట్లకు ప్రైవేట్ సంస్థకు ఇవ్వాల్సిన అవసరం ఏమిటన్నది ఉన్నతాధికారులకే తెలియాలి.



భవానీ ద్వీపం

ఉద్యోగుల మెడపై కత్తి

ఏపీటీడీసీలో పనిచేసే ఉద్యోగుల భద్రత కూడా ప్రశ్నార్థకంగా చేశారు. పాతికేళ్ల కిందట ఉద్యోగులకు అనేక పరీక్షలు పెట్టి, ఇంటర్వ్యూలు నిర్వహించి తీసుకోగా, వారికి పర్యాటకంపై శిక్షణ కల్పించాలని, తరచూ పరీక్షలు నిర్వహించాలని నిర్దేశించారు. ఈ పేరుతో పరీక్షల్లో పాస్ కాలేదని ప్రైవేట్ సంస్థ వారిని ఉద్యోగాల నుంచి తొలగించే అవకాశం కల్పించారు.

బ్యాంకులో తాకట్టు పెట్టిన ఆస్తిని లీజుకిస్తారా?

హరిత బరం పార్కును రూ.150 కోట్లకు రామవరప్పాడులోని ఎస్‌బీఐలో తాకట్టు పెట్టారు. వచ్చిన డబ్బుతో కాటేజీల రెన్నోవేషన్ పనులకు టెండర్లు పిలిచారు. రూ.90 కోట్ల వరకు రెన్నోవేషన్ పనులు చేపట్టి పనులను మధ్యలోనే రద్దు చేశారు. మరో రూ.60 కోట్ల పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో బ్యాంకులో తనఖా ఉన్న ఆస్తిని ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టే అధికారం ఏపీటీడీసీకి ఎలా ఉంటుందన్నది ప్రశ్నార్థకంగా మారింది.

బ్లాక్‌మార్కెట్‌కు యూరియాపై విచారణ

ఆంధ్రజ్యోతి కథనానికి కలెక్టర్ లక్ష్మీశ స్పందన

- ఎ.కొండూరు ఎరువుల దుకాణాల తనిఖీ
- రైతుల స్టేట్‌మెంట్ నమోదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎ.కొండూరులోని ఎరువుల వ్యాపారి మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 85 డీఏపీ బస్తాలు

ఎ.కొండూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : 'బ్లాక్ మార్కెట్‌కు యూరియా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ జి.లక్ష్మీశ స్పందించి విచారణకు ఆదేశించారు. మార్క్‌ఫెడ్ డీఎం కె.నాగమల్లిక, ఎ.కొండూరు తహసీల్దార్ కె.లక్ష్మి, తిరువూరు సీఐ గిరిబాబు, ఎస్సై కృష్ణ శనివారం విచారణ నిర్వహించారు. ఈనెల 6న ఎ.కొండూరు రైతు సేవా కేంద్రానికి 15 టన్నుల యూరియా, 10 టన్నుల డీఏపీ, ఈనెల 10న చీమలపాడు రైతు సేవా కేంద్రానికి 15 టన్నుల యూరియా, రామచంద్రాపురం రైతు సేవా కేంద్రానికి 10 టన్నుల యూరియా మొత్తం 40 టన్నుల యూరియా, 10 టన్నుల డీఏపీ సరఫరా అయినట్టు మార్క్‌ఫెడ్ డీఎం కె.నాగమల్లిక తెలిపారు. ఈ ఎరువులు ఎక్కడకు వెళ్లాయి, రైతులకు ఎలా విక్రయించారు, ఎంత ధరకు అమ్మకాలు చేశారనే విషయాలపై విచారణ నిర్వహించారు. రైతు సేవా కేంద్రాలకు గోడౌన్ సౌకర్యం లేనందున ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేసినట్టు ఏవో బి.సాయిశ్రీ తెలిపారు. తమకు యూరియా అందలేదని, రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేయలేదని, బ్లాక్ మార్కెట్‌లో రూ.300 నుంచి రూ.350 వరకు కొనుగోలు చేసినట్టు చీమలపాడు రైతులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రెవెన్యూ సిబ్బంది రామచంద్రాపురం, చీమలపాడు, ఎ.కొండూరు విలేజీ వ్యవసాయాధికారులు, రైతుల నుంచి రాతపూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఎ.కొండూరులో ఎం.ఉమా అనే ఎరువుల వ్యాపారి గోడౌన్‌ను అధికారులు తనిఖీ చేయగా, 85 డీఏపీ, 19:19:19 ఎరువు 25 బస్తాల అక్రమ నిల్వలను గుర్తించారు. చీమలపాడులోని మూడు ఎరువుల షాపులు, రామచంద్రాపురంలో ఒక ఎరువు షాపును అధికారులు తనిఖీ చేశారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం నివేదికను కలెక్టర్‌కు పంపుతామని తహసీల్దార్ కె.లక్ష్మి తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమారి, విజిలెన్స్ ఏవో కిరణ్‌కుమార్, ఎస్సై కృష్ణసాయి, హెడ్ కానిస్టేబుల్ గోపాలరావు పాల్గొన్నారు.

నైపుణ్యంతో ఐటీ కొలువులు

ఎన్టీఆర్ వికాసతో నిరుద్యోగులకు చేయూత

- 8 నెలల్లో 1,500 మందికి ఉపాధి
- ప్రతి వారం ఇంటర్వ్యూలు, ఉద్యోగాలు
- అందరూ వికాసను వినియోగించుకోండి: వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు

8

పేటలో సూరత్ తరహా సెన్సార్స్ నీటి సరఫరా వ్యవస్థ

ప్రయోగాత్మకంగా అమలుకు కౌన్సిల్ ఆమోదం 6

పశువైద్యశాల భవనం శిథిలం

● పెచ్చులూడిన శ్లాబు, పగుళ్లిచ్చిన పిల్లర్లు ● భయం..భయంగా సిబ్బంది విధులు
● వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో మురిగిపోయిన నిధులు ● కూటమి ప్రభుత్వం స్పందించాలని వినతి

ఎన్నో ఏళ్లుగా గుడివాడ పరిసర ప్రాంతంలోని పశువులకు వైద్యం అందించిన రావి భద్రయ్య మెమోరియల్ బహుళార్థ పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. పెచ్చులు ఊడి, పిల్లర్లు పగిలి భీతిగొల్పుతుండడంతో సిబ్బంది విధులను భయం భయంగా నిర్వర్తిస్తున్నారు. 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.4 కోట్లు నిధులు మంజూరైనా, గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అవి మురిగిపోయాయి. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి నూతన భవన నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.



శ్లాబు పెచ్చులూడి, పిల్లర్లు పగిలిపోయిన భవనంలోనే విధులు నిర్వహిస్తున్న రావి భద్రయ్య మెమోరియల్ బహుళార్థ పశువైద్యశాల సిబ్బంది

(ఆంధ్రజ్యోతి - గుడివాడ)

గుడివాడలోని రావి భద్రయ్య మెమోరియల్ బహుళార్థ పశువైద్యశాల భవన దుస్థితి దారుణంగా ఉంది. భవనం పాతది కావడంతో పెచులూడిపడుతున్నాయి. పిల్లర్లు పగిలిపోయాయి. వైద్యశాలకు రావాలంటే పశుపోషకులు భయపడిపోతున్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో అనే భయంతో వైద్యులు, ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పశువైద్యశాలను పూర్తి స్థాయిలో ఆధునీకరించి, నూతన భవనాలు, అధునాతన సదుపాయాలను ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో రూ.4కోట్లు నిధులు మంజూరు చేసింది. పశువైద్యశాల చుట్టూ కొంత స్థలాన్ని వైద్యశాలకు ఇస్తే, విస్తరించి నిర్మాణం చేపట్టాలని టీడీపీ ప్రభుత్వం ఆలోచన చేసింది. ఎన్నికలు రావడం, వైసీపీ అధికారంలోకి రావడంతో నిధులు మురిగిపోయాయి. టీడీపీ హయాంలో మంజూరైన ఏ పనులనూ చేయకూడదని అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో నూతన భవన నిర్మాణం అటకెక్కింది. మాజీ మంత్రి కొడాలి నాని, అప్పటి గుడివాడ మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు నూతన భవన నిర్మాణానికి సహకరించకపోవడంతో రూ.4కోట్లు నిధులు మురిగిపోయాయి.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నూతన భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరవుతాయని పశుపోషకులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో నిధులు తెచ్చి నూతన భవనాన్ని నిర్మించేందుకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దీనిపై దృష్టి సారించారు. ఈ దిశగా అడుగులు వేస్తున్నారు.



భవిష్యత్ భద్రతా దళం వినతి

భవనం ఏ క్షణంలోనైన కూలిపోయే దశలో ఉందని, ప్రస్తుత భవనంలో కార్యకలాపాలు నిర్వహించకుండా నిలుపుదల చేయాలని భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వై.వి మురళీకృష్ణ కోరారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. వెంటనే భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించాలని మురళీకృష్ణ కోరారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఎమినెన్స్ అవార్డు అందుకుంటున్న బీహెచ్ఇఎల్ సీఎండీ కొప్పు సదాశివమూర్తి

సదాశివమూర్తికి స్కోప్ ఎమినెన్స్ అవార్డు

● ఎమ్మెల్యే తాతయ్య, శ్రీరాం సుబ్బారావు అభినందన

జగ్గయ్యపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేటకు చెందిన బీహెచ్ఈఎల్ సీఎండీ కొప్పు సదాశివమూర్తికి పరిశోధన, అభివృద్ధి, నూతన అవిష్కరణల విభాగంలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక స్కోప్ ఎమినెన్స్ అవార్డు లభించింది. దిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సదాశివమూర్తి అవార్డు అందుకున్నారు. సదాశివమూర్తి బీహెచ్ఇఎల్‌లో వివిధ స్థాయిలలో పనిచేసి 2023 జూలైలో సీఎండీగా బాధ్యతలు చేపట్టారు. బీహెచ్ఇఎల్‌కు ప్రతిష్టాత్మక అవార్డును సాధించడంలో కృషి చేసిన సదాశివమూర్తిని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు తదితరులు అభినందించారు.

వీఆర్‌కు జంక్షన్ సీఐ, ఆత్కూరు ఎస్సై

మచిలీపట్నం క్రైమ్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో అలసత్వం చూపిన గన్నవరం సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సై, సీఐలపై వేటు పడింది. ఆత్కూరు ఎస్సై చావా సురేష్, హనుమాన్ జంక్షన్ సీఐ సత్యన్నారాయణలను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

ఆత్కూరు ఎస్సై గన్నవరం-2 ఎస్సై లక్ష్మీ నరసింహ మూర్తి బాధ్యతలు తీసుకోగా, హనుమాన్ జంక్షన్ సీఐగా ప్రస్తుతం గన్నవరం సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న శివప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. గోవులతో వెళ్తున్న లారీని గోసంరక్షణ సమి తి నేతలు పొట్టిపాడు టోల్ గేట్ వద్ద ఆపి ఆత్కూరు పోలీసులకు అప్పగించారు. గోవులను గోశాలకు తరలించే క్రమంలో గో సంరక్షణ సమితి నాయకులకు, ఆత్కూరు ఎస్సై చావా సురేష్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. గోసంరక్షణ సమితి నాయకులు ఎస్సైపై ఉన్న తాధికారులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.



దుర్గమ్మ సన్నిధిలో మంత్రి కొల్లు రవీంద్ర

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను శనివారం రాత్రి మంత్రి కొల్లు రవీంద్ర దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఏఈవో ఎన్.రమేష్ బాబు ఆధ్వర్యంలో అర్చకులు మంత్రి రవీంద్రకు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



వరద తగ్గుముఖం

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేస్తున్న వరద నీరు క్రమేపీ తగ్గుతోంది. శనివారం 2.80 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద వరద ప్రవాహం కొనసాగుతోంది.




కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ మనోహర్, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ రామలక్ష్మి

పేటలో సూరత్ తరహా సెన్సార్స్ నీటి సరఫరా వ్యవస్థ

● ప్రయోగాత్మకంగా అమలుకు కౌన్సిల్ ఆమోదం

జగ్గయ్యపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నీటి సరఫరా వ్యవస్థను సెన్సార్స్, రోబోటిక్ సాయంతో నిర్వహించేందుకు ప్రాజెక్టును రూపకల్పన చేస్తున్నట్టు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర చెప్పారు. కౌన్సిల్‌హాలు లో శనివారం నిర్వహించిన సమావేశంలో చైర్మన్ నూతన విధానాన్ని కౌన్సిలర్లకు వివరించారు. సూరత్ కార్పోరేషన్‌లో రిజర్వాయర్‌లు, సంపులు, వాల్వ్‌ల ఆపరేషన్ మొత్తం సెన్సార్స్, రోబోటిక్ విధానంలో నిర్వహిస్తున్నారని, అదే విధానం అమలు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన సాంకేతిక నిపుణుల బృందంతో అధ్యయనం చేయించామన్నారు. అధునాతన వ్యవస్థ ఏర్పాటుకు రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వ్యయం అవుతుందన్నారు. ఒకసారి పెట్టుబడితో నిర్వహణ వ్యయం తగ్గుతుందని వివరించారు. పురపాలక సంఘం మంచి నీటి సరఫరా విభాగంలో 12 మంది వాల్వ్ ఆపరేటర్లు పనిచేస్తున్నారని చెప్పారు. దీర్ఘకాలంలో పెట్టిన ఖర్చు వెనక్కి రావటంతో పాటు ప్రజలకు సంతృప్తికరంగా, నిర్దిష్ట సమయాల్లో మంచినీటి సరఫరా చేయవచ్చన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. మంచినీటి సరఫరా లోపాలకు సిబ్బంది బాధ్యతారాహిత్యం, వైప ల్యం కూడా కారణమని కౌన్సిల్ సభ్యులు పేర్కొన్నారు. ఈ విధానంపై పూర్తిగా అధ్యయనం చేసి రూ.5 నుంచి రూ.10 లక్షలతో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

ఆక్రమణలపై కౌన్సిలర్ రామలక్ష్మి ఆగ్రహం

పదో వార్డులో మతం రోడ్డులో ఆక్రమణలపై కౌన్సిలర్ కన్నె బోయిన రామలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చే శారు. రైతుబజార్ నుంచి మతం రోడ్డుకు వేసిన సిమెంటు రోడ్డును తుక్కు వ్యాపారులు ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారని, రోడ్డుపై బండ్లు పెట్టి అమ్ముతున్నారని, విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నారని ఆమె చెప్పారు. ప్లాస్టిక్ నిషేధం ఏమైందని ప్రశ్నించారు. స్వచ్ఛాంధ్ర పేరుతో ర్యాలీలు చేస్తే సరిపోతుందా అని అధికారులను నిలదీశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ అధికారులు ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారులు వైఫల్యంపై కౌన్సిలర్ల ఆగ్రహం

ఆర్టీసీ కాలనీలో 20 రోజులగా మంచినీటి సరఫరా నిలిచిపోయినా అధికారులకు చీమకుట్టినట్టు కూడా లేదని, ఎంపీ నిధులతో వచ్చిన వాటర్ ట్యాంకర్లతో కూడా నీరు సరఫరా చేయలేదని చైర్మన్ రాఘవేంద్ర , వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ వట్టెం మనోహర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జంగిల్ క్లియరెన్స్ పేరుతో చేసిన విధ్వంసం వల్ల పైపులైన్ దెబ్బతిందని ఆరోపించారు. అధికారుల తీరు మారటం లేదన్నారు.

కౌన్సిలర్లు మనోహర్, నాగరాజు వాకౌట్

అధికారుల తీరుకు నిరసనగా ప్రతిపక్ష కౌన్సిలర్ వ ట్టెం మనోహర్ వాకౌట్ చేశారు. తన వార్డులో కనీస పనులు జరగ లేదని, తన వేదన అరణ్య రోదన అవుతోందన్నారు. కౌన్సిల్‌లో మాట్లాడేందుకు చైర్మన్ అవకాశం ఇవ్వటం లేదంటూ సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

పాలకపక్ష కౌన్సిలర్ గొట్టే నాగరాజు మాట్లాడుతూ తన వార్డులలో ఆర్నెల్ల క్రితం శంకుస్థాపన చేసిన రోడ్డు పనులు పూర్తి చేయలేదంటూ సమావేశం నుంచి వాకౌట్ చేశారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఆర్జేడీ నాగమణి

స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీతలకు సత్కారం

లబ్బీపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలలో వ్యాయామ ఉపాధ్యాయుల కృషి కీలకమని రాష్ట్ర పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకురాలు (ఆర్జేడీ) జి.నాగమణి అన్నారు.

ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో శనివారం స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.

జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులందరూ ఆటలాడేలా వ్యాయామ ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిన నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ రవిప్రసాద్, వ్యాయమ ఉపాధ్యాయులు టి.శ్రీలత, టి.వి జయ వర్మను, ఇతర ఉపాధ్యాయులను ఆర్జేడీ నాగమణి, జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు సత్కరించారు.

డీఎస్సీ నియామకాల్లో అవకతవకలను సరిచేయాలి

పాయకాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో క్షేత్ర స్థాయిలో జరుగుతున్న అవకతవకలను తక్షణమే సరిచేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అభ్యర్థులకు వ్యక్తిగత కాల్ లెటర్స్ పంపుతామని ప్రకటించడంతో ఎదురైన వ్యతిరేకతతో ఈనెల 22న మెరిట్ జాబితాను ప్రకటించారన్నారు. నియామక ప్రక్రియలో అనేక అవకతవకలు జరగడంతో అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. సెలక్షన్ జాబితాను ప్రకటించకపోవడం, కేటగిరీల వారీగా కట్ ఆఫ్ మార్కులను విడుదల చేయకపోవడం, కొందరు అభ్యర్థుల లాగిన్‌లో కాల్ లెటర్స్ కనిపించకపోవడం వంటి సమస్యలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 50 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నప్పటికీ కేవలం 16,347 పోస్టుల భర్తీ ప్రక్రియలోను నిర్లక్ష్యం, అవకతవకలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. అభ్యర్థులు తాము ఎంపిక అవుతామో లేదో తెలియక అయోమయంలో ఉన్నారన్నారు. తక్షణం నియామక ప్రక్రియలో అవకతవకలను సరి చేసి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

విద్యాశాఖ ఫైళ్లపై ట్రెయినీ కలెక్టర్ ఆరా

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ట్రెయినీ కలెక్టర్ ఫర్హీన్ జావెద్ శనివారం బందరులోని డీఈవో కార్యాలయాన్ని సందర్శించారు. డీఈవో రామారావుతో విద్యాశాఖ ఫైళ్లపై చర్చించారు. పాఠశాలల పనితీరు, పోస్టుల వివరాలు, టీచర్ల బదిలీలు, డీఎస్సీ రిక్రూట్‌మెంట్, వివరాలను అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్లు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

మత్తు కలిపింది ఇద్దరినీ..

(5వ పేజీ తరువాయి)

డ్రగ్‌కు సంబంధించిన పేపర్లు లభించాయి. వాటిని నాలుకపై పెట్టుకుని చప్పరిస్తే కిక్ ఎక్కుతుంది. ఈ రెండు డ్రగ్స్‌ను శ్రీవాత్సవ్, హవీల వద్ద స్వాధీనం చేసుకున్నారు.

డ్రగ్స్ కలిపిన ప్రేమ

విశాఖపట్నం మురళీనగర్ ఎన్జీవో కాలనీ ఆర్ఆర్ఆర్ గార్డెన్‌కు చెందిన అర్జాల శ్రీవాత్సవ్ తండ్రి నావికాదళంలో పనిచేస్తున్నాడు. అక్కడే మెకానికల్ నాల్గో సంవత్సరం చదువుతున్నాడు. 15 ఏళ్ల వయస్సు నుంచి శ్రీవాత్సవ్‌కు సిగరెట్, మద్యం తాగే అలవాటు ఉంది. ఇంటర్ చదువుతున్నప్పుడు స్నేహితుల నుంచి గంజాయి, డ్రగ్స్ అలవాటు చేసుకున్నాడు. ఇంటర్‌లో లోహిత్ యాదవ్ అనే యువకుడితో శ్రీవాత్సవ్‌కు స్నేహం కుదిరింది. అతడు తరచూ డ్రగ్స్ తీసుకునేవాడు. లోహిత్ యాదవ్ నుంచి డ్రగ్స్‌ను తీసుకోవడం మొదలుపెట్టాడు. ఇంతకుముందు డ్రగ్స్‌తో శ్రీవాత్సవ్ విశాఖ మూడో పట్టణ పోలీసులకు చిక్కగా కేసు నమోదైంది. ఏడాది క్రితం విశాఖకు చెందిన బొడ్డేపల్లి హవీల డిలైట్‌తో అతనికి పరిచయం ఏర్పడింది. ఆమె తమ్ముడి ద్వారా ఏర్పడిన స్నేహం ప్రేమగా మారింది. ఇద్దరికీ డ్రగ్స్ తీసుకునే అలవాటు ఉండటంతో ఆ ప్రేమ మత్తుగా మారింది. శ్రీవాత్సవ్ మాదిరిగానే హవీల సిగరెట్, మద్యం తాగడంతో పాటు డ్రగ్స్ తీసుకుంటుంది. విశాఖపట్నం సీబీఎం కాంపౌండ్ ప్రీమియర్ ప్యారడైజ్ ప్రాంతానికి చెందిన బొడ్డేపల్లి హవీల తండ్రి శామ్యూల్ సివిల్ ఇంజనీర్. ఆమె గడిచిన ఏడాది నాగపూర్‌లోని ఐఐఎంలో ఎంబీఏ పూర్తిచేసింది. తర్వాత పూణెలో బీడీఎం (బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్)గా మూడు నెలలు పనిచేసింది. తర్వాత ఉద్యోగం మానేసి వైజాగ్ వెళ్లిపోయింది. సివిల్ ఇంజనీర్‌గా ఉన్న తండ్రికి సహాయకురాలిగా ఉంటోంది. ఎంబీఏ చదువుతున్నప్పుడే స్నేహితుల ద్వారా సిగరెట్, మద్యం తాగడం, డ్రగ్స్ తీసుకోవడం అలవాటు చేసుకుంది. వైజాగ్‌కు వచ్చాక తన తమ్ముడు ద్వారా శ్రీవాత్సవ్‌తో పరిచయం ఏర్పడింది. శ్రీవాత్సవ్, హవీలకు ఒకే అలవాట్లు ఉండటంతో ఇద్దరి మధ్య బంధం బలపడింది. ఇద్దరూ కలిసి వైజాగ్‌లో ఎండీఎంఏ డ్రగ్ తీసుకున్నారు.

మాన్‌సూన్ 'బ్లాస్ట్' అయింది

శ్రీవాత్సవ్‌తో పాటు మరికొంతమంది స్నేహితులు గోవాలో 'మాన్‌సూన్ బ్లాస్ట్' పేరుతో మ్యూజికల్ ఫెస్టివల్ ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో పాల్గొనడానికి శ్రీవాత్సవ్ ఈనెల 14న విశాఖ నుంచి గోవా వెళ్లాడు. అక్కడ ఆరు రోజులు ఉన్నాడు. అక్కడి నుంచి ఎండీఎంఏ డ్రగ్ కొనడానికి బెంగళూరు వెళ్లాడు. అక్కడికి హవీల డిలైట్‌ను పిలిపించుకున్నాడు. శ్రీవాత్సవ్ 21వ తేదీన గోవా నుంచి బెంగళూరుకు వెళ్లాడు. అదే సమయానికి హవీల అక్కడికి చేరుకుంది. ఇద్దరూ కలిసి బెంగళూరులో శ్రీవాత్సవ్ స్నేహితుడు ముత్యాల తరుణ్ రూమ్‌లో ఉన్నారు. శ్రీవాత్సవ్ తన స్నేహితుల ద్వారా మల్లెల మధుసూదన్‌రెడ్డి అలియాస్ మద్ది నుంచి రెండు గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను రూ.4,700కు కొన్నాడు. ఈ డబ్బును హవీల ఫోన్‌పే ద్వారా పంపింది. తర్వాత శ్రీవాత్సవ్ వాట్సాప్‌కు మద్ది డ్రాప్ పాయింట్ పంపాడు. అక్కడికి శ్రీవాత్సవ్, హవీల వెళ్లి ఎండీఎంఏను తీసుకుని తాగారు.

సింగసంద్రలో సిగరెట్ పెట్టె

శ్రీవాత్సవ్, హవీల బెంగళూరులో ఉండగా, వైజాగ్‌లో లోహిత్ యాదవ్ నుంచి ఫోన్ వచ్చింది. వచ్చేటప్పుడు 20 గ్రాముల ఎండీఎంఏ తీసుకురావాలని చెప్పాడు. తాను చెప్పినట్టు చేస్తే అందులో నుంచి రెండు గ్రాములు ఇస్తానని ఆఫర్ ఇచ్చాడు. లోహిత్ యాదవ్ వాట్సాప్ కాల్‌చేసి బెంగళూరులోని సింగసంద్ర మెట్రో రైల్వేస్టేషన్ వద్ద ఉన్న డ్రాప్‌పాయింట్ చిరునామా చెప్పాడు. దాని లోకేషన్‌ను శ్రీవాత్సవ్ వాట్సాప్‌కు పంపాడు. అక్కడ డ్రగ్స్ వ్యాపారులు ఎండీఎంఏను సిగరెట్ ప్యాకెట్లలో పెట్టి అక్కడ ఉంచారు. వాటిని తీసుకురావాలని లోహిత్ యాదవ్ చెప్పాడు. శ్రీవాత్సవ్, హవీల అక్కడికి వెళ్లి చూడగా 20 జిప్ కవర్ ప్యాకెట్‌ల్లో ఎండీఎంఏ ఉంది. అందులో ఒక ప్యాకెట్‌ను వారిద్దరూ తాగారు. 27వ తేదీన ఇద్దరూ కలిసి బెంగళూరు నుంచి వైజాగ్‌కు బస్ టికెట్లు బుక్ చేసుకున్నారు. డ్రగ్ ఉన్న 19 కవర్లలో తొమ్మిది ప్యాకెట్లను హవీలకు ఇచ్చాడు. మిగిలిన ప్యాకెట్లను శ్రీవాత్సవ్ తన వద్ద ఉంచుకున్నాడు. ఇద్దరూ కలిసి బెంగళూరు-విశాఖపట్నం బస్సు ఎక్కారు. ఈగల్ టీమ్‌కు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు.. బస్సు విజయవాడలోని మహానాడు వద్దకు రాగానే ఆపి తనిఖీ చేయగా, వీరిద్దరూ పట్టుబడ్డారు. శ్రీవాత్సవ్‌తో ఎండీఎంఏ తెప్పిస్తున్న లోహిత్ యాదవ్‌ను మాచవరం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. శుక్రవారం అతడి పుట్టినరోజు. ఆ సందర్భంగా నిర్వహించుకునే పార్టీ కోసమే ఈ డ్రగ్‌ను రప్పిస్తున్నట్టు తెలిసింది. పోలీసులకు దొరక్కపోయి ఉంటే ఈ డ్రగ్‌తో ఎంజాయ్ చేసేవారు. లోహిత్ యాదవ్‌ను శనివారం రాత్రి విజయవాడకు తీసుకొచ్చారు.

పర్యాటకం ప్రైవేట్‌కు..

(5వ పేజీ తరువాయి)

కట్టబెట్టాలని నిర్ణయించింది. ప్రైవేటీకరణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా ఏర్పాటుచేసే వాటిని పీపీపీ కింద చేపట్టాలని, నష్టాల్లో ఉన్న యూనిట్లను మాత్రమే అవకాశాన్ని బట్టి పీపీపీ వైపు తీసుకెళ్లాలన్నారు. మధ్యతరగతి వర్గాలకు భారంగా ఉండకూడదన్న ఉద్దేశంతో లాభాల్లో ఉన్న యూనిట్ల జోలికి వెళ్లొద్దని చెప్పారు. కానీ, పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్‌జైన్ మాత్రం రిటైర్‌మెంట్ దగ్గరపడటంతో ఏపీటీడీసీ ఎండీ, చైర్మన్లు కాదంటున్నా వినకుండా ఏకపక్షంగా కట్టబెట్టేందుకు ఆదేశించారు.

రూ.60 కోట్ల బకాయిల మాటేంటి..?

ప్రైవేటీకరణ పేరుతో గతంలో విచ్చలవిడిగా ఇచ్చిన లీజుల కారణంగా పర్యాటకాభివృద్ధి సంస్థకు ఇప్పటికీ రూ.60 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఏపీటీడీసీ అధికారులు ఇందులో ఒక్కపైసా కూడా రాబట్టలేకపోయారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే పరిస్థితి తలెత్తితే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

4 శాతం డబ్బు కడితే చాలట..!

ప్రైవేట్ సంస్థకు మంచి ప్రయోజనాలు కూడా కల్పిస్తున్నారు. ఏడాది లీజు మొత్తం రూ.4.50 కోట్లలో 4 శాతం డబ్బు కడితే చాలని బంపర్ ఆఫర్ ఇచ్చారు. మిగిలిన మొత్తాన్ని త్రైమాసిక విధానంలో కట్టుకునే అవకాశం కల్పించటం గమనార్హం. లీజు కాలాన్ని మాత్రం నిర్దేశించలేదు. 33 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వాలన్న ఆలోచనలో ఉన్నా.. దానిని పేపర్‌లో ఎక్కడా పేర్కొనలేదు. వ్యతిరేకత వస్తుందేమోనన్న ఉద్దేశంతో ఆ పని చేయలేదని తెలుస్తోంది.

స్మార్ట్.. టూ లేట్..

(5వ పేజీ తరువాయి)

అత్యల్పంగా స్మార్ట్ రైస్‌కార్డుల నమోదు కావడం గమనార్హం. కంచికచర్ల 66.04 శాతం, నందిగామ 65.06, తిరువూరులో 64.73, వీరులపాడులో 64.16, విస్సన్నపేటలో 60.42, వత్సవాయిలో 59.57, ఇబ్రహీంపట్నంలో 57.65, గంపలగూడెంలో 55.66, మైలవరంలో 54, జగ్గయ్యపేటలో 53.85, జి.కొండూరులో 53.01, చందర్లపాడులో 52.68, రెడ్డిగూడెంలో 52.01, పెనుగంచిప్రోలులో 51.80 శాతం మేర అంటే దాదాపు సగం మేర కార్డుల పంపిణీ జరిగినప్పటికీ విజయవాడలో మాత్రం సగటున 26.05 శాతమే పంపిణీ జరిగింది. నగరంలో 2,61,325 రైస్ కార్డులకు కేవలం 68,088 కార్డులే పంపిణీ చేశారు. ఇంకా 1,93,237 స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేయాలి. స్మార్ట్ కార్డుల పంపిణీ నత్తనడకన జరగడానికి ప్రధాన కారణం రెవెన్యూ యంత్రాంగమే. గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వో)లకు స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ బాధ్యతలను అప్పగించగా, వారు తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించట్లేదు. మొక్కుబడిగా కొన్ని కార్డులు ఇచ్చి వెళ్లిపోతున్నారు తప్ప పూర్తిస్థాయిలో ఇవ్వట్లేదు. ప్రస్తుత పంపిణీ తీరు చూస్తుంటే.. సెప్టెంబరు నెల కోటా పూర్తయ్యే నాటికి కూడా పంపిణీ జరిగే పరిస్థితి లేదు.

ఎంఎస్ఎంఈలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల కేంద్ర అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్

ఘంటసాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 'జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో రాంప్ (ఆర్ఏఎంపి) ద్వారా అందిస్తున్న వివిధ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి. ఎంఎస్ఎంఈలకు అందించే వివిధ రుణ సదుపాయాలు, సబ్సిడీలను పొందేందుకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరి. ప్రతీ పారిశ్రామికవేత్త, వ్యాపారవేత్త తమ యూనిట్లకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా పొందండి.' అని జిల్లా పరిశ్రమల కేంద్ర అసిస్టెంట్ డైరెక్టర్ పి.ప్రదీప్ కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ క్యాంపును శనివారం నిర్వహించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం వివిధ రాయితీలు అందిస్తోందని ప్రదీప్ తెలిపారు. సూక్ష్మ చిన్న, మధ్య త రహా పరిశ్రమలను ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో నమోదు చేయటం కోసం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో క్యాంపులు నిర్వహిస్తామని ఆ యన తెలిపారు. ఎండీవో సుబ్బారావు, పరిశ్రమ ల ప్రోత్సాహక అధికారి వై.నాగేంద్ర పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి

● పరిస్థితి విషమం.. విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలింపు

మచిలీపట్నం క్రైమ్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో ఒక మహిళ కత్తిపోట్లకు గురైన ఘటన ఇనకుదురుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శ నివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజుపేటకు చెందిన మ హమ్మద్ రసూల్‌కు, నూరి నగర్‌కు చెందిన అస్గర్‌కు పాత కక్షలు ఉన్నాయి. శుక్రవారం రాత్రి వర్రెగూడెం బ్రహ్మంగారి గుడివద్ద వారిద్దరి మధ్య గొడవ జరిగింది. శనివారం నూరినగర్‌లోని అస్గర్ ఇంటికి రసూల్ వెళ్లాడు. అస్గర్ లేకపోవడంతో ఎక్కడున్నాడని తల్లి మీర్జా ఫాతిమాను రసూల్ ప్రశ్నించాడు. నా కొడుకుతో నీకేంపని అని రసూల్‌తో ఫాతిమా వాగ్వివాదానికి దిగింది. దీంతో రసూల్ తన వెంట తెచ్చుకున్న కత్తితో ఫాతిమాపై దాడి చేశాడు. చేతులు అడ్డు పెట్టడంతో తలపై, చేతులపై ఫాతిమాకు గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు మచిలీపట్నం ప్రభు త్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో విజయవాడ తరలించారు. ఇనకుదురుపేట పోలీసులు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాయబారులు

(5వ పేజీ తరువాయి)

నిబంధనల ప్రకారం ఒక బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీయాలి. అందుకోసం సిండికేట్లు తమకు అనుకూలంగా ఉన్న బార్‌లను ఎంపిక చేసుకుని ఒకరే నాలుగేసి దరఖాస్తులు చేసేలా ప్రణాళిక అమలు చేశారు. కేవలం ఐదు బార్‌లకే వేర్వేరు వ్యక్తులు దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం బార్‌లు నిర్వహిస్తున్న వారు ఉన్న దాన్ని కాపాడుకోవడానికి నాలుగేసి దరఖాస్తులు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఫలితంగా ఇతరులెవరూ తమ బార్‌లకు దరఖాస్తులు చేయకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. బార్‌లు దక్కించుకున్నవారు సోమవారం నాటికి రూ.12.50 లక్షలు ఫీజుగా చెల్లించారు. మూడేళ్లకు లైసెన్స్ ఫీజు రూ.75 లక్షలు. దీన్ని ఆరు వాయిదాలుగా చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118,126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

మర్యాదపూర్వక కలయిక



వన్‌టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి శనివారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మర్యాదపూర్వకంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ బ్రహ్మం చౌదరిని శాలువాతో సత్కరించి కొండపల్లి బొమ్మను బహూకరించారు. అనంతరం ఇరువురూ కొద్దిసేపు రాష్ట్ర రాజకీయాలపై పలు అంశాలను చర్చించుకున్నారు.

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాదారులకు జరిమానా

కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో శనివారం పౌరసరఫరాల శాఖకు సంబంధించిన (6ఎ) కేసుల విచారణను జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా నిర్వహించారు. సదరు కోర్టులో కేసులు నమోదైన వ్యక్తులను, నమోదు చేసిన అధికారులను విచారించి రూ.9,84,610 విలువ కలిగిన 704.4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ప్రభుత్వపరం చేసేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసేందుకు వినియోగించిన వాహన యజమానులకు రూ.76,500 జరిమానాగా విధించారు.



ప్రొఫెసర్లను సత్కరిస్తున్న ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్

ఇద్దరు ప్రొఫెసర్లకు సత్కారం

మాచవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సిద్దార్థ వైద్య కళాశాలలో ప్రొఫెసర్, హెచ్‌వోడీగా మైక్రోబయాలజీ విభాగంలో పని చేసిన డాక్టర్ వెంకట్రావ్, జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్, హెచ్‌వోడీగా పని చేసిన డాక్టర్ శ్రీనివాసరావులు శనివారం పదవీ విమరణ సందర్భంగా వారిని ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి, డాక్టర్ ఎ.ఏడుకొండలరావు, డాక్టర్ బాబ్జి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.



చవితి పందిరిలో గుమ్మడి పూజలు

కృష్ణలంక, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్‌లోని శ్రీ గణేష్ మహోత్సవ కమిటీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చవితి పందిరిలో శనివారం టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గుమ్మడి గురుప్రసాద్ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి రంగారావు, పోడూరు పవన్, వల్లూరు గణేష్, గరిమెళ్ల జానకిరామయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



దాత అన్వేష్‌కు రశీదు అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

వరసిద్ధుడి అన్నదానానికి రూ.25లక్షల విరాళం

● ఇంత మొత్తం అందడం ఇదే ప్రథమం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి విజయవాడకు చెందిన గుమ్మడి అన్వేష్ తన కుటుంబీకులతో కలిసి శనివారం రూ.25లక్షలను విరాళంగా ఇచ్చారు. అన్నదానం ప్రారంభించినప్పటి నుంచి ఈ స్థాయిలో విరాళం అందడం ఆలయానికి ఇదే ప్రథమం. దాతను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఏఈవో రవీంద్ర బాబు, సూపరింటెండెంట్ వాసు, సీఎఫ్‌వో నాగేశ్వరచౌదరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

పేదల్లో ఆత్మవిశ్వాసం పెంచడమే లక్ష్యం

● టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్

గుణదల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం అందరికీ దక్కేలా చూడటంతోపాటు పేదల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ తెలిపారు.. స్థానిక రెండో డివిజన్ పార్టీ కార్యాలయంలో శనివారం పలువురికి విద్య, వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పలువురికి ఆర్థిక సాయం అందచేసి అనంతరం మాట్లాడారు. పేదల కష్టాలను తన కష్టాలుగా భావించే వ్యక్తి గద్దె రామ్మోహన్ అని తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు దాసరి గాబ్రియేలు, గొల్లపూడి ఏఎంసీ డైరెక్టర్ సుగసాని రత్నశ్రీ కృష్ణప్రసాద్, దోమకొండ రవి, షకీల బేగం, పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాకు కాకాని పేరు పెట్టాలి

● డాక్టర్ తరుణ్ కాకాని

పటమట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ప్రతిపాదించబడిన విజయవాడ లేదా కృష్ణాజిల్లాకు కాకాని వెంకటరత్నం పేరు పెట్టాలని కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షుడు కాకాని తరుణ్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తరుణ్ కాకాని మాట్లాడుతూ ఆయన పేరు జిల్లాకు పెట్టడం వలన విజయవాడ ప్రజలకు గౌరవం లభిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో కాకాని ఆశయ సాధన సమితి సభ్యులు జాస్తి సతీష్, గణేష్, వేణుగోపాల్, బసవేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.




ఆటోనగర్ సన్‌లైట్ సెంటర్‌లో డ్రెయినేజీ నుంచి వస్తున్న మురుగునీరు, మురుగునీటితో నిండిన రోడ్డు

పొంగుతున్న డ్రెయినేజీ

● ఆటోనగర్ సన్‌లైట్ సెంటర్‌లో మురుగునీటితో నిండిన రోడ్డు ● నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: జవహర్ ఆటోనగర్ సన్‌లైట్ సెంటర్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నుంచి మురుగునీరు రోడ్డుపైకి వచ్చి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. గత నాలుగు రోజులుగా మురుగునీరు రోడ్డుపైకి వస్తోన్నా అధికారులు పట్టించుకొన్న దాఖలాల్లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నీరు సాఫీగా ముందుకు వెళ్లక వెనుకకు తన్ని బయటకు వస్తోందంటున్నారు. దీనివల్ల అనారోగ్య పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వారంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిచి మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భుజం నొప్పిపై అవగాహన అవసరం

● ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఓలాస్ గోరా



మాట్లాడుతున్న డాక్టర్ ఓలాస్ గోరా

పటమట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భుజం నొప్పిపై అవగాహన అవసరమని ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఓలాస్ గోరా పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన భుజం నొప్పి అనే అంశంపై సవివరంగా వివరించారు. ఆయన మాట్లాడుతూ భుజం నొప్పికి ముందుగా నొప్పి తగ్గించే మందులు వాడటం, స్టెరాయిడ్ ఇంజక్షన్లు వాడటం ఉంటుందన్నారు. అవసరమైతే ఆపరేషన్ కూడా చేయాల్సి ఉంటుందన్నారు. నొప్పిని తగ్గించి కదలికలు మెరుగుపర్చడానికి ఫిజియోథెరపీ ఎంతో తోడ్పడుతుందన్నారు. ఫిజియోథెరపీ ద్వారా కండరాలకు బలాన్ని పెంపొందించి నొప్పిని తగ్గించడం ఉంటుందన్నారు. పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో ప్రారంభం



సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న కేశినేని జానకీ లక్ష్మి

లబ్బీపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర చేనేత, జౌళి శాఖ సహకారంతో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్ పో ఆధ్వర్యంలో ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సిల్క్ ఎక్స్‌పోను శనివారం కేశినేని జానకీ లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేతన్నలే నేరుగా అమ్మకాలు నిర్వహించడం ద్వారా బయటికంటే తక్కువ ధరలకు వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. బెనారసీ, పశ్చిమ బెంగాల్ బొటిక్ ఐటెమ్స్, టస్సార్ కాంత, చందేరి, కోటా, రాజ్‌కోట్ పటోలా, గద్వాల్, కళంకారి, కాంచీపురం తదితర కళాత్మక వస్త్రాలను ఒక వేదికపై వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను వస్త్ర ప్రియులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో నిర్వాహకులు, సెంట్రల్ సిల్క్ బోర్డు విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ గ్యాలరీ సెప్టెంబరు 2 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో బ్రాండ్ అంబాసిడర్ పి.దీపిక, మహిళా పారిశ్రామికవేత్త సజ్జా మంజుల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ ఎల్లారావు

మహిళలు ఆర్థికంగా రాణించాలన్నదే లక్ష్యం

పీపుల్స్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ చైర్మన్ ఎల్లారావు

గుణదల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా రాణిస్తేనే సమాజం అభివృద్ధి బాటలో నడుస్తుందని పీపుల్స్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ ఎల్లారావు తెలిపారు. పీపుల్స్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ 12వ సర్వసభ్య సమావేశం లయోల ఆడిటోరియంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 మంది సభ్యులతో 2013లో ప్రారంభ మైన ఈసొసైటీ నేడు 72వేల మంది సభ్యులతో ముందుకు సాగుతుందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సొసైటీ రూ2 కోట్ల 97 లక్షల లాభం సాధించిందని తెలిపారు. త్వరలో మరిన్ని శాఖలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ చుక్కపల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంకు పుష్కరకాలంగా అభివృద్ధి చెందిందని చెప్పారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

లయోలలో ఫ్రెషర్స్ డే




కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ ఫాదర్ రెక్స్ ఏంజెలో, డీన్ ఫ్రాన్సిస్ జేవియర్, తదితరులు

భారతీనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోల కళాశాలలోని బీబీఏ విభాగం ఆధ్వర్యంలో కొత్తగా చేరిన విద్యార్థులను స్వాగతిస్తూ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఫాదర్ రెక్స్ ఏంజెలో, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్ ఎస్.ఎ.ఫ్రాన్సిస్ జేవియర్ పాల్గొని కేక్ కట్ చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల పాటలు, నృత్యాలు తదితర సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ ఫాదర్ రెక్స్ ఏంజెలో మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్ అక్షరాస్యత, సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టాలని అన్నారు. విభాగాధిపతి దుర్గాపావని, అధ్యాపకులు శ్రవణ్ కుమార్, కె.హిమజ్యోతి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అన్విత.. అనితర సాధ్యురాలు

●తొలి ప్రయత్నంలోనే నీట్ పీజీలో 202వ ర్యాంక్ ●ఎంబీబీఎస్‌లోనూ బెస్ట్ ఔట్ గోయింగ్ స్టూడెంట్



తండ్రి పుట్టగుంట సతీశ్‌తో అన్విత

విజయవాడ సిటీ , ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నీట్ పీజీ పరీక్షలో తొలి ప్రయత్నంలోనే విజయవాడకు చెందిన పుట్టగుంట అన్విత 202వ ర్యాంకు సాధించారు. అన్విత తొలి నుంచీ చదువులో మొదటి ర్యాంకరే. సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన అన్విత, 2019-24 ఎంబీబీఎస్ బ్యాచ్‌లో అత్యుత్తమ ప్రతిభావంతురాలైన మెడికోగా పేరుపొందారు. ఓవరాల్ బెస్ట్ స్టూడెంట్‌గా గుర్తించి అన్వితకు బెస్ట్ ఔట్ గోయింగ్ వైద్యవిద్యార్థినిగా కళాశాల యాజమాన్యం పురస్కారాన్ని అందించింది. పీజీలో జనరల్ మెడిసిన్ చేసిన తర్వాత న్యూరాలజీ చేయాలని అనుకుంటున్నట్లు అన్విత తెలిపారు. మొదటి ప్రయత్నంలోనే నీట్‌లో ర్యాంకు సాధించడం చాలా ఆనం దంగా ఉందన్నారు. తాను చదువులో రాణించేందుకు ప్రధాన కారణం కళాశాల గురువులతోపాటు తల్లిదండ్రులు పుట్టగుంట సతీశ్, రోజా అని తెలిపారు. కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని నమ్ముతానని, నా నమ్మకం నిజమైనందుకు సంతోషంగా ఉందన్నారు. మా నాన్న పేదలకు సేవ చేసినట్టుగానే, వైద్యవృత్తిలో ఉండి పేదలకు సేవ చేస్తానని అన్విత తెలిపారు.

సర్కిల్ 3 పరిధిలో తాగునీటి సరఫరా నిలిపివేత రేపు

భారతీనగర్/ పటమట, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి):విజయవాడ నగరపాలక సంస్థ సర్కిల్ 3 పరిధి ఐదో డివిజన్‌లో 46 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు 1వ డివిజన్‌లోని వాటర్ పంపింగ్ చేసే ఇన్‌టేక్ వెల్ వద్ద ఎలక్ట్రికల్ పనుల కారణంగా సోమవారం సాయంత్రం నుంచి నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఈఈ సాంబ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు ఒకటోతేదీ (సోమవారం) ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పనులు జరగనున్నందున సోమవారం సాయంత్రం 5గంటల నుంచి మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

గుణదల అన్ని ప్రాంతాలు, మాచవరం, కార్మిక నగర్, ఎస్ఆర్ఆర్ కాలేజీ ఎదురు కొండ ప్రాంతం, వెటర్నరీ కాలనీ, శ్రీనివాసబ్యాంక్ కాలనీ, నాగార్జున నగర్, అశోక్ నగర్, గురునానక్ కాలనీ, సాయిబాబా గుడి రోడ్డు, కామినేని నగర్, కేపీ నగర్, పోస్టల్ కాలనీ, ఏపీఐఐసీ కాలనీ, కేడీజీవో కాలనీ, మారుతీ కోపరేటివ్ కాలనీ, ఫన్‌టైమ్ రోడ్డు, వాసవినగర్, అరుణ్‌నగర్ కొండ భాగం, ఎల్ఐసీ కాలనీ, సీటీవో కాలనీ, మిథిలా నగర్, జయప్రకాష్ నగర్, ఫిలీం కాలనీ, ఐటీఐ రోడ్డు, సుబ్బారావు కాలనీ, ఆర్టీసీ కాలనీ, న్యూ పీఅండ్‌టీ కాలనీ, మారుతీ కాలనీ, హైస్కూల్ రోడ్డు, రెల్లిస్ కాలనీ, పంట కాలువ రోడ్డు, తంగెళ్లమూడి వారి వీధి, వాసవీ కాలనీ, టీచర్స్ కాలనీ, అచ్చమ్మ బజార్, పటమట ప్రాంతం, యాదవుల బజార్, జ్యోతి విద్యాలయం రోడ్డు, వరలక్ష్మీ నగర్, కంచుకోట బజార్, 5నెంబర్ బస్సు రూట్, బ్యాంక్ కాలనీ(1, 2), ఆచార్య రంగా వీధి, క్రీస్తురాజపురం కొండ ప్రాంతం, విజయ్‌నగర్ కాలనీ, సొసైటీ క్వారీ, గుంటూర్‌బాపనయ్య నగర్‌లోని పరిసర ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా గొయ్యి

●స్థానికుల అవస్థలు ● పట్టించుకోని ఐలా



ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: జవహర్ ఆటోనగర్ వంద అడుగుల రోడ్డు పంటకాలువ ప్రాంతం శేషగిరి హోటల్ సెంటర్ రోడ్డు మధ్యలో నిలువెత్తు గొయ్యి ఏర్పడింది. ఈగొయ్యి రోజురోజుకూ పెరుగుతూ ఉండటంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. కాగా శనివారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనం ఈగొయ్యిలో పడటంతో వాహనదారుడికి గాయాలయ్యాయి. ఇలాంటి సంఘటనలు ఇక్కడ తరచుగా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పాదచారులు సైతం ఈగొయ్యిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గత కొంతకాలంగా రోడ్డు మధ్యలో ఈ గొయ్యి ఉందని ఐలా అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం శూన్యమని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగుచర్యలు చేపట్టి గొయ్యిని పూడ్చించాలని స్థానికులు కోరుతున్నారు.

నైపుణ్యంతో ఐటీ కొలువులు

ఎన్టీఆర్ వికాసతో నిరుద్యోగులకు చేయూత

● 8 నెలల్లో 1500 మందికి ఉపాధి ● ప్రతి వారం ఇంటర్వ్యూలు, ఉద్యోగాలు
● అందరూ వికాసను వినియోగించుకోండి: వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు


ఇంటర్వ్యూలను పరిశీలిస్తున్న ఎన్టీఆర్ వికాస పీడీ లచ్చారావు

ఆంధ్రజ్యోతి, కలెక్టరేట్: కాస్త నైపుణ్యం ఉంటే చాలు! ఐటీ కొలువులు ఇట్టే ఒడిసిపట్టుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఇంజనీరింగ్ చేసిన నిరుద్యోగ యువతకు ఎన్టీఆర్ వికాస పథకం అందివచ్చిన అవకాశంగా మారింది. 2014లో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే ఉద్దేశంతో ఏర్పాటైన 'ఎన్టీఆర్ వికాస' ద్వారా నిరుద్యోగులు ఐటీ కొలువులు సాధిస్తున్నారు. 2024 డిసెంబరు 28 నుంచి ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో ప్రారంభమైన ఎన్టీఆర్ వికాస ద్వారా ఇప్పటి వరకు దాదాపుగా 1500 మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలు సాధించారంటే అతిశయోక్తి కాదు. కలెక్టరేట్‌లో ప్రతి శనివారం వివిధ సాఫ్ట్‌వేర్, ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు వచ్చి అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేసి ఉద్యోగులు ఇస్తున్నారు. రెండో శనివారమైతే ముందురోజునే ఇంటర్వ్యూలు జరుగుతుంటాయి. 2014లో తొలిసారిగా కాకినాడ నుంచి ప్రారంభమైన ఎన్టీఆర్ వికాస అంచెలంచెలుగా రాష్ట్రంలోని ప్రధాన నగరాలకు వ్యాప్తిచెంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో ముందుంటోంది. వారం వారం ఇంటర్వ్యూలు ఉండటంతో ఒకరోజు సెలక్ట్ కాని వారు మరో వారం వస్తుందిలే అనే ధీమాతో ఉంటున్నారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగాలకు దాదాపు 150 మంది యువత వివిధ జిల్లాల నుంచి హాజరయ్యారు. పదేళ్లల్లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2 లక్షల మంది అభ్యర్థులు ఇంటర్వ్యూల్లో ఉత్తీర్ణులై ఉద్యోగాలను సాధించకున్నారు.


ఇంటర్వ్యూ కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగులు

నిరుద్యోగాన్ని పారదోలండి

వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు

ఎన్టీఆర్ వికాస ద్వారా నిరుద్యోగులు తమ అదృష్టాన్ని పరీక్షించుకొని నిరుద్యోగాన్ని పారద్రోలాలని ఎన్టీఆర్ వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కే లచ్చారావు తెలిపారు. ఎన్టీఆర్ కలెక్టరేట్‌లోని వికాస ద్వారా 8 నెలల్లో ఇప్పటివరకు దాదాపు 1500 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారన్నారు. ప్రతి శనివారం జరిగే ఈ ఇంటర్వ్యూల్లో నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఉద్యోగాలు సాధించాలని కోరారు.

56 మందికి ఉద్యోగావకాశాలు

కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 56 మంది ఉద్యోగార్హత సాధించారు. ఆన్‌లైన్‌లో 313 మంది రిజిస్టర్ కాగా 178 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఫ్లిప్‌కార్ట్ కంపెనీ ఇంటర్వ్యూకు 45 మంది హాజరుకాగా 24 మంది ఉద్యోగార్హత సాధించారు. సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆఫ్ కెట్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఇంటర్వ్యూలకు 133 మంది హాజరుకాగా 32 మంది సెలక్ట్ అయ్యారు. సెలెక్ట్ అయిన అభ్యర్థులకు సోమ, మంగళవారాల్లో ఆఫర్ లెటర్ ఇస్తారని ఎన్టీఆర్ వికాస పీడీ కే లచ్చారావు తెలిపారు.

కంపెనీల చుట్టూ తిరిగే పని ఉండదు

పడిది గణేష్ కుమార్



డిగ్రీ సర్టిఫికెట్లు చేతపట్టుకొని ఉద్యోగాల కోసం సాఫ్ట్‌వేర్ కంపెనీల చుట్టూ తిరిగే పనిలేకుండా చంద్రబాబు ప్రభుత్వం ఎన్టీఆర్ వికాస ద్వారా నిరుద్యోగ అభ్యర్థులను ఆదుకోవడం మంచి పరిణామం. ఎన్టీఆర్ కలెక్టరేట్‌లోని వికాసకు రావడం ఇదే తొలిసారి అయినా ఉద్యోగం వస్తుందనే నమ్మకంతో ఉన్నా. ఇవాళ రాకపోయినా రానున్న రోజుల్లో ఉద్యోగం సాధించి తీరతాను.

నిరుద్యోగులకు వరం ఎన్టీఆర్ వికాస: వీ గాయత్రీ లీల



డిగ్రీ సాధించిన తర్వాత ఎన్టీఆర్ వికాసకు వచ్చే పలు సాఫ్ట్‌వేర్ కంపెనీల ద్వారా ఉద్యోగం వస్తుందనే నమ్మకాన్ని ప్రభుత్వం కలిగిస్తోంది. ఇలాంటి జాబ్‌మేళాల ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగం వస్తుందనే భరోసా ఇచ్చినట్లవుతుంది.

ఎన్టీఆర్ వికాసకు రావడం ఇదే తొలిసారి: కే ధనేశ్వర్



ఎన్టీఆర్ వికాసకు రావడం ఇదే తొలిసారి. పత్రికల్లో ప్రకటన చూసి అదృష్టాన్ని పరీక్షించుకొందామని నేను, నా స్నేహితుడు వచ్చాం. వారం వారం జాబ్‌మేళా ఉంటుంది. ఇవాళ కాకపోతే రేపైనా ఉద్యోగం వస్తుంది.

గత ప్రభుత్వం పట్టించుకోలేదు: ఆర్ మురళీకృష్ణ



కూటమి ప్రభుత్వం వచ్చిన మెగా డీఎస్సీని ప్రకటించడం, ఎన్టీఆర్ వికాసతో వేలాది మందికి ఉద్యోగాలు వచ్చేలా చేయడం చంద్రబాబు తీసుకొన్న మంచినిర్ణయం. గత ప్రభుత్వంలో ఉద్యోగులను పట్టించుకోలేదు. వారం వారం ఇలాగే జాబ్‌మేళాలో నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు కొనసాగితే కొన్నాళ్లకు నిరుద్యోగాన్ని రూపుమాపవచ్చు.


జ్యోతి ప్రజ్వలన చేసి సీఎంఈని ప్రారంభిస్తున్న సిద్దార్థ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు

సిద్ధార్థ వైద్య కళాశాలలో సీఎంఈ ప్రారంభం

మాచవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని మెడికల్ కళాశాలల నుంచి పల్మనరీ మెడిసిన్ పీజీ (పోస్టు గ్రాడ్యుయేట్) విద్యార్థులకు విజయవాడ సిద్దార్థ వైద్య కళాశాలలో రెండ్రోజులు పాటు సీఎంఈ ప్రారంభమైంది. ప్రిన్సిపల్ డాక్టర్ ఏ యదుకొండలరావు శనివారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 100 మంది పల్మనరీ మెడిసిన్ పీజీ విద్యార్థులు పాల్గొంటారు. డాక్టర్ సుదీనా, విద్యార్థులు పాల్గొన్నారు.



కాణిపాకం వరసిద్ధి వినాయకునికి

దుర్గగుడి నుంచి పట్టు వస్త్రాల సమర్పణ

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం వరసిద్ధి వినాయకుడికి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం నుంచి శనివారం పట్టు వస్త్రాల సమర్పణ చేశారు. ఈవో వీకే శీనానాయక్, ప్రధాన అర్చకుడు ఎల్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అర్చక బృందం, సిబ్బంది కాణిపాకం చేరుకున్నారు. కాణిపాకం ఈవో పెంచల కిషోర్ వారికి మేళతాళాలతో స్వాగతించారు. సంప్రదాయ లాంఛనాల అనంతరం ప్రత్యేక అర్చనలు నిర్వహించి దుర్గగుడి నుంచి వినాయకుడికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీ రాంబాబు, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ కే గంగాధర్, వైదిక కమిటీ సభ్యుడు శ్రీధర్ శర్మ, దేవస్థానం అర్చకుడు ఆర్ శ్రీనివాస్ శాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

పారిశ్రామిక సేవలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి

● డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగానికి సంబంధించి సమన్వయ శాఖలందించే అన్ని సేవలపై యూజర్లకు పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించాలని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లోనూ జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు కృషిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. తొలుత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో వ్యాపార అనుకూల వాతావరణాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) నిర్వహించే బీఆర్‌ఏపీ-2024 సర్వేపై పారిశ్రామిక వర్గాలకు అవగాహన కల్పించారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ర్యాంకింగ్స్ ఇచ్చే విధానాన్ని, పరామితులను క్షుణంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ర్యాంకింగ్‌ను మెరుగుపరిచేందుకు వీలుగా ప్రతి శాఖ తమ శాఖ ద్వారా సేవలు పొందిన వారికి సింగిల్ విండో వ్యవస్థతో పాటు వివిధ ఆన్‌లైన్ సేవలు వంటి వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించాలన్నారు. వివిధ అనుమతులకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 29 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్‌లో 2,598 దరఖాస్తులు రాగా 2,921 దరఖాస్తులు పరిష్కారమయ్యాయని, మిగిలిన వాటిని నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్‌ఫార్మెన్స్ (ర్యాంప్)కు సంబంధించి మండల ప్రధాన కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్‌లను నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. జిల్లా పరిశ్రమల అధికారి ఆర్ వెంకటరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కే బాబ్జి, ఎల్‌డీఎం కే ప్రియాంక, పీసీబీ ఈఈ పీ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు, పారిశ్రామిక అసోసియేషన్ల ప్రతినిధులు, సర్వీస్ యూజర్లు పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణంలో నిబంధనలు పాటించాలి

● సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు ● అమరావతిలో హెచ్ఎస్ఈఎం వర్క్‌షాప్ విజయవంతం



వర్క్‌షాపులో పాల్గొన్న సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు

కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణంలో వరల్డ్‌బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఫండింగ్ సంస్థల నిబంధనలు, ప్రమాణాలను తప్పనిసరిగా పాటించడం ఎంతో కీలకమని సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఆగస్టు 29,30న 'నిర్మాణ ప్రాజెక్టుల్లో ఆరోగ్య భద్రత, పర్యావరణ అంశాల నిర్వహణ (హెచ్ఎస్ఈఎం)'పై అమరావతిలోని ఎస్ఆర్ఎం వర్సిటీలో జరిగిన ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారం విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్‌లోని నిక్‌మార్ వర్సిటీతో సీఆర్‌డీఏ అధికారులు సంయుక్తంగా నిర్వహించారు. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించే కృషిలో భాగంగా ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లు తదితర భాగస్వాములకు నైపుణ్య వృద్ధిని అందించే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు ముఖ్య అతిథిగా 165 మందికి పైగా అధికారులు పాల్గొన్నారు. వారిలో సీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది, ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీల సిబ్బంది, రాజధాని పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు ఉన్నారు. అనంతరం వారంతా భద్రతా ప్రతిజ్ఞ చేశారు. కమిషనర్ కన్నబాబు మాట్లాడుతూ సమగ్రమైన శిక్షణ షెడ్యూల్ రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన నిక్‌మార్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ డీన్ డాక్టర్ సర్బేష్ మిశ్రాకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వర్క్‌షాప్ నిర్వహణకు సహకరించిన ఎస్ఆర్ఎం వర్సిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. రెండు రోజుల కార్యక్రమంలో హెచ్ఎస్ఈకి సంబంధించిన చట్టపరమైన, నియంత్రణాత్మక ఫ్రేమ్‌వర్క్, మేనేజ్‌మెంట్ సిస్టమ్ అభివృద్ధి, భద్రతా ప్రమాణాలు, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించే విధానం తదితర అంశాలపై శిక్షణ శిబిరం నిర్వహించారు. డాక్టర్ సర్బేష్ మిశ్రా, ఎం కామరాజన్, ప్రొఫెసర్ విష్ణు నంబూద్రి, ఇండస్ట్రీ రిలేషన్స్ ఆఫీసర్ ఎస్‌వీఎస్ శ్రీకర్ ఈ అంశాలపై సెషన్లను నిర్వహించారు. అమరావతి అభివృద్ధి ప్రాజెక్టుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత, పని ప్రాంతాల్లో సమగ్రమైన భద్రత, పర్యావరణ సహితంగా ప్రాజెక్ట్ నిర్వహణ ప్రధాన లక్ష్యాలుగా కొనసాగుతాయని సీఆర్‌డీఏ మరోసారి స్పష్టం చేసింది.

నిక్‌మార్ సంస్థ నేపథ్యం

హైదరాబాద్‌లోని నిక్‌మార్ వర్సిటీ (గతంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్‌గా వ్యవహరించేవారు) దేశంలో అగ్రగామి విద్యా సంస్థల్లో ఒకటి. నిర్మాణ కార్యకలాపాల నిర్వహణ, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్, హెల్త్-సేఫ్టీ-ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ రంగాల్లో నాణ్యమైన విద్య, పరిశోధన అందించడం సంస్థ ప్రధాన లక్ష్యం.


వినాయకుడిని దర్శించుకుంటున్న మంచు మనోజ్

పర్యావరణాన్ని పరిరక్షించాలి

● హీరో మంచు మనోజ్

విద్యాధరపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హీరో మంచు మనోజ్ అన్నారు. విద్యాధరపురం లేబర్ కాలనీ గ్రౌండ్‌లో డూండీ గణేష్ సేవా సమితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన 72 అడుగుల మట్టి వినాయకుడి విగ్రహాన్ని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికి వినాయకుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి వినాయకుడి ఆశీస్సులు అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను మూడేళ్ల పాటు శ్రమించి తీసిన మిరాయ్ చిత్రం ఈనెల 12న విడుదలవుతుందని, ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని కోరారు. కాగా, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, పలువురు ప్రముఖులు వినాయకుడి విగ్రహాన్ని దర్శించుకున్నారు. డూండీ సేవా సమితి వ్యవస్థాపకుడు డూండీ రాకేష్, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలి

వన్‌టౌన్: ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని హీరో మంచు మనోజ్ అన్నారు. శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్టూడెంట్ ట్రైబ్ ఆధ్వర్యంలో జరిగిన విద్యా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో హీరో ఉంటాడని, ఆ హీరోను మేల్కొలిపితే అద్భుతాలతో పాటు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహిస్తానని, కులాలను రూపుమాపాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. అనంతరం విద్యార్థినికి ఉచితంగా ల్యాప్‌టాప్‌ను అందజేశారు.

క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాం

● శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం క్రీడాకారులను గౌరవిస్తూ విశాఖపట్టణంలోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో 2వేల మంది క్రీడాకారులతో జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. శాప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన క్రీడాకారులు, శాప్ అధికారులు, సిబ్బంది, కోచ్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ గతంలో స్పోర్ట్స్ డేను తూతూమంత్రంగా డీఎస్ఏల్లో ర్యాలీలు చేసి నిర్వహించేవారని, ఈ ఏడాది మంత్రి లోకేశ్ ముఖ్య అతిథిగా జాతీయ, అంతర్జాతీయ క్రీడా ప్రముఖు ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. స్పోర్ట్స్ డేలో భాగంగా అమరావతి చాంపియన్‌షిప్ పేరుతో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి 24,121 మంది క్రీడాకారులను భాగస్వామ్యం చేశామని, వచ్చే ఏడాది 3లక్షల మందిని భాగస్వామ్యం చేయాలని నిర్ణయించామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.16కోటు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అమరావతి చాంపియన్‌షిప్‌లో విజేతలకు రూ.33కోట్ల నగదు ప్రోత్సహకాలు అందజేశామన్నారు. మెగా డీఎస్సీకి సంబంధించిన 421 పోస్టులు స్పోర్ట్స్‌కు కేటాయించారని, దరఖాస్తు చేసుకున్న వారిలో 870కి పైగా ఫేక్ సర్టిఫికెట్లు వచ్చియని వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఫేక్ సర్టిఫికేట్లు జారీ చేసిన అసోసియేషన్లపై కేసులు తప్పవన్నారు. ఈ సమావేశంలో శాప్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మహిళలూ.. ఆభరణాల విషయంలో జాగ్రత్త!

● గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత తుషార్ అగర్వాల్



లబ్బీపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలు బంగారు ఆభరణాలను దాచుకునే విషయంలో జాగ్రత్త వహించాలని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత తుషార్ అగర్వాల్ సూచించారు. ఫిక్కి ఫ్లో విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో బందర్‌రోడ్డులోని ఒక హోటల్‌లో శనివారం బంగారు ఆభరణాలు, వాటి భద్రత, కొనుగోలు విధానం అనే అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. తుషార్ అగర్వాల్ పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో బంగారానికి ఎంతో విలువ ఉందని, బంగారం కొనుగోలు ద్వారా భవిష్యత్తులో రెట్టింపు అవుతుందన్నారు. కొంతమంది మహిళలు బంగారు కొనుగోళ్లలో అజాగ్రత్తగా ఉంటారని తద్వారా నష్టపోయే అవకాశం ఉందని, బంగారు వెండి వజ్రభరణాలకు విలువ ఎప్పటికీ తగ్గదని, ధరలు తక్కువ ఉన్నప్పుడు కొనుగోలు చేసి భద్రపరుచుకోవాలన్నారు. బంగారు వజ్రాభరణాలు దాచేటప్పుడు జరిగే పొరపాట్ల వల్ల వాటి ఆకర్షణ తరిగిపోతుందని, సురక్షితమైన ప్రదేశంలో భద్రపరచాలని సూచించారు. ఈ సదస్సులో ఫిక్కి ఫ్లో విజయవాడ చాప్టర్ చైర్ పర్సన్ అమిత కుమారి, చాప్టర్ సీనియర్ చైర్‌పర్సన్ సుప్రియ మలినేని, రజనీ చిత్ర, సుమ అట్లూరి, దీప్తి చలసాని, తులజా దేవినేని పాల్గొన్నారు.

విశాల్ మార్ట్‌లో అగ్నిప్రమాదం

● సెల్లార్లో ఎలక్ట్రికల్ ప్యానల్ నుంచి చెలరేగిన మంటలు ● పరుగులు తీసిన ప్రజలు, త్రుటిలో తప్పిన ప్రమాదం



మంటలు చెలరేగడంతో బయటికి పరుగులు తీస్తున్న ప్రజలు

గుణదల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ ప్యానల్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గుణదల విశాల్ మెగామార్ట్ వద్ద గందరగోళ వాతావరణం నెలకొంది. గుణదల వంతెన సెంటర్ వద్ద ఉన్న విశాల్ మెగా మార్ట్ సెల్లార్ నుంచి శనివారం సాయంత్రం చెలరేగిన మంటల కారణంగా దట్టమైన పొగ మార్ట్‌లోకి ప్రవేశించింది. దీంతో ప్రజలంతా ఒక్కసారిగా భయంతో బయటికి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న మాచవరం సీఐ ప్రకాష్, అగ్నిమాపక సిబ్బంది కొద్దిసేపటికే అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన క్షణాల వ్యవధిలోనే ప్రజలు బయటికి పరుగులు తీయడం, అగ్నిమాపక సిబ్బంది వెంటనే వచ్చి మంటలను అదుపుచేయడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. ముందుగా విద్యుత్ నిలిపివేయడంతోచాలా వరకు ప్రమాద తీవ్రత తగ్గిపోయింది. సెల్లార్లో విశాల్ మార్ట్‌కు సంబంధించిన ఎలక్ట్రికల్ ప్యానల్స్ నుంచి మంటలు చెలరేగినట్టు సిబ్బంది గుర్తించారు. సెల్లార్లో పార్క్‌చేసిన ద్విచక్రవాహనాలు కొంతమేర కాలిపోయాయి. దీంతో రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని, మంటలు మార్ట్‌లోకి ప్రవేశిస్తే ఆస్తినష్టం తీవ్రంగా ఉండేదన్నారు. ఎలాంటి ప్రాణాపాయస్థితి లేకుండా మంటలు అదుపులోకి రావడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, మార్ట్ ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. మార్ట్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాచవరం సీఐ ప్రకాష్ తెలిపారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష తదితరులు

దేశాభివృద్ధిలో అమరావతి కీలకపాత్ర

● కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు
● న్యూఢిల్లీలో అమరావతి ప్రాపర్టీ షో 2025 బ్రోచర్ ఆవిష్కరణ

వన్‌టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన 17వ నారెడ్కో జాతీయ సదస్సులో శనివారం అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్ 2025 బ్రోచర్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతతూ అమరావతిని భవిష్యత్‌లో రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాల ముఖ్య కేంద్రంగా ప్రదర్శించడానికి ఈ ఫెస్టివల్ ఉపయోగపడుతుందన్నారు. భారత్ అభివృద్ధి చరిత్రలో అమరావతి కీలకపాత్ర పోషించబోతోందని, ఈ ఫెస్టివల్ ఆంధ్రప్రదేశ్ పెట్టుబడిదారులను ప్రపంచ స్థాయి భాగస్వాములతో కలిపే వేదికగా మారుతుందన్నారు. పలువురు రియల్ ఎస్టేట్ నిపుణులు మాట్లాడుతూ అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్ 2025లో నివాస, వాణిజ్య ప్రాజెక్టులతో పాటు ప్రభుత్వ దూరదృష్టి, పెట్టుబడి సౌహార్ద విధానాలు, సమగ్ర టౌన్‌షిప్ ప్రణాళికలు ప్రదర్శించబడతాయన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జీ సూర్య ప్రవీణ్, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, నారెడ్కో జాతీయ అధ్యక్షుడు జీ హరిబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు జీ చక్రధర్, సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ పారుచూరి పాల్గొన్నారు.

దుర్గగుడికి విరాళాలు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఉచిత ప్రసాదం పంపిణీకి, వేద పరిరక్షణ ట్రస్టుకు, గో సంరక్షణకు నిత్యాన్నదాన పథకానికి పలువురు దాతలు శనివారం అధికారులకు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు సిబ్బంది అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం అధికారులు దాతలకు అమ్మవారి చిత్రపటంతో పాటు విరాళం రశీదు, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అందజేశారు. కాగా, హైదరాబాద్ శ్రీనగర్‌కాలనీకి చెందిన మేఘమాల ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, అనుపమ దంపతులు ఉచిత ప్రసాదం పంపిణీ పథకానికి రూ.5 లక్షలు, విజయవాడ రూరల్ కొత్తూరు తాడేపల్లికి చెందిన డీ శివనాగరాజు, దుర్గారాణి దంపతులు అన్నదాన పథకానికి రూ.1,00,116లు, అమెరికా టెక్సాస్‌కు చెందిన సాయిసౌమ్య కామరాజ్ వేద పరిరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష, గో సంరక్షణకు రూ.50,000 విరాళంగా అధికారులకు అందజేశారు.

అధిక వర్షాల వల్ల నేడు కృష్ణా ఎక్స్‌ప్రెస్ రద్దు

రైల్వేస్టేషన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ డివిజన్‌లోని బికనూరు, తలమళ్ల స్టేషన్ల మధ్య అధిక వర్షాల కారణంగా రైల్వే ట్రాక్‌పై నీరు పారుతున్నందున ఈనెల 30, 31న కొన్ని రైళ్లను రద్దు చేసినట్లు సౌత్ సెంట్రల్ రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, 17405 తిరుపతి - ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఆదివారం నాడు రద్దు చేసినట్టు తెలిపారు.

రాధాకృష్ణన్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గవర్నర్‌పేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ స్థాయి ఉపాధ్యాయరత్న, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ప్రతిభ గల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్టు సామాజిక, సాంస్కృతిక, సాహిత్య సేవా సంస్థ ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల ప్రతిభను, విద్యా సేవా నిరతిని గుర్తించి టీచర్స్ డే పురస్కరించుకుని సెప్టెంబరు 7న హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించి పురస్కారాలు అందజేస్తామన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హతలు, బోధన అనుభవాలు పత్రికల క్లిప్పింగ్స్, గత అవార్డులు, 4 ఫొటోలు జతచేసి సెప్టెంబరు 4లోపు కార్యాలయానికి పంపాలన్నారు.



“‘ఘాటి’లో దేశరాజు పాత్రకు విక్రమ్ ప్రభునే కావాలనుకున్నా. తన కళ్లలో ఒక బాధ కనిపిస్తుంది. అదే సమయంలో ఒక శక్తి కూడా ఉంటుంది. ఈ పాత్రకు డబ్బింగ్ కూడా ఆయనే చెప్పారు”

• సండే సెలబ్రిటీ

‘గమ్యం, కంచె, కృష్ణం వందే జగద్గురుం, గౌతమిపుత్ర శాతకర్ణి’ వంటి విజయవంతమైన చిత్రాల ద్వారా తెలుగువారికి దర్శకుడు క్రిష్ జాగర్లమూడి సుపరిచితుడు. తాజాగా ఆయన తీసిన ‘ఘాటి’ సినిమా వచ్చే వారం విడుదల కానుంది. ఆంధ్రా- ఒడిశా సరిహద్దులో జరిగే గంజాయి రవాణా ఇతివృత్తంగా రూపొందించిన ఈ సినిమాలో అనుష్క ప్రధానమైన పాత్ర పోషిస్తున్నారు. దర్శకుడిగా తన ప్రస్థానం గురించి.. ‘ఘాటి’ గురించి ‘నవ్య’కు క్రిష్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

> గంజాయి అనేది సామాజిక సమస్య. చిన్న పిల్లలు ఈ భూతం బారిన పడుతున్నారు. జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

మనిషి కథ చెప్పటం నాకిష్టం!

‘ఘాటి’ పేరు వెనకున్న కథేమిటి?

‘ఘాటి’ అనేది సంస్కృతంలో ‘ఘట్ట’ అనే పదం నుంచి పుట్టింది. ‘ఘాటి’ అనే కొండల్లో ఉండే లోతైన దారి అని అర్థం. ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల్లోని కొండల్లో జరిగే కథ ఇది. ఈ కొండల అంచుల్లో చాలా గ్రామాలు ఉంటాయి. ఇక్కడ ‘శీలావతి’ అనే ప్రత్యేకమైన గంజాయి లభ్యమవుతుంది. దీనికి ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ఏటా వేల కోట్ల రూపాయల గంజాయి ఇక్కడ నుంచి అనేక ప్రాంతాలకు సరఫరా అవుతుంది. ఈ గ్రామాల్లో నివసించేవారే దీన్ని సరఫరా చేస్తారు. వీరి పూర్వీకులు బ్రిటీష్‌వారి సమయంలో కొండల్లో రోడ్లు వేసేవారు. ఎంత ఎత్తయిన కొండనైనా సునాయాసంగా ఎక్కగలుగుతారు. వీరికి ఆ కొండల ఆనుపానులన్నీ తెలుసు. వీరిని ‘ఘాటీలు’ అని కూడా పిలుస్తారు. ఒక్కొక్క ఘాటి 100 నుంచి 150 కేజీల గంజాయిని భుజం మీద మోస్తారు. ఈ నేపథ్యంలోని కథ కాబట్టి దీనికి ‘ఘాటి’ అని పేరు పెట్టాం.

ఈ కథ ఎలా పుట్టింది..?

కొవిడ్‌కు ముందు రచయిత చింతకింద శ్రీనివాసరావుగారు నాకు ఈ కథ చెప్పారు. నాకు చాలా నచ్చింది. ఎందుకంటే గంజాయి ఒక సామాజిక సమస్య. మీరు గమనిస్తే నా సినిమాల ఇతివృత్తాలన్నీ ఆయా కాలాల పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. గంజాయి అనేది ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య కాబట్టి దీనిపై సినిమా తీయాలనుకున్నా. అంతే కాకుండా స్వీటీ (అనుష్క)తో నేను ఒక సినిమా చేయాల్సి ఉంది. అప్పుడప్పుడు తను.. ‘సరోజ 2 చేద్దామా’ అని సరదాగా అడుగుతూ ఉండేది. ఈ కథ విన్నప్పుడు దానిలో శీలావతి పాత్రకు అనుష్క అతికినట్లు సరిపోతుందనిపించింది. మేము యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రెండు సినిమాలు తీయాలనుకున్నాం. రాజీవ్‌రెడ్డి గారికి, మా నాన్న జాగర్లమూడి సాయిబాబాగారికి ఈ కథ చెప్పినప్పుడు- వారిద్దరికీ కథ బాగా నచ్చింది. దాంతో స్క్రిప్ట్‌వర్క్ ప్రారంభించాను.

అనుష్కనే ఎంచుకోవటానికి ప్రత్యేకమైన కారణముందా?

ఈ కథలో శీలావతి ఒక అద్భుతమైన పాత్ర. తను చల్లగా వీచే కొండగాలి లాంటిది. కానీ అవసరమైనప్పుడు తానే కొండగా మారుతుంది. ఒక అందమైన జీవితాన్ని జీవించే శీలావతి... ముందు బాధితురాలిగా మారుతుంది. ఆ తర్వాత తానే ఒక నేరస్తురాలు అవుతుంది. ఆ నేరస్తురాలు ఒక లెజెండ్‌గా మారుతుంది. ఈ పరిణామ క్రమానికి అనుష్క మాత్రమే న్యాయం చేయగలదనిపించింది. వాస్తవ జీవితంలో కూడా ఆమె మృదు స్వభావి. మంచి మనిషి. అదే సమయంలో అవసరమైనప్పుడు చాలా దృఢంగా కూడా ఉంటుంది. అందుకే ఆమెను ఎంచుకొన్నాను.

‘హరిహర వీరమల్లు’ చారిత్రక చిత్రం.



‘ఘాటి’ వర్తమాన చిత్రం. ఒక చిత్రం నుంచి మరొక చిత్రానికి మారటం కష్టం అనిపించదా?

నేను స్వతహాగా కథకుడిని. మనుషుల కథను చెప్పటం నాకు ఇష్టం. ‘వీరమల్లు’ అయిన తర్వాత ‘ఘాటి’ తీద్దామనుకున్నాను. కానీ షెడ్యూల్స్ మారిపోవటంవల్ల ‘వీరమల్లు’ పూర్తి చేయలేకపోయాను. ‘ఘాటి’ కథ అప్పటికే నా దగ్గర ఉంది. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. నా ప్రతి సినిమాలోనూ పాత్రలు కొత్తగా ఉంటాయి. ప్రతి పాత్రకూ ఒక జర్నీ ఉంటుంది. దానిని పట్టుకుంటే అద్భుతమైన పాత్ర ఆవిష్కృతమవుతుంది. ‘ఘాటి’ విషయానికి వస్తే... అదొక ప్రపంచం. ఇప్పటిదాకా ఎవరూ చూడని, చెప్పని ప్రపంచం. దీనిలో శీలావతిగా అనుష్క, దేశిరాజుగా విక్రమ్ ప్రభు, విశ్వదీప్ అనే పోలీస్ అధికారిగా జగపతిబాబు కనిపిస్తారు. కుందుల నాయుడు, కష్టాల నాయుడు అనే ప్రతికూల పాత్రలు ఉంటాయి. ఈ పాత్రలన్నింటిలోనూ పొరలు పొరలుగా కోణాలుంటాయి. ఇవన్నీ ఒక దాని తర్వాత ఒకటి బయటకు వస్తుంటే చాలా ఎక్సైటింగ్‌గా అనిపిస్తుంది.

> నా సినిమాల్లో ‘గమ్యం’ ఒక వ్యక్తి కథ. ‘వేదం’ ఒక సమాజం కథ. ‘కృష్ణం వందే జగద్గురుం’ అన్నం ముద్దలాంటి సమాజం మెతుకులుగా విడిపోతుంటే తీసిన కథ. అన్ని యుద్ధాలనూ ఆపివేయటానికి ఒక యుద్ధం చాలని ‘గౌతమిపుత్ర శాతకర్ణి’ చెబుతుంది.

వీఎఫ్ఎక్స్‌ల ఒరవడి నడుస్తోంది. ఈ సినిమాలో వీఎఫ్ఎక్స్‌లు ఎక్కువగా ఉంటాయా?

నా ఉద్దేశంలో వీఎఫ్ఎక్స్ అంటే సినిమాకు మేకప్ వేయటం. నేను అవసరమైనప్పుడే వీఎఫ్ఎక్స్‌లు ఉపయోగిస్తాను. ఈ సినిమాలో చాలా తక్కువ వాడాం. వీలైనంత వరకు నిజమైన లొకేషన్లలోనే షూటింగ్ చేయటానికి ఇష్టపడతా! ‘కంచె, గౌతమిపుత్ర శాతకర్ణి’ వంటి సినిమాల్లో కూడా యుద్ధాలకు నిజమైన లొకేషన్లే వాడాను.

సినిమాల్లో మీకు ఏ క్రాఫ్ట్ అంటే ఎక్కువ ఇష్టం?

నాకు రాయటం చాలా ఇష్టం. ఏదైనా కథ రాసేటప్పుడు కలిగే తృప్తి భిన్నంగా ఉంటుంది. కొన్నిసార్లు ఎంత ప్రయత్నించినా ఏమీ రాయలేం. కష్టపడి.. కష్టపడి రాయాల్సి వస్తుంది. ఇలా ఈ రాసే ప్రక్రియ పూర్తయ్యేలోగా... మొత్తం సినిమాను ముందుగానే చూసేస్తాం. దర్శకుడు అంతఃచక్షువులతో చూసి ప్రేక్షకులకు బాహ్యచక్షువులతో చూపిస్తాడు.

మీ సినిమాల్లో పాత్రలు విలువలతో బలంగా ఉంటాయి. వీటిని ఎలా రూపొందిస్తారు?

నేను మానవ జాతిని ప్రేమిస్తాను. ఈ ప్రకృతిలో మనిషి ఒక అద్భుతం. మానవ సమాజం ఒక అద్భుతం. ఇలాంటి మనిషి కథ చెప్పటం నాకు ఇష్టం. సమాజం పతనావస్థకు వెళ్లిపోయిందనుకున్న ప్రతిసారీ... ఆ సమాజం మరింత బలమైన పునాదులతో పైకి వెళ్తూ ఉంటుంది. మానవ పరిణామక్రమంలో దీనిని మన స్పష్టంగా చూడవచ్చు. వృత్తిపరంగా నేను దర్శకుడిని కాబట్టి నా చుట్టూ ఉన్న పరిస్థితులను గమనిస్తూ ఉంటా. వాటిలో కొన్ని నాకు తెలియకుండా మెదడులో పూసలుగా చేరిపోతాయి. అవసరమైనప్పుడు ఈ పూసలన్నీ దండగా మారి బయటకు వస్తాయి. కథలో కూర్చుంటాయి.

‘కొండపొలం, ఘాటి’... ఇలా భిన్నమైన సినిమాలు తీసేటప్పుడు భయమేయదా?

సుమారు 17 సంవత్సరాల క్రితం నేను సినీ రంగంలోకి ప్రవేశించా. నాకు నచ్చిన కథలను చెప్పటానికి ‘సినిమా’ అనే మాధ్యమాన్ని ఎంచుకున్నా. నేను చెప్పే కథలకు కావాల్సిన నటీనటులను, బడ్జెట్‌ను ఎంచుకొని- అందరికీ నచ్చేటట్లు కథ చెప్పటానికి ప్రయత్నిస్తున్నా. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. నా ఉద్దేశంలో ఇక్కడ ఎవరూ ఎవరికీ పోటీ కాదు. ఒక్కొక్కరిదీ ఒకో శైలి. ఒక జర్నీ. చలం... రావిశాస్త్రి, శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి, విశ్వనాథ... ఈ రచయితల్లో ఎవరు గొప్ప అని అడిగితే ఎలా చెప్పగలం?

• సీవీఎల్ఎన్ ప్రసాద్

మనం ఎంతో ఇష్టంగా పెంచుకునే మొక్కలు ఒక్కోసారి వడలిపోయి కనిపిస్తుంటాయి. అలాంటప్పుడు మొక్కలను ఎలా సంరక్షించుకోవాలో తెలుసుకుందాం...

మొక్కలు వాడిపోతున్నాయా?

- బియ్యం కడిగిన నీళ్లను ఒక స్ప్రే బాటిల్‌లో పోసి ఉంచుకోవాలి. రోజుకు ఒకసారి ఈ నీళ్లను మొక్క మొదట్లో, కాండం పైన, ఆకుల మీద పిచికారీ చేయాలి. ఇలా వారంపాటు చేస్తే మొక్కలు బలం పుంజుకుంటాయి.
- కూరగాయల వ్యర్థాలు, కోడిగుడ్ల పెంకులు, ఉల్లిపాయ తొక్కలను మొక్కల మొదట్లోని మట్టిలో కలుపుతూ ఉండాలి. దీనివల్ల పోషకాలు అంది మొక్కలు బలంగా పెరుగుతాయి.



- అరటిపండు తొక్కలను చిన్న ముక్కలుగా చేయాలి. వీటిని ఒక ప్లాస్టిక్ బాటిల్‌లో వేసి నిండా నీళ్లు పోసి రాత్రంతా నాననివ్వాలి. ఈ నీటిని రోజుకు రెండుసార్లు మొక్కల మొదట్లో కొద్దికొద్దిగా పోయాలి. అరటిపండు తొక్కల్లోని పొటాషియం.. మొక్కలకు జీవాన్ని అందిస్తుంది.
- ఒక బకెట్ నీళ్లలో రెండు చెంచాల పసుపు వేసి బాగా కలపాలి. ఈ నీళ్లతో మొక్కల కాండాన్ని, ఆకులను బాగా తడపాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే క్రిమికీటకాలు నశించి మొక్కలు ఏపుగా పెరుగుతాయి.
- రోజులో కొద్దిసేపయినా మొక్కలకు సూర్యరశ్మి అందేలా చూసుకోవాలి. అధిక వేడి, వర్షాల నుంచి మొక్కలను కాపాడాలి. మొక్కల మొదట్లో మట్టి ఎప్పుడూ తేమగా ఉండేలా చూసుకోవాలి.
- ఎండిపోయిన కొమ్మలు, ఆకులు, పూలను ఎప్పటికప్పుడు తొలగించాలి. మొక్కల అవసరాలకు తగ్గట్టుగా సేంద్రీయ ఎరువులను అందించాలి. అప్పుడే మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి.


పర్వదినాల్లో మహిళలు పట్టుచీరలు కట్టుకుని దేవాలయాలకు, బంధుమిత్రుల ఇళ్లకు వెళుతూ ఉంటారు. ఆ సమయంలో అనుకోకుండా వర్షం కురిస్తే ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ పట్టుచీరలు కొద్దో గొప్పో తడిసి తేమను పీల్చుకుంటాయి. అలాంటప్పుడు పట్టుచీరలను సంరక్షించుకునే పద్ధతులతోపాటు వర్షాకాలంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...

వర్షాకాలంలో పట్టుచీరలను ఇలా..

- తేమవల్ల పట్టుచీర మీద ఒకరకమైన బూజు ఏర్పడుతుంది. దీంతో దారం పోగులు బలహీనమవుతాయి. చీర చిరుగులు పడుతుంది. కాబట్టి తడిసిన పట్టుచీరను గాలి తగిలేలా నీడలో ఆరవేయాలి.
- ఇస్త్రీ చేసిన తరవాత పట్టుచీర నుంచి కొద్దిపాటి తేమ బయటికి వస్తుంది. చీర పూర్తిగా వేడి చల్లారే వరకు వేచి ఉండాలి. ఏమాత్రం తడి లేదని నిర్ధారించుకున్న తరవాతనే బీరువాలో పెట్టాలి.
- పట్టుచీరలను పలుచని కాటన్ వస్త్రం లేదా పేపర్లో చుట్టి జాగ్రత్త చేయాలి. దీనివల్ల వాతావరణంలోని తేమ, దుమ్ము లాంటివి చీరకు పట్టకుండా ఉంటాయి. ఈ చీరలను ప్లాస్టిక్ కవర్లలో పెట్టి ప్యాక్ చేయకూడదు. అలా చేస్తే ఫంగస్ లాంటివి చేరి పాడుచేస్తాయి.
- బీరువాలో పట్టుచీరలను ఉంచిన అరల్లో ఒకటి లేదా రెండు సిలికా జెల్ సాచెట్లను ఉంచడం మంచిది. ఇవి తేమను పీల్చుకుని చీరలను పొడిగా ఉంచుతాయి. కొద్దిగా రాతి ఉప్పు, బేకింగ్ సోడా, చార్‌కోల్ పొడిలో ఒకదాన్ని తీసుకుని చిన్న కాగితాల్లో కొద్దికొద్దిగా వేసి పొట్లాలు కట్టి వాటిని బీరువా అరల్లో ఉంచినా మంచి ప్రయోజనం కనిపిస్తుంది. రెండు వారాలకు ఒకసారి ఈ పొట్లాలను మారుస్తూ ఉండాలి.
- కర్పూరం బిళ్లలు, కలరా ఉండలు, ఎండిన వేపాకులను పలుచని గుడ్డలో చుట్టి బీరువా అరల్లో ఉంచడం వల్ల సిల్వర్ ఫిష్, చిమ్మటలు లాంటి క్రిమి కీటకాలు చేరకుండా ఉంటాయి.



- నెలకు ఒకసారి పట్టుచీరలను బయటికి తీసి మడతలు విప్పి మెల్లగా దులపాలి. తరవాత మరోవిధంగా మడతపెట్టి జాగ్రత్త చేయాలి. చీర లు తేమగా ఉన్నాయనిపిస్తే కొద్దిసేపు లేత ఎండలో ఆరవేయాలి. సూర్యరశ్మి నేరుగా తగిలితే చీరలు రంగు కోల్పోయే అవకాశముంటుంది. కాబట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- బీరువా అమర్చిన చోట నేరుగా ఎండ తగలకుండా చూసుకోవాలి. బీరువా వెనక గోడ నుంచి లీకేజీ, చెమ్మ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బీరువా కింద, పక్కల.. బూజు, దుమ్ము చేరకుండా తరచూ శుభ్రం చేస్తూ ఉండాలి. అప్పుడే బీరువాలోని పట్టుచీరలు చాలాకాలం మన్నుతాయి.





ఈ వారమే విడుదల ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...		
ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ది ఫాల్ గై	తెలుగు డబ్బింగ్	సెప్టెంబర్ 03
ఇన్‌స్పెక్టర్ జెండే	హిందీ చిత్రం	సెప్టెంబర్ 05
అమెజాన్ ప్రైమ్		
ది రన్ ఎరౌండ్స్	ఒరిజినల్ సిరీస్	సెప్టెంబర్ 01
కాన్ఫిడెన్స్ క్వీన్	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 06
జియో హాట్‌స్టార్		
సు ఫ్రమ్ సో	తెలుగు డబ్బింగ్	సెప్టెంబర్ 05
ఆపిల్ టీవీ ప్లస్		
హయ్యెస్ట్ టూ లోయస్ట్	హాలీవుడ్ మూవీ	సెప్టెంబర్ 05
ఎంఎక్స్ ప్లేయర్		
రైజ్ అండ్ ఫాల్	హిందీ సిరీస్	సెప్టెంబర్ 06

సవాళ్లను అధిగమించి.. గెలిచి...

నవమాసాలు మోసిన కన్న తల్లి తనను ఏడాది వయసులోనే వదిలించుకున్నా.. 15 ఏళ్లకే ఇల్లు వదిలి వెళ్లిపోవలసి వచ్చినా కుంగిపోలేదామె. అంచెలంచెలుగా ఎదుగుతూ ఏకంగా వంద కోట్లకు పైగా విలువైన “రూబన్స్ యాక్సెసరీస్”కు అధిపతిగా మారారు. ఆమే ముంబైకు చెందిన చీనూ కాలా... ఆమె ప్రయాణంలోని ఆసక్తికర విషయాలివీ...

చీనూ కాలాకు మొదటినుంచీ చదువంటే పెద్దగా ఆసక్తి లేదు. డ్యాన్స్, ఫ్యాషన్, మోడలింగ్ పట్ల ఎంతో మక్కువ. అయినా తండ్రి కోసం చదువుకు ప్రాధాన్యమిచ్చారు. కానీ 15 ఏళ్ల వయసులో చీనూకు తండ్రితో గొడవైంది. దాంతో గుండె నిండా బాధతో, చేతిలో 300 రూపాయలతో ఇంట్లోంచి బయటకు వచ్చేశారు. ఆ తరువాత పొట్టకూటి కోసం ఆమె చేయని పని లేదు. 20 రూపాయల కోసం ఇళ్ల చుట్టూ తిరిగి కత్తులు, కోస్టర్ సెట్‌లు అమ్మారు. రిసెప్షనిస్టుగా, రెస్టారెంట్‌లో వెయిట్రెస్‌గా పని చేశారు. వస్త్ర దుకాణంలోనూ పనిచేశారు. బ్రతుకుతెరువు కోసం పలు ఉద్యోగాలు కూడా చేశారు.

ఆ ఉద్యోగంతో...

2002లో చీనూకు టాటా కమ్యూనికేషన్స్‌లో టెలీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగమే ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. అక్కడే ఆమెకు అమిత్ కాలా పరిచయమయ్యారు. ఆ పరిచయం ప్రేమగా మారింది. అలా వారిద్దరూ 2004లో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఆ తరువాత చీనూ భర్తతో కలిసి బెంగళూరుకు వెళ్లిపోయారు. చీనూకు మోడలింగ్ పట్ల ఉన్న ఇష్టాన్ని తెలుసుకున్న అమిత్ దానిని గౌరవించి ఆమెకు వెన్నుదన్నుగా నిలిచారు. అమిత్ సహకారంతో చీనూ 2008 గ్లాడ్రాగ్స్ మిసెస్ ఇండియా పోటీల్లో పాల్గొని, టాప్ 10లో చోటు సంపాదించుకున్నారు. ఆ సమయంలోనే ఫ్యాషన్ రంగంలో జ్యూవెలరీ, యాక్సెసరీస్ అవసరం ఉందని చీనూ గుర్తించారు.

లోతుగా అధ్యయనం చేసి...

ఆ తరువాత చీనూ దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలు తిరిగి ఆభరణాల గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. మార్కెట్‌లో ఎలాంటి జ్యూవెలరీ అందుబాటులో ఉన్నాయి, వాటిని ఎలా, ఎక్కడ తయారుచేస్తున్నారు వంటి అంశాల గురించి తెలుసుకున్నారు.. ఆభరణాల గురించి పూర్తి అవగాహన తెచ్చుకుని 2014లో 3 లక్షల రూపాయలతో బెంగళూరులో ఓ మాల్‌లో రూబన్స్ యాక్సెసరీస్ స్టోర్‌ను ప్రారంభించారు. ఆపై నాలుగేళ్లలోనే బెంగళూరు, హైదరాబాద్, కొచ్చిల్లో అయిదు స్టోర్‌లు ఏర్పాటు చేసే స్థాయికి ఆమె వ్యాపారం పుంజుకుంది. మొదట హెడ్ యాక్సెసరీస్‌తో ఆమె ప్రారంభించిన రూబన్ యాక్సెసరీస్ సంస్థ నేడు తల నుంచి కాళ్ల పట్టీల వరకూ, అన్ని ఆభరణాలతో పాటు హ్యాండ్ బ్యాగుల వంటి యాక్సెసరీలను అమ్మే స్థాయికి విస్తరించి, రూ.వంద కోట్లకు పైగా టర్నోవర్ సాధిస్తూ జ్యూవెలరీ రంగంలో దూసుకుపోతుంది.



భయపడితే ఏదీ సాధించలేం..

విభిన్న డిజైన్లలో ఆభరణాలు రూపొందిస్తూ మగువల మనసులు దోచుకుంటున్న చీనూ.. భయపడితే ఏదీ సాధించలేమని చెబుతున్నారు. సవాళ్లు ఎదుర్కొంటేనే విజయం దరి చేరుతుందని ఓ సందర్భంలో ఆమె చెప్పారు. అలాగే కష్టపడితేనే ఫలితం ఉంటుందనీ, తాను రోజుకు 15 గంటలపైనే కష్టపడేదానినని వెల్లడించారు. “నేను పెద్దగా చదువుకోలేదు. కనీసం పాఠశాల విద్య కూడా పూర్తి చేయలేదు. కానీ జీవితంలో ఎదురైన అనుభవాల నుంచి ఎన్నో విలువైన జీవిత పాఠాలు నేర్చుకున్నాను” అని చీనూ చెప్పారు. తాను రైల్వే స్టేషన్‌లో తలదాచుకున్నప్పుడు ఎంతో మంది తిరిగి ఇంటికి వెళ్లిపోమని తనకు సలహా ఇచ్చారని, కానీ తాను మాత్రం ఎదురైన అన్ని ఒడిదొడుకులను తట్టుకుని ధైర్యంగా ముందుకు సాగానని గుర్తుచేసుకున్నారు. తాను ఆనాడు అంత దృఢంగా ఉండడం వలనే ఈనాడు ఈ స్థాయిలో ఉన్నానని చీనూ అంటున్నారు.



పోషకాహార లోపం, హార్మోన్ల అసమతౌల్యం, నెలసరి సమస్యల కారణంగా ఒక్కోసారి ముఖం మీద మొటిమలు, గుల్లలు, గడ్డలు ఎక్కువగా వస్తూ ఉంటాయి. వీటివల్ల మచ్చలు కూడా ఏర్పడుతుంటాయి. కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తూ వీటినుంచి ఉపశమనం పొందవచ్చు.

మెరిసే చర్మం కోసం...

- ఒక ఐస్ క్యూబ్‌ను పలుచని గుడ్డలో చుట్టి మొటిమలు, గడ్డలపై మెల్లగా అద్దాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే క్రమంగా మొటిమలు తగ్గుతాయి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల శనగపిండి, ఒక చెంచా పసుపు, తగినన్ని గులాబీ నీళ్లు పోసి పేస్టులా చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పావు గంటసేపు ఆరనివ్వాలి. తరవాత వేళ్ల కొనలతో ముఖం మీద గుండ్రంగా రుద్దుతూ పిండిని తొలగించాలి. వెంటనే గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే చర్మం మీద ఉన్న మృతకణాలు తొలగి, మొటిమలు, మచ్చలుతగ్గి ముఖం ప్రకాశవంతంగా మారుతుంది.
- ఒక గిన్నెలో రెండు చెంచాల గంధం పొడి లేదా ముల్తాని మట్టి వేసి తగినన్ని నీళ్లు పోసి కలపాలి. ఈ పేస్టుని ముఖానికి పట్టించాలి. పావుగంటసేపు ఆరనిచ్చి చల్లని నీళ్లతో శుభ్రం చేసుకుంటే ముఖం మీద పేరుకున్న జిడ్డు తొలగిపోతుంది. మొటిమలు కూడా తగ్గుతాయి.
- బాగా పండిన టమాటాను మధ్యకు కోసి ఆ బద్దతో ముఖాన్ని కింది నుంచి పైకి మృదువుగా మర్దన చేయాలి. ఇలా పది నిమిషాలపాటు చేసిన తరవాత చల్లని నీళ్లతో ముఖాన్ని కడిగేసుకోవాలి. రెండు రోజులకు ఒకసారి ఇలా చేస్తూ ఉంటే ముఖం మీద మచ్చలన్నీ మాయమవుతాయి.

స్పోర్ట్స్

కాంస్యమే.. అయినా చరిత్రే!



సాత్విక్ జోడీ ఖాతాలో రెండో పతకం

సెమీఫైనల్లో భారత జంట ఓటమి

పారిస్: ప్రతిష్ఠాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తెలుగు కుర్రాడు సాత్విక్ సాయిరాజ్, ముంబై షట్లర్ చిరాగ్ శెట్టి పతకంతో మెరిశారు. పురుషుల డబుల్స్‌లో కాంస్య పతకం సాధించారు. శనివారం అర్ధ రాత్రి ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో అమలాపురం కుర్రాడు సాత్విక్, చిరాగ్ ద్వయం 19-21, 21-18, 12-21తో చైనాకు చెందిన 11వ ర్యాంకర్ చెన్ బో యాంగ్/లియు యి జంట చేతిలో పరాజయం పాలైంది. దీంతో భారత జోడీ కంచు పతకానికి పరిమితమైంది. ప్రపంచ తొమ్మిదో ర్యాంకరైన సాత్విక్/చిరాగ్ జంటకు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఇది రెండో పతకం కావడం విశేషం. గతంలో 2022 టోక్యో ఈవెంట్‌లో కాంస్య పతకం దక్కించుకుంది. దీంతో ఈ మెగా టోర్నీ పురుషుల డబుల్స్‌లో రెండు పతకాలు నెగ్గిన భారత షట్లర్లుగా సాత్విక్, చిరాగ్ నయా చరిత్ర సృష్టించారు. అంతేకాదు.. పీవీ సింధు (ఓ స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలు), సైనా నెహ్వాల్ (ఓ రజతం, ఓ కాంస్యం) తర్వాత ఒకటి కంటే ఎక్కువ ప్రపంచ పతకాలు నెగ్గిన భారత షట్లర్లుగానూ ఘనత వహించారు. ఇక.. సాత్విక్ ద్వయం సెమీస్ చేరికతో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 2011 నుంచి కనీసం ఒక పతకం గెలుస్తూ వచ్చిన భారత సంప్రదాయాన్ని కొనసాగించినట్టయింది. కాగా.. శుక్రవారం అర్ధ రాత్రి జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్/చిరాగ్ ద్వయం 21-12, 21-19తో చిరకాల ప్రత్యర్థి, మలేసియాకు చెందిన వరల్డ్ నెం.3 జంట ఆరొన్ చియా/సో వూ యిక్‌జీ షాకిచ్చి సెమీఫైనల్ చేరింది. గత ఏడాది ఇదే మలేసియా జోడీ చేతిలో క్వార్టర్ ఫైనల్ ఓటమితో పారిస్ ఒలింపిక్స్ పతకాన్ని సాత్విక్ జంట మిస్సవడం గమనార్హం. ఈ విజయంతో ఆ పరాజయానికి భారత ద్వయం ప్రతీకారం తీర్చుకుంది. పురుషుల డబుల్స్ మరో సెమీఫైనల్లో కొరియాకు చెందిన సియో సంగ్ జె/కిమ్ వోన్ హో ద్వయం 21-12, 21-3తో డెన్మార్క్‌కు చెందిన డిఫెండింగ్ చాంప్ జోడీ కిమ్ ఆస్ట్రప్/స్కారప్ రాస్‌ముసెన్‌పై గెలిచి ఫైనల్ చేరింది. ఆదివారం జరిగే తుది పోరులో చైనా జంట చెన్ బో యాంగ్/లియు యితో అమీతుమీ తేల్చుకోనుంది. పురుషుల సింగిల్స్‌లో థాయ్‌లాండ్ షట్లర్ కున్లావత్ వితిసార్న్, చైనాకు చెందిన ప్రపంచ నెంబర్‌వన్ షి యుకి టైటిల్ పోరులో అమీతుమీ తేల్చుకోనుండగా.. మహిళల సింగిల్స్‌లో చైనా సంచలనం చెన్ యుఫీ, జపాన్ షట్లర్ అకానె యమగూచి ఫైనల్లో తలపడనున్నారు.

కొరియాకు మలేసియా ఝలక్

● ఆసియా కప్ హాకీ

> **నేటి మ్యాచ్**
> భారత్ X జపాన్
> మ. 3 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

రాజ్‌గిర్ (బిహార్): ఆసియా కప్ హాకీ టోర్నీలో కొరియా టైటిల్ ఆశలకు గట్టి దెబ్బ తగిలింది. శనివారం జరిగిన పూల్ 'బి' మ్యాచ్‌లో ఐదుసార్లు చాంపియన్ కొరియాకు 4-1తో మలేసియా ఝలకిచ్చింది. జియోనియో జిన్ రెండో నిమిషంలోనే గోల్ చేసి కొరియాను ఆధిక్యంలో నిలిపాడు. కానీ తర్వాత అద్భుతంగా పుంజుకొన్న మలేసియా అఖీముల్లా (29, 34, 58) హ్యాట్రిక్‌తోపాటు అష్రన్ ఫీల్డ్ గోల్‌తో అనూహ్య విజయం దక్కించుకుంది. పూల్ 'బి' మరో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 8-3తో తైపీని చిత్తు చేసింది.

రాజస్థాన్ కోచింగ్‌కు ద్రవిడ్ గుడ్‌బై

● ఫ్రాంచైజీతో విభేదాలే కారణమా?



న్యూఢిల్లీ: ఐపీఎల్ జట్టు రాజస్థాన్ రాయల్స్ చీఫ్ కోచ్ పదవి నుంచి రాహుల్ ద్రవిడ్ వైదొలిగాడు. ఈ విషయాన్ని రాజస్థాన్ యాజమాన్యం శనివారం ప్రకటించింది. 'పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ద్రవిడ్‌కు ఉన్నతమైన స్థానం కోసం ప్రతిపాదించాం. కానీ, అతడు దానిని తిరస్కరించాడు. జట్టును వీడాలనుకొన్నాడు' అని ఎక్స్‌లో రాజస్థాన్ పోస్టు చేసింది. గతేడాది టీమిండియా కోచ్‌గా కాంట్రాక్ట్ ముగిసిన తర్వాత.. రాజస్థాన్ కోచ్‌గా ద్రవిడ్ నియమితులయ్యాడు. అయితే, కొన్నేళ్లపాటు జట్టుతో కొనసాగే విధంగా ఒప్పందం కుదుర్చుకొన్నా.. ఒక్క సీజన్‌కే తప్పుకోవడం గమనార్హం. కెప్టెన్ సంజూ శాంసన్ కూడా తనను విడుదల చేయాలని ఫ్రాంచైజీని కోరినట్టు ఇప్పటికే వార్తలు వెలువడ్డాయి. ఇప్పుడు ద్రవిడ్ కూడా వైదొలగడం ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా కొత్త కెప్టెన్ విషయంలో యాజమాన్యంతో ద్రవిడ్ విభేదించాడనే వార్తలు వినవస్తున్నాయి. శాంసన్ జట్టును వీడే అవకాశాలు ఉండడంతో రియాన్ పరాగ్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించాలని ఫ్రాంచైజీ భావిస్తోందట. ఈ సీజన్‌లో గాయపడిన సంజూ బ్యాటింగ్‌కే పరిమితం కాగా.. పరాగ్ ఎక్కువ మ్యాచ్‌లకు సారథ్యం వహించాడు. అయితే, నిరుడు ప్లేఆఫ్స్ చేరిన రాయల్స్.. ఈ ఏడాది తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో పరాగ్‌కు సారథ్యం అప్పగించడంపై సుముఖంగా లేని ద్రవిడ్.. జట్టులోని జైస్వాల్, జురెల్ పేర్లను పరిగణనలోకి తీసుకోవాలని కోరాడట. అయితే, రాయల్స్ యాజమాన్యం మాత్రం పరాగ్‌వైపే మొగ్గుచూపుతుండడంతో.. జట్టును వీడాలని ద్రవిడ్ నిర్ణయం తీసుకున్నాడని తెలిసింది.

టైటాన్స్ రెండో ఓటమి

ప్రొ కబడ్డీలో యోధాస్ గెలుపు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో ఆతిథ్య తెలుగు టైటాన్స్ జట్టుకు రెండో రోజూ కలిసిరాలేదు. శనివారం ఇక్కడ జరిగిన తమ రెండో మ్యాచ్‌లో టైటాన్స్ 35-40తో యూపీ యోధాస్ చేతిలో పరాజయం పాలైంది. యోధాస్ తరఫున గగన్ గౌడ 14 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇందులో నాలుగు బోనస్ పాయింట్లు ఉండడం విశేషం. కెప్టెన్ సుమిత్ సాంగ్వాన్ 8, గుమన్ సింగ్ 7 పాయింట్లు స్కోర్ చేశారు. టైటాన్స్ జట్టులో విజయ్ మాలిక్ రైడ్ ద్వారా పది పాయింట్లు, ట్యాకిలింగ్‌లో ఒకటి, బోనస్ రూపంలో మరో మూడు పాయింట్లు సాధించాడు. మరో మ్యాచ్‌లో యు ముంబా 6-5తో గుజరాత్ జెయింట్స్‌పై టైబ్రేకర్‌లో గెలిచింది. అంతకుముందు ఇరుజట్లు హోరాహోరీగా పోరాడడంతో 29-29తో స్కోరు సమమైంది. దీంతో టైబ్రేక్‌లో ఫలితం యు ముంబాను వరించింది.

భారత్‌కు పాక్ జూనియర్ హాకీ జట్టు

రాజ్‌గిర్: భారత్‌లో జరగనున్న ఎఫ్‌ఐహెచ్ జూనియర్ వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్ హాకీ జట్టు పాల్గొననుందని హాకీ ఇండియా కార్యదర్శి భోలానాథ్ సింగ్ చెప్పాడు. భద్రతా కారణాలతో ఆసియా కప్ నుంచి పాక్ సీనియర్ జట్టు వైదొలిగిన సంగతి తెలిసిందే. అయితే, జూనియర్ జట్టు మాత్రం భారత్‌లో పర్యటించేందుకు సుముఖత వ్యక్తం చేసిందని భోలా తెలిపాడు. నవంబరు-డిసెంబరులో చెన్నై, మదురై నగరాల్లో వరల్డ్‌కప్ జరగనుంది.

12 బంతుల్లో 11 సిక్సర్లు

సల్మాన్ నిజార్ సంచలనం



తిరువనంతపురం: కేరళ క్రికెట్ లీగ్ (కేఎల్‌సీ)లో కాలికట్ గ్లోబ్‌స్టార్స్ బ్యాటర్ సల్మాన్ నిజార్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఇన్నింగ్స్ చివరి 12 బంతుల్లో ఏకంగా 11 సిక్సర్లు బాది ఔరా.. అనిపించాడు. శనివారం త్రివేండ్రం రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సల్మాన్ 26 బంతుల్లోనే అజేయంగా 86 పరుగులు సాధించాడు. ఆరంభంలో నెమ్మదిగా ఆడిన తను 19వ ఓవర్‌లో ఐదు వరుస సిక్సర్లతో 31 రన్స్ రాబట్టాడు. ఆఖరి ఓవర్‌లోనైతే తానెదుర్కొన్న ఆరు లీగల్ డెలివరీలను సిక్సర్లుగా మలిచి 40 రన్స్ రాబట్టాడు. ఈ ఓవర్‌లో రెండో బంతి వైడ్ కాగా, మూడో బంతి నోబ్‌తో పాటు మూడు పరుగులు వచ్చాయి. ఈ బాదుడుకు కాలికట్ జట్టు చివరి 12 బంతుల్లో 75 రన్స్ సాధించి టీ20 ఫార్మాట్‌లో సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఇక 187 రన్స్ ఛేదనలో రాయల్స్ 173 రన్స్‌కే పరిమితమై ఓడింది.

సాయికార్తీక్ జోడీకి ఐటీఎఫ్ టైటిల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ 15కె వరల్డ్ టూర్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన సాయికార్తీక్ రెడ్డి డబుల్స్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. శనివారం థాయ్‌లాండ్‌లో జరిగిన ఫైనల్లో సాయికార్తీక్/థాంటబ్ (థాయ్‌లాండ్) జోడీ 7-6, 6-3తో అథర్వ (భారత్)-యుటా టోమిడా (జపాన్) జంటపై గెలిచింది.

ప్రీక్వార్టర్స్‌కు జొకో

● అల్కారజ్, సబలెంక, గాఫ్ కూడా

● యూఎస్ ఓపెన్‌లో ఆండ్రీవ అవుట్



న్యూయార్క్: స్టార్ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ యూఎస్ ఓపెన్‌లో జోరు కొనసాగిస్తున్నాడు. రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన ఈ మాజీ చాంపియన్ సింగిల్స్‌లో ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. శనివారం జరిగిన మూడో రౌండ్లో 7వ సీడ్ జొకోవిచ్ 6-4, 6-7(4), 6-2, 6-3తో కామ్ నోరిని ఓడించాడు. ఓవైపు వెన్నునొప్పితో బాధపడుతూనే ఆటను కొనసాగించిన 38 ఏళ్ల జొకో మ్యాచ్‌లో ఏకంగా 18 ఏస్‌లు సంధించడం విశేషం. ఈ గెలుపుతో 1991లో జిమ్మీ కానర్స్ (38 ఏళ్ల వయసులో) తర్వాత యూఎస్ ఓపెన్‌లో నాలుగో రౌండ్ చేరిన అతిపెద్ద వయస్కుడిగా జొకో రికార్డు సృష్టించాడు. మూడోరౌండ్లో 4వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 7-6(3), 6-7 (11), 6-4, 6-4తో జెరోమ్ కిమ్‌పై నెగ్గగా, జర్మనీ క్వాలిఫయర్ జాన్ లెనార్డ్ స్ట్రఫ్ 6-4, 6-3, 7-6(7)తో 17వ సీడ్ టియాఫోను కంగుతినిపించాడు. 2వ సీడ్ అల్కారజ్ 6-2, 6-4, 6-0తో లూసియానోని ఓడించి ప్రీక్వార్టర్స్ చేరాడు. అడ్రియన్ మనారియాతో పోరులో 6-3, 3-6, 6-4, 4-6తో ఉన్న దశలో 6వ సీడ్ బెన్ షెల్టన్ గాయంతో మ్యాచ్ నుంచి వైదొలిగాడు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్లో అమెరికాకు చెందిన 29 ఏళ్ల టేలర్ టౌన్‌సెండ్ 7-5, 6-2తో 5వ సీడ్ మిర్రా ఆండ్రీవకు షాకిచ్చింది. మరో మ్యాచ్‌లో క్రెజికోవా 4-6, 6-4, 6-4తో 10వ సీడ్ ఎమ్మా నవారోను చిత్తుచేయగా.. టాప్‌సీడ్ సబలెంక 6-3, 7-6 (2)తో లైలా ఫెర్నాండెజ్‌ను, లోకల్ స్టార్, 3వ సీడ్ కోకో గాఫ్ 6-3, 6-1తో మాగ్దలినాను ఓడించి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు.

అనిరుధ్ జోడీ బోణీ: పురుషుల డబుల్స్‌లో భారత జోడీ అనిరుధ్ చంద్రశేఖర్/విజయ్ ప్రశాంత్ శుభారంభం చేసింది. తొలిరౌండ్లో హారిసన్/ఎవాన్ ద్వయంపై గెలిచింది. ఇక, రుత్విక్/శ్రీరామ్ జంట తొలి రౌండ్లోనే ఓడింది.

ఆసియాకప్ సమయం మారింది

● రాత్రి 8 నుంచి మ్యాచ్‌లు

దుబాయ్: యూఏఈలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఆసియాకప్ టీ20 మ్యాచ్‌ల సమయాలను మార్చారు. సెప్టెంబరు 9 నుంచి టోర్నీ జరగనుండగా.. ఈ సమయంలో అక్కడ ఎండ వేడిమి 40 డిగ్రీల వరకు ఉండనుంది. రాత్రి ఏడు గంటల వరకు కూడా వేడి తీవ్రత కొనసాగే అవకాశం ఉంది. దీంతో ఆటగాళ్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమయం మార్చాల్సిందిగా ప్రసారకర్తలకు భారత్ సహా పాకిస్థాన్, శ్రీలంక, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డులు విజ్ఞప్తి చేశాయి. దీంతో 18 మ్యాచ్‌లను అర్ధగంట వెనక్కి జరపగా, భారత కాలమాన ప్రకారం రాత్రి 8 గంటలకు మ్యాచ్‌లు ఆరంభమవుతాయి. అయితే ఒక్క మ్యాచ్ (అబుదాబిలో సెప్టెంబరు 15) మాత్రం సాయంత్రం 5.30కి మొదలు కానుంది.

ఫిట్‌నెస్ టెస్టుకు సిద్ధం

బెంగళూరు: ఆసియాకప్ ఆరంభానికి ముందు ఫిట్‌నెస్ టెస్టు కోసం భారత ఆటగాళ్లంతా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఏ)కి చేరుకుంటున్నారు. వన్డే కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు టీ20 వైస్‌కెప్టెన్ శుభ్‌మన్ గిల్, పేసర్లు బుమ్రా, సిరాజ్, జైస్వాల్, శార్దూల్ ఠాకూర్ ప్రస్తుతం సీఓఏలోనే ఉన్నారు. ఇక హర్షిత్, అర్ష్‌దీప్, కుల్దీప్ బెంగళూరులోనే దులీప్ ట్రోఫీ ఆడుతున్నారు. రోహిత్ వన్డేలకు మాత్రమే పరిమితమైన విషయం తెలిసిందే. ఇక భారత ఆటగాళ్లకు కొత్తగా ప్రవేశపెట్టిన బ్రాంకో టెస్టు ద్వారా ఫిట్‌నెస్‌ను పరీక్షించే అవకాశం ఉంది.

తొక్కిసలాట మృతులకు రూ.25 లక్షలు

ఆర్‌సీబీ ప్రకటన

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): తమ జట్టు విజయోత్సవాల్లో తొక్కిసలాట కారణంగా మృతి చెందిన వారికి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు నష్టపరిహారాన్ని పెంచింది. ఐపీఎల్ చరిత్రలో తొలిసారిగా ఆర్‌సీబీ ఈ ఏడాది విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. దీంతో చిన్నస్వామి స్టేడియంలో సంబరాలు చేసుకునే సమయంలో బయట తొక్కిసలాట జరిగి 11 మంది మృతి చెందారు. ఆ సమయంలో ఆర్‌సీబీ రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించింది. తాజాగా ఆర్‌సీబీ కేర్స్ పేరిట విడుదల చేసిన ప్రకటనలో ఒక్కో అభిమాని కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ఇవ్వనున్నట్టు వెల్లడించింది.

బిజినెస్ ప్లస్

క్రెడిట్ కార్డుతో అద్దె చెల్లిస్తున్నారా!



అయితే ఆలోచించి ఉపయోగించండి

దేశ జనాభాలో చాలా మందికి సొంత గూడు లేదు. ఆదాయానికి తగ్గట్టు ఏదో ఒక అద్దె ఇల్లే గతి. పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత ఎక్కువ. మంచి ఇల్లు అద్దెకు దొరకడం ఒక సమస్య అయితే, అద్దె చెల్లించడం మరో సమస్య. ఒక్కోసారి సమయానికి జీతం రాదు. లేదా అత్యవసర ఖర్చులు వస్తాయి. అలాంటప్పుడు అప్పు చేసి లేదా క్రెడిట్ కార్డు ద్వారా అద్దె చెల్లించాల్సి వస్తుంది. క్రెడిట్ కార్డుతో అద్దె చెల్లించడంలో కొన్ని లాభాలతో పాటు కొన్ని నష్టాలూ ఉన్నాయి. అవేమిటంటే..

లాభాలు

రివార్డులు, క్యాష్‌బ్యాక్‌లు : క్రెడిట్ కార్డుల ద్వారా జరిపే అన్ని చెల్లింపులకు రివార్డు పాయింట్లు, క్యాష్‌బ్యాక్‌లు లభిస్తాయి. అద్దె చెల్లింపులకూ ఇది వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి క్రెడిట్ కార్డు ద్వారా తన ఇంటి నెలవారీ అద్దె రూ.30,000 చెల్లిస్తే క్యాష్‌బ్యాక్ రూపంలో ఒక శాతం వరకు (రూ.300) లభిస్తుంది.

వెసులుబాటు: క్రెడిట్ కార్డు ద్వారా అద్దె చెల్లిస్తే క్రెడిట్ కార్డు కంపెనీకి ఆ మొత్తాన్ని 25 నుంచి 50 రోజుల్లో వడ్డీ లేకుండా చెల్లించవచ్చు. తాత్కాలిక ఆర్థిక ఇబ్బందులతో బాధపడే వారికి ఇది పెద్ద ఊరట.

క్రెడిట్ స్కోరు: క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించిన అద్దె మొత్తాన్ని మళ్లీ సమయానికి క్రెడిట్ కార్డు కంపెనీకి చెల్లించాలి. క్రమం తప్పకుండా ఇలా చేయడం వల్ల క్రెడిట్ స్కోర్ పెరుగుతుంది. తద్వారా భవిష్యత్‌లో రుణాలు తీసుకోవాల్సి వస్తే సులభమైన షరతులతో లేదా ఎక్కువ మొత్తాన్ని తక్కువ వడ్డీ రేటుతో అప్పుగా తీసుకునే సౌలభ్యం ఉంటుంది.

వెసులుబాటు: క్రెడిట్ కార్డు ద్వారా అద్దె చెల్లించడం చాలా సులభం. ఈ చెల్లింపులకు సంబంధించిన డిజిటల్ రికార్డులూ అందుబాటులో ఉంటాయి. భవిష్యత్‌లో ఇంటి యజమానితో లేదా పన్ను అధికారులతో ఏవైనా సమస్యలు ఏర్పడితే సాక్ష్యాలుగానూ ఉపయోగపడతాయి.

సమస్యలు

ఫీజులు: చాలా బ్యాంకులు తమ క్రెడిట్ కార్డుల ద్వారా జరిగే అద్దె చెల్లింపులపై ఒకటి నుంచి రెండు శాతం వరకు ఫీజుగా వసూలు చేస్తున్నాయి. ఉదాహరణకు ఒక వ్యక్తి తన క్రెడిట్ కార్డు ద్వారా రూ.30,000 అద్దె చెల్లించాడనుకుందాం. దీనిపై బ్యాంకు 1.5 శాతం చొప్పున రూ.375 ఫీజుగా వసూలు చేసింది. దీంతో రివార్డులు, క్యాష్‌బ్యాక్‌ల ద్వారా వచ్చే దానికంటే ఫీజు రూపంలో పోయేదే ఎక్కువవుతుంది.

ట్యాక్స్ స్క్రూటినీ: క్రెడిట్ కార్డు ద్వారా అద్దె చెల్లిస్తుంటే, ఆ డిజిటల్ రికార్డులు భద్రంగా ఉంటాయి. ఐటీ రిటర్న్‌లో మీరు పేర్కొన్న ఆదాయానికి, అద్దె చెల్లింపు మధ్య భారీ వ్యత్యాసం ఉన్నా, హెచ్‌ఆర్‌ఏ ఎక్కువగా క్లెయిమ్ చేసినా ఐటీ శాఖకు దొరికిపోతారు.

యాజమాని ఆమోదించాలి: చాలా మంది ఇళ్ల యజమానులు క్రెడిట్ కార్డు చెల్లింపులను ఆమోదించరు. నగదు లేదా బ్యాంకు ట్రాన్స్‌ఫర్ అడుగుతుంటారు. అద్దె ఆదాయంపైనే ఆధారపడే యజమానులైతే బ్యాంకు ట్రాన్స్‌ఫర్‌లను కూడా అంగీకరించరు. అంతా నగదు రూపంలోనే చెల్లించమంటారు.

అప్పుల ఊబి: గడువులోగా క్రెడిట్ కార్డు బకాయిలు చెల్లించాలి. లేకపోతే వడ్డీ మీద వడ్డీ చెల్లించలేక అప్పుల ఊబిలో చిక్కుకుపోవాల్సి ఉంటుంది.

పై విషయాలన్నిటిని బేరీజు వేసుకున్న తర్వాతే క్రెడిట్ కార్డు చెల్లింపులను ఎంచుకోవాలి. ఇక్కడ ఫీజుల రూపంలో పోయేదాని కంటే రివార్డులు, క్యాష్‌బ్యాక్‌ల రూపంలో వచ్చేది ఎక్కువగా ఉండాలి. లేకపోతే క్రెడిట్ కార్డు ద్వారా అద్దెల చెల్లింపు దండగ అని చెప్పక తప్పదు.

హైదరాబాద్‌లో మదుపరుల శిబిరం

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): సెబీ, ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ (ఐఈపీఎఫ్ఏ) సారథ్యంలో సీడీఎస్ఎల్ ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫండ్ (సీడీఎస్ఎల్ ఐపీఎఫ్), బీఎస్ఈ ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫండ్ (బీఎస్ఈ ఐపీఎఫ్) హైదరాబాద్‌లో 'నివేశక్ శివిర్' (మదుపరుల శిబిరం) పేరుతో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో క్లెయిమ్ చేయని డివిడెండ్లు, షేర్లను ఎలా క్లెయిమ్ చేసుకోవాలి? నామినేషన్, కేవైసీ అప్‌డేట్ ఎలా చేయాలి? అనే విషయాలను నిపుణులు ఇన్వెస్టర్లకు వివరించారు. ఐఈపీఎఫ్ఏకు చేసిన క్లెయిమ్‌ల ప్రాసెసింగ్, క్లెయిమ్స్‌కు సంబంధించి మదుపరులు అడిగిన ప్రశ్నలకు నిపుణులు సమాధానాలు ఇచ్చారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



31 తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	560
వరంగల్	517	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,04,950 ▲	96,200 ▲	1,31,000 ▲
విజయవాడ	1,06,650 ▲	1,00,500 ▲	1,23,750 ▲
విశాఖపట్నం	1,04,950 ▼	96,200 ▲	1,31,000 ▼
రాజమండ్రి	1,04,950 ▲	96,200 ▲	1,23,900 ▲
ప్రొద్దుటూరు	1,05,000 ▲	96,600 ▲	1,23,000 ▲
ముంబై	1,02,400 ▲	93,790 ▲	1,17,572 ▲

త్వరలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

● జన్ ధన్ పథకంతో ఆర్థికానికి ఊతం

● ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



ఇండోర్ (మధ్య ప్రదేశ్): ఎన్ని సవాళ్లు ఎదురైనా భారత్ త్వరలోనే ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. మధ్య ప్రదేశ్‌లోని ఇండోర్ సమీపంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ విషయం స్పష్టం చేశారు. 'ప్రస్తుతం ప్రపంచంలోని ఐదు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో మన దేశం ఒకటి. త్వరలోనే మనం మూడో స్థానానికి చేరుకోబోతున్నాం' అని మల్హోత్రా అన్నారు. ట్రంప్ సుంకాల పోటు నేపథ్యంలోనూ జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ వృద్ధిరేటు ఐదు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 7.8 శాతానికి పెరిగింది. ఈ నేపథ్యంలోనే ఆర్‌బీఐ చీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం, బ్యాంకులు కలిసి 11 ఏళ్ల క్రితం ప్రారంభించిన ప్రధాన మంత్రి జన్ ధన్ పథకం కూడా దేశ ఆర్థిక అభివృద్ధికి దోహదం చేస్తోందని మల్హోత్రా తెలిపారు. ఇప్పటివరకు ఈ పథకం కింద 55 కోట్ల బ్యాంకు ఖాతాలు ప్రారంభమైనట్టు వెల్లడించారు. దాంతో ఈ ఖాతాదారులందరికీ పొదుపు, పెన్షన్, బీమా, రుణాలతో పాటు ఇతర ఆర్థిక సేవలూ అందుబాటులోకి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సైబర్ నేరగాళ్ల దుర్వినియోగం చేయకుండా జన్ ధన్ ఖాతాదారులు వెంటనే ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు. ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సుంకాల పోటు తాత్కాలికమే

● వృద్ధి రేటుకు ఢోకా లేదు

● సీఈఏ నాగేశ్వరన్

కోల్‌కతా: మన ఆర్థిక వ్యవస్థపై అమెరికా సుంకాల పోటు ప్రభావం తాత్కాలికమేనని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు(సీఈఏ) అనంత నాగేశ్వరన్ అన్నారు. విస్తృత ప్రయోజనాల దృష్ట్యా రెండు దేశాల మధ్య త్వరలోనే సుంకాలపై ఒక అవగాహన కుదిరే అవకాశం ఉందన్నారు. ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) నిర్వహించిన ఒక సదస్సులో దృశ్య మాధ్యమం ద్వారా పాల్గొన్న ఆయన ఈ విషయం చెప్పారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం(బీటీఏ)పై అమెరికా-భారత్ దాదాపుగా ఒప్పందానికి చేరువైనా, కొన్ని అనూహ్య పరిణామాలతో ఒప్పందం కుదురలేదన్నారు. సీఈఏ తాజా ప్రకటనతో బీటీఏ కోసం రెండు దేశాల మధ్య తెర వెనుక ఇంకా మంతనాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. సుంకాల సమస్య నుంచి ఎగుమతిదారులను ఆదుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా ప్రభుత్వం చర్చిస్తున్నట్టు నాగేశ్వరన్ చెప్పారు. సుంకాలతో మన జీడీపీ వృద్ధి రేటుకు పెద్దగా వచ్చే ముప్పు కూడా ఏమీ లేదని తేల్చి పారేశారు. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వృద్ధి జోరు మున్ముందు త్రైమాసికాల్లోనూ కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	117
వరంగల్	95	గుంటూరు	112
కరీంనగర్	95	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	100
కర్నూలు	95	నెల్లూరు	105
విశాఖపట్నం	121	అనంతపురం	105
గోదావరి	117		

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ద్వారా వస్తువులు విక్రయిస్తున్నారా?



రాంబాబు గొండాల

ఇటీవలికాలంలో ఆన్‌లైన్ ద్వారా వస్తు కొనుగోళ్లు అనూహ్యంగా పెరిగాయి. దాంతో చాలా వ్యాపార సంస్థలు షోరూమ్‌లతోపాటు ఆన్‌లైన్‌లోనూ విక్రయాలు సాగిస్తున్నాయి. ముఖ్యంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ సైట్ల ద్వారా భారీగా కొనుగోళ్లు జరుగుతున్న నేపథ్యంలో చాలా మంది విక్రేతలు ఈ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని అమ్మకాలు జరుపుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ చాలా మంది వ్యాపారులు ఈ-కామర్స్ ఆపరేటర్స్ ద్వారా అమ్మకాలు సాగిస్తున్నారు. వీరు జీఎస్‌టీకి సంబంధించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం..

జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ ఎవరికి అవసరమో చెప్పేందుకు వ్యాపారులను అంటే, సరఫరాదారులను రెండు వర్గాలుగా విభజించారు. మొదటి వర్గం సాధారణ వ్యాపారులు. వీరికి వార్షిక టర్నోవర్ నిర్ధారిత పరిమితి దాటేంతవరకు రిజిస్ట్రేషన్ అవసరం లేదు. రెండో వర్గం రిజిస్ట్రేషన్ తప్పనిసరి అయినవారు. వీరు టర్నోవర్‌తో సంబంధం లేకుండా ముందే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

సాధారణ వ్యాపారుల విషయానికొస్తే, వీరికి ఆర్థిక సంవత్సరంలో టర్నోవర్ పరిమితిని రూ.20 లక్షలుగా నిర్ధయించారు. అంటే, పూర్తిగా పన్ను మినహాయింపు పొందిన సరఫరాలు, రివర్స్ చార్జ్ మెకానిజంలోకి వచ్చే సరఫరాదారులు తప్ప మిగతా వారు రూ.20 లక్షల వార్షిక టర్నోవర్ దాటితే తప్పక రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అయితే, చిన్న, మధ్య తరగతి వ్యాపారులకు లబ్ధి చేకూర్చేందుకు కేవలం వస్తువులు మాత్రమే విక్రయించే వర్తకులకు ఈ పరిమితిని కొన్ని రాష్ట్రాల్లో రూ.40 లక్షలుగా నిర్ధారించారు. వారి సరఫరాల్లో సేవలు కూడా ఉంటే మాత్రం పెంచిన పరిమితి వర్తించదు. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, ఆంధ్ర ప్రదేశ్‌లో ఈ పరిమితి రూ.40 లక్షలుగా ఉండగా.. తెలంగాణలో మాత్రం రూ.20 లక్షలకే పరిమితం చేశారు. అంటే, కేవలం వస్తువులను మాత్రమే విక్రయిస్తుంటే ఆంధ్ర ప్రదేశ్‌లో రూ.40 లక్షలు, తెలంగాణలో రూ.20 లక్షల వార్షిక టర్నోవర్ వరకు రిజిస్ట్రేషన్ అవసరం లేదు.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ ఆపరేటర్ల ద్వారా వస్తువులు విక్రయించే వారు, ముఖ్యంగా ఇంటి నుంచే విక్రయాలు జరిపేవారు తమ టర్నోవర్ చాలా తక్కువ గనుక రిజిస్ట్రేషన్ అవసరం లేదని భావిస్తుంటారు. కానీ, ఈ-కామర్స్ ఆపరేటర్స్ ద్వారా వస్తు అమ్మకాలను జరిపేవారిని ప్రభుత్వం రెండో వర్గంగా గుర్తించింది. అంటే, వీరు తప్పనిసరిగా జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందే. సాధారణ వ్యాపారులకు వర్తించే రూ.20 లక్షలు లేదా రూ.40 లక్షల వార్షిక టర్నోవర్ పరిమితి వీరికి వర్తించదు. కాబట్టి, ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు ప్రారంభించే ముందే జీఎస్‌టీ నెట్‌వర్క్‌లో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. తాము ఆర్జించే తొలి రూపాయి నుంచి పన్ను చెల్లించాలి. చాలా మంది ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌తోపాటు ఇతర మార్గాల్లోనూ విక్రయాలు జరుపుతుంటారు. ఒకసారి రిజిస్ట్రేషన్ తీసుకుంటే ఈ-కామర్స్ ఆపరేటర్స్ ద్వారా విక్రయించిన సరుకుతోపాటు ఇతర మార్గాల్లో అమ్మకాలకూ జీఎస్‌టీ వర్తిస్తుంది.

సాధారణంగా ఈ-కామర్స్ ఆపరేటర్లు తమతో ఒప్పందం కుదుర్చుకున్న విక్రేతలకు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ ఖచ్చితంగా ఉండేలా జాగ్రత్తపడతాయి. చాలా మంది చిరు వ్యాపారులు ఈ-కామర్స్ ఆపరేటర్ల సూచన మేరకు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ పొందినప్పటికీ, వార్షిక టర్నోవర్ పరిమితి దాటనంత వరకు పన్ను చెల్లించనక్కర్లేదని, రిటర్నులూ సమర్పించాల్సిన అవసరం లేదని భావిస్తుంటారు. కానీ, ఈ-కామర్స్ సైట్ల ద్వారా విక్రయాలు జరిపేవారు ముందుగానే జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ పొందడమే కాకుండా సమయానికి రిటర్నులు దాఖలు చేయడంతోపాటు సంబంధిత పన్నును సకాలంలో చెల్లించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. రిటర్నుల ఫైలింగ్‌లో అనుభవం లేనివారు అకౌంటెంట్ల సలహాలు, సాయంతో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

అల్లు అరవింద్ మాతృమూర్తి కన్నుమూత









దివంగత హాస్యనటుడు అల్లు రామలింగయ్య సతీమణి, అల్లు అరవింద్ తల్లి... కనకరత్నం (94) శుక్రవారం అర్ధరాత్రి దాటాక కన్నుమూశారు. శనివారం సాయంత్రం ఆమె అంత్యక్రియలు కోకాపేట్‌లో నిర్వహించారు. అల్లు అరవింద్ ఫామ్‌హౌస్‌లో అల్లు రామలింగయ్య సమాధి పక్కన కనకరత్నం అంత్యక్రియలు నిర్వహించారు. చిరంజీవి, అల్లు అర్జున్ పాడె మోశారు. అల్లు అరవింద్ అంతిమ సంస్కారాలను నిర్వహించారు. అంతిమ యాత్రలో అల్లు శిరీష్, రామ్‌చరణ్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అల్లు కనకరత్నం కోరిక మేరకు ఆమె నేత్రాలను అల్లు కుటుంబం చిరంజీవి ఐ బ్యాంక్‌కు దానం చేసింది. కనకరత్నమ్మ నేత్రదానం ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని చిరంజీవి కొనియాడారు. కనకరత్నమ్మ మృతి వార్త తనకు విచారం కలిగించిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)



నాకు మాత్రం ఆయన
ముద్దుల మావయ్య

నారా లోకేశ్

'చరిత్ర సృష్టించాలన్నా.. దాన్ని తిరగరాయాలన్నా మావయ్య బాలయ్యకే సొంతం. ఆయనకున్నంత ఎనర్జీ మా తరంలో ఎవ్వరికీ లేదు. ఆయన ఇప్పటికీ యువకుడే. మీ అందరికీ ఆయన బాలయ్య బాబు కానీ నాకు మాత్రం ముద్దుల మావయ్య' అని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. హీరోగా ఇండస్ట్రీలో 50 ఏళ్లు పూర్తిచేసుకున్నందుకు నందమూరి బాలకృష్ణ ప్రతిష్ఠాత్మక వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ - యూకే గోల్డ్ ఎడిషన్‌లో స్థానం దక్కించుకున్న సంగతి తెలిసిందే. భారతీయ సినీ పరిశ్రమలో ఈ ఘనత సాధించిన తొలి నటుడు ఆయనే కావడం విశేషం. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కమిటీ నందమూరి బాలకృష్ణను శనివారం సర్టిఫికెట్, ప్రత్యేక జ్ఞాపికతో సన్మానించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారా లోకేశ్, కేంద్రమంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ 'బాలకృష్ణ గారు యాభై ఏళ్లుగా సినీ రంగంలో, తర్వాత రాజకీయాల్లోనూ ప్రత్యేక స్థానం సాధించుకున్నారు. ఆయన భోళా శంకరుడు. ఏదీ మనసులో దాచుకోరు. బాలయ్య బాబుగారు ఎప్పుడూ అన్‌స్టాపబుల్. ఆయనకు ఈ గుర్తింపు దక్కడం మనందరికీ గర్వకారణం' అన్నారు. బాలకృష్ణ మాట్లాడుతూ 'నాకు జన్మనిచ్చి, మీ అందరి హృదయాల్లో నిలిపిన దైవాంశ సంభూతులు నాన్న ఎన్టీఆర్‌కూ, అమ్మ బసవతారకం గారికి నా నివాళులు. అభిమానులకూ, చిత్ర పరిశ్రమకు జీవితాంతం రుణపడి ఉంటాను. నాకు ఈ గౌరవం కల్పించిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కమిటీకి నా కృతజ్ఞతలు. ఈ సందర్భంగా నాకు శుభాకాంక్షలు, ఆశీస్సులు అందించిన హీరోలు అమితాబ్ బచ్చన్, రజనీకాంత్‌కు ధన్యవాదాలు. తెలంగాణలో వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50 లక్షలు విరాళంగా ఇస్తున్నాను' అని చెప్పారు. బండి సంజయ్ మాట్లాడుతూ 'ఏదైనా ముక్కుసూటిగా చెప్పే మనస్తత్వం గల వ్యక్తి బాలకృష్ణ. ఆయన ఈ ఘనత సాధించడం తెలుగు ప్రజలకు గర్వకారణం. ఆయన నిండు నూరేళ్లు ఇదే జోష్‌తో కొనసాగాలని కోరుకుంటున్నా' అని తెలిపారు.

తనను నోబెల్‌కు సిఫారసు చేయలేదనే..

భారత్‌పై ట్రంప్ సుంకాలకు కారణమిదే

» న్యూయార్క్ టైమ్స్ సంచలన కథనం

న్యూయార్క్, ఆగస్టు 30: భారత్‌పై అమెరికా అడ్డగోలు సుంకాల వెనుక 'రష్యా చమురు కొనుగోళ్లను మించిన కారణం ఉందా? ట్రంప్ వ్యక్తిగత కక్షతోనే భారీగా సుంకాలు విధించారా? ట్రంప్, మోదీ మధ్య బంధం చెడిందా?.. ఈ ప్రశ్నలన్నింటికీ న్యూయార్క్ టైమ్స్ అవుననే అంటోంది. నోబెల్ శాంతి బహుమతి కోసం ఆరాటపడుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. తనను నామినేట్ చేయాలని భారత్‌ను కోరారని, దానికి మోదీ నిరాకరించడంతో అక్కసు పెంచుకున్నారని పేర్కొంటూ ఒక కథనాన్ని ప్రచురించింది. "భారత్, పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ 40 సార్లు చెప్పుకొన్నారు. యుద్ధం ఆపే విషయంలో అమెరికా సహా మరే దేశ జోక్యం లేదని స్పష్టం చేసింది. దీనిపై ట్రంప్ ఆగ్రహించారు. జూన్ 17న మోదీతో ఫోన్‌లో మాట్లాడిన ట్రంప్.. తనను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేయాలని కోరారు. అలా చేస్తే.. యుద్ధాన్ని ట్రంప్ ఆపారని ఒప్పుకొన్నట్టు అవుతుందని, కుదరదని మోదీ స్పష్టం చేశారు. ట్రంప్ కోరారుకదా అని నామినేట్ చేస్తే.. భారత్‌లో తన ప్రతిష్ఠకు మచ్చ వస్తుందని మోదీ భావించారు. భారత్ అలా నామినేట్ చేయకపోవడంతో ట్రంప్ కక్షగట్టారు. భారత్‌పై అధిక సుంకాల వెనుక 'రష్యా చమురు కొనుగోళ్లను మించిన కారణం ఇదే. ఇతర దేశాలు రష్యా నుంచి చమురుకొంటున్నా పట్టించుకోకుండా.. భారత్‌ను కావాలనే లక్ష్యంగా చేసుకున్నారు. ఒకప్పుడు మిత్రులుగా పేరుపొందిన మోదీ, ట్రంప్ మధ్య దూరం పెరిగింది. జూన్ 17 తర్వాత వారు మళ్లీ మాట్లాడుకున్నది కూడా లేదు.." అని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది.

అమెరికాకు అన్ని పోస్టల్ పార్శిళ్లు బంద్!

» కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 30: సుంకాల ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికాకు వెళ్లే అన్ని రకాల మెయిల్ బుకింగ్స్‌ను పూర్తిగా నిలిపివేయాలని భారత్ తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పోస్టల్ విభాగం, కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ శుక్రవారం నోటీసు జారీచేశాయి. అమెరికా దిగుమతి సుంకాలపై గందరగోళం నేపథ్యంలో లెటర్లు, డాక్యుమెంట్లు, 100 డాలర్ల కంటే తక్కువ విలువైన బహుమతులు సహా అన్ని క్యాటగిరీల మెయిల్ బుకింగ్స్‌ను పూర్తిస్థాయిలో ఆపేయాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాయి. నియంత్రణ విధానాల్లో అస్పష్టత, అమెరికాకు పార్శిళ్లను రవాణా చేసేందుకు విమానయాన సంస్థల విముఖత అంశాలను కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ పేర్కొంది. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని, వీలైనంత త్వరగా అన్ని రకాల సేవలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోస్టల్ విభాగం వెల్లడించింది. అమెరికా కస్టమ్స్ విభాగం జారీచేసిన కొత్త నిబంధనల్లో స్పష్టత లేని కారణంగా పార్శిళ్లను తీసుకెళ్లేందుకు విమానయాన సంస్థలు నిరాకరిస్తున్నాయని ప్రభుత్వం ఈనెల మొదట్లో ప్రకటించిన విషయం తెలిసిందే. జూలై 30న అమెరికా ప్రభుత్వం జారీచేసిన కార్యనిర్వాహక ఉత్తర్వుల ప్రకారం.. ఆగస్టు 29 నుంచి 100 డాలర్లకు పైగా విలువైన పార్శిళ్లపై కస్టమ్స్ సుంకాలు వర్తించనున్నాయి. ఈ నేపథ్యంలో లెటర్లు, డాక్యుమెంట్లు, 100 డాలర్ల వరకు విలువైన బహుమతుల పార్శిళ్ల రవాణాకు అనుమతిస్తున్నట్లు భారత ప్రభుత్వం ఇంతకుముందటి ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే ఇప్పుడు అమెరికాకు అన్ని మెయిల్ సర్వీసులను నిలిపివేస్తూ తాజా నిర్ణయం తీసుకుంది. మరోవైపు పార్శిళ్ల దిగుమతులపై పెంచిన సుంకాలు శుక్రవారం నుంచే అమల్లోకి వచ్చాయి.

బొగ్గు కాదు బూడిద!

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించింది. జార్ఖండ్ రాష్ట్రం గిరిధ్ జిల్లా బ్రహ్మదీయ ప్రాంతంలోని బొగ్గు గనిలో నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, వాటిని తవ్వితీసి అమ్ముకుంటే రూ.వేల కోట్ల ఆదాయం వస్తుందని కేంద్ర బొగ్గు విభాగం ఆశలు కల్పించింది. ఈ మాటలు నమ్మిన గత జగన్ ప్రభుత్వం అత్యుత్సాహంతో సొంత అధ్యయనం చేయకుండానే ముందడుగు వేసింది. కేంద్ర బొగ్గు శాఖ నిర్వహించిన వేలంలో ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) పాల్గొని ఆ బ్లాక్‌ను దక్కించుకుంది. రూ.313 కోట్ల బ్యాంకు గ్యారంటీలు చెల్లించింది. ఈ ప్రాజెక్టులో జార్ఖండ్‌కు 41 శాతం వాటా ఇచ్చేందుకూ అంగీకరించింది. అక్కడ మైనింగ్ చేపట్టేందుకు లెకాన్ అనే ప్రైవేటు డెవలపర్‌ను ఎంపిక చేసింది. ప్రాజెక్టు కాలవ్యవధి కనీసం ఐదేళ్ల పాటు ఉంటుందని, 5 మిలియన్ టన్నుల స్టీల్ గ్రేడ్-1 బొగ్గు నిక్షేపాలున్నాయని కేంద్ర బొగ్గు విభాగం ముందుగానే చెప్పింది. ఇందులో 1.92 మిలియన్ టన్నుల బొగ్గును తవ్వి తీయవచ్చని, సగటున ఒక టన్నుకు 10.5 క్యూబిక్ మీటర్ల లోతున తవ్వకాలు చేపట్టవచ్చని తెలిపింది. వీటిని నమ్మి ఏపీఎండీసీ బొగ్గు తవ్వకాలు చేపట్టడానికి అవసరమైన పర్యావరణ, అటవీ, రెవెన్యూ, పంచాయతీ వంటి అనేక అనుమతులు, భూసేకరణకు గాను 2021 నుంచి ఇప్పటి వరకూ ఏపీ ప్రభుత్వం రూ.120 కోట్లకు పైగా ఖర్చు పెట్టింది. కానీ అక్కడ నాణ్యమైన బొగ్గు ఉండదని, చాలా లోతుగా మైనింగ్ చేయాల్సి ఉంటుందని, అప్పుడూ నాణ్యతపై చెప్పలేమంటూ అక్కడి జియాలజిస్టులు పలు సందర్భాల్లో వెల్లడించారు. అయినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రాగానే ఈ ప్రాజెక్టుపై ఓ ప్రైవేటు కంపెనీతో అధ్యయనం చేయించింది. బ్రహ్మదీయ బ్లాక్‌లో బొగ్గు నాణ్యత, దాని భవిష్యత్తుపై సమగ్ర పరిశీలన చేయించింది. ఆ సంస్థ ఐదు నెలల క్రితమే నివేదిక ఇచ్చిందని, అందులో విస్తుపోయే అంశాలు ఉన్నాయని తెలిసింది. బ్రహ్మదీయ కోల్ బ్లాక్‌లో లభించే బొగ్గు ఏమాత్రం నాణ్యమైనది కాదని, దాన్ని నమ్ముకొంటే పెట్టుబడి ఖర్చులు కూడా రావని నిర్ధారణ అయింది. దీంతో కంగుతిన్న ఏపీ సర్కారు ఆ ప్రాజెక్టు నుంచి తప్పుకోవాలని ప్రాథమికంగా నిర్ణయించింది. దీనిపై కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు త్వరలోనే సమాచారం ఇచ్చి బయటపడాలని భావిస్తోంది. అంతా సవ్యంగా సాగితే సర్కారుకు రూ.313 కోట్ల బ్యాంక్ గ్యారంటీలే వెనక్కి వస్తాయి. ఇప్పటివరకూ చేసిన ఖర్చంతా నష్టమే.

ముందుచూపు లేకుండా ముందుకు...

బ్రహ్మదీయ కోల్‌బ్లాక్ వేలం ఉంటుందని కేంద్ర బొగ్గు విభాగం ప్రకటించిన తర్వాత నాటి ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించాలి. వేలంలో పాల్గొనడానికి ముందే క్షేత్రస్థాయి అధ్యయన రిపోర్టు తెప్పించుకోవాలి. కానీ అలాంటిదేమీ చేయలేదు. మైనింగ్ ప్లాన్, మైనింగ్ ముగింపు ప్లాన్‌ల ఆధారంగానే వేలంలో పాల్గొన్నారు. సహజంగా ఏ కోల్‌బ్లాక్ లేదా మైనింగ్ బ్లాక్‌ను వేలం వేయాలనుకున్నా మైనింగ్ ప్లాన్ ఇస్తారు. ఈ విషయంలోనూ అదే జరిగింది. వేలంలో పాల్గొనడానికి ముందే, అక్కడ బొగ్గు నిల్వల గురించి సమగ్ర పరిశీలన చేసుకోవాలి. శాంపిల్స్‌ను పరీక్షించుకోవాలని చెప్పింది. కానీ నాటి ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలేవీ తీసుకోలేదు. పెట్టుబడులు పెట్టక ముందే బొగ్గు నాణ్యతను పరిశీలించి ఉంటే, అందులో 26 శాతం బూడిద కంటెంట్ ఉందన్న విషయం అప్పుడే బయటపడేది. బ్రహ్మదీయ కోల్ ప్రాజెక్టులో పెట్టుబడులు పెడితే పైసా లాభం రాదని అధ్యయన సంస్థ తేల్చిచెప్పింది. లాభం సంగతి పక్కనపెడితే, ఊహించని నష్టాలు వస్తాయని, ప్రాజెక్టు నిర్వహణపై పెట్టే ఖర్చంతా వృథా అవుతుందని హెచ్చరించింది. అధ్యయన సంస్థ నివేదికతో పాటు బ్రహ్మదీయ కోల్ బ్లాక్ వద్ద పరిస్థితిపై గనుల శాఖ ఇటీవల ప్రభుత్వానికి ఓ నివేదిక ఇచ్చింది. ఆ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడం అత్యంత నష్టదాయకమని అభిప్రాయపడినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కేంద్రంతో మాట్లాడి ఆ ప్రాజెక్టు నుంచి తప్పుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇదే విషయమై త్వరలో ఢిల్లీకి అధికారుల బృందాన్ని పంపనున్నట్లు తెలిసింది.

గణాంకాల మాయ

- బ్రహ్మదీయ కోల్ బ్లాక్‌లో 2.215 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని కేంద్ర బొగ్గు విభాగం చెప్పినదంతా అవాస్తవమని తాజా అధ్యయనంలో బయటపడింది. అక్కడ కేవలం 1.12 మిలియన్ టన్నుల నిల్వలే ఉన్నాయని నివేదిక వెల్లడించింది.
- మైనింగ్ చేయగలిగిన బొగ్గు నిల్వలు 1.92 మిలియన్ టన్నులని కేంద్రం చెబితే, కేవలం 0.62 మిలియన్ టన్నుల నిల్వలున్నాయని అధ్యయన సంస్థ చెప్పింది.
- అక్కడ స్టీల్ గ్రేడ్-1 రకం బొగ్గు ఉందని కేంద్రం అంటే, కేవలం వాషరే గ్రేడ్-4 రకం ఉంటుందని నివేదిక పేర్కొంది.
- అక్కడ తవ్వి తీసే బొగ్గు టన్నుకు రూ.15,955 మార్కెట్ రేటు ఉంటుదని కేంద్రం చెబితే, అంత ధర రానేరాదని, టన్ను రేటు రూ.3,195 మాత్రమే ఉందని అధ్యయన సంస్థ స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టును కొనసాగిస్తే తీవ్ర ఆర్థిక నష్టం వస్తుందని హెచ్చరించింది. లాభాలు రాకపోగా, నష్టాలు చాలా తీవ్రంగా ఉంటాయని, ఆపరేటింగ్ ప్రాఫిట్ మైనస్ రూ.306 కోట్లు ఉండొచ్చని తేల్చిచెప్పింది.

సీఎం అభ్యర్థిగా ప్రకటించుకున్న తేజస్వీ

» మద్దతు ప్రకటించిన అఖిలేశ్.. వేదికపై మౌనంగా రాహుల్

పట్నా, ఆగస్టు 30: ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తనను తాను బిహార్ విపక్ష మహాగఠ్ బంధన్ సీఎం అభ్యర్థిగా ప్రకటించుకున్నారు. ఆరాలో ఓటర్ అధికార్ యాత్ర చివరి రోజు సభ వేదికపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ తదితరులు ఉండగా తేజస్వీ ఈ ప్రకటన చేశారు. వెంటనే అఖిలేష్ తేజస్వీకి మద్దతు ప్రకటించారు. కానీ రాహుల్ గాంధీ మౌనం వహించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విపక్ష సీఎం అభ్యర్థిని తానే అని ప్రకటించుకోవడం ద్వారా ఈ విషయంలో ఇబ్బందులు లేకుండా చూసుకునేందుకు తేజస్వీ యత్నించారు. అయితే సీట్ల పంపకాల్లో అంగీకారం కుదరకపోవడమే రాహుల్ మౌనానికి కారణమని విశ్లేషకులు చెబుతున్నారు.

'మానవ జీపీఎస్' బాగూఖాన్ హతం

న్యూఢిల్లీ, ఆగస్టు 30: చొరబాట్లలో కీలకంగా వ్యవహరిస్తూ ఉగ్రవాద శ్రేణుల్లో మానవ జీపీఎస్‌గా పేరు తెచ్చుకున్న బాగూఖాన్ అలియాస్ సమందర్ చాచాను భద్రతా దళాలు ఎన్‌కౌంటర్‌లో మట్టుబెట్టాయి. జమ్మూకశ్మీర్‌లోని నౌషెరా ప్రాంతంలోకి మరో ఉగ్రవాదితో కలిసి అతడు చొరబడగా.. నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా దళాలు వారిని చుట్టుముట్టాయి. ఇది గమనించి వారు కాల్పులకు తెగబడగా ఎదురు కాల్పులు జరిపి హతమార్చాయి. బాగూఖాన్ ఎన్‌కౌంటర్‌తో ఉగ్ర సంస్థల నెట్‌వర్క్‌కు గట్టి దెబ్బ తగిలినట్లయింది.

జీమెయిల్ పాస్‌వర్డ్ మార్చుకోండి: గూగుల్

న్యూఢిల్లీ, ఆగస్టు 30: జీమెయిల్ వినియోగదారులు తక్షణమే తమ పాస్‌వర్డ్‌లను మార్చుకోవాలని గూగుల్ సూచించింది. 250 కోట్ల మంది ఖాతాల సమాచారం ప్రమాదంలో పడిందని హెచ్చరించింది. సేల్స్ ఫోర్స్ డేటా తస్కరణ(బ్రీచ్) అయిన నేపథ్యంలో ఈ ప్రమాదం ఏర్పడిందని టెక్ దిగ్గజం పేర్కొంది. ఈ ఏడాది జూన్ ప్రథమార్థంలో ఈ ఘటన చోటుచేసుకుందని వివరించింది. ముందుగా అనుకున్నదానికన్నా డేటా తస్కరణ ఘటన పెద్దదేనని పేర్కొంది. ఈ హ్యాకర్స్ తాజాగా వినియోగదారులకు కాల్స్, మెసేజెస్ చేస్తున్నారని, పాస్‌వర్డ్ రీసెట్ చేసుకోవాలని, లాగిన్ కోడ్స్ ఇవ్వాలని కోరుతున్నారని గూగుల్ హెచ్చరించింది.

ట్రంప్ సుంకాలు చట్టవిరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

అడ్డగోలు సుంకాల విధింపు అధికారాన్ని ఇవ్వలేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు 11మంది జడ్జీలతో కూడిన కోర్టులో ఏడుగురు సుంకాలకు వ్యతిరేకంగా, నలుగురు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. మెజారిటీ మేరకు సుంకాలకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు వెలువడింది. అయితే దీనిపై ట్రంప్ యంత్రాంగం సుప్రీం కోర్టులో అప్పీలు చేసుకోవడానికి వీలుగా తీర్పు అమలును అక్టోబర్ 14 వరకు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిజానికి ట్రంప్ టారిఫ్‌లు అన్యాయం, చట్టవిరుద్ధమంటూ దాఖలైన పిటిషన్లపై తొలుత విచారించిన దిగువస్థాయి ఫెడరల్ కోర్టు.. ట్రంప్ సుంకాలను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది. కానీ దానిపై ట్రంప్ యంత్రాంగం ఫెడరల్ అప్పీల్స్ కోర్టు ఫర్ ది ఫెడరల్ సర్క్యూట్‌ను ఆశ్రయించగా... దిగువ కోర్టు తీర్పును నిలిపివేసింది. ఇప్పుడు ఫెడరల్ అప్పీల్స్ కోర్టు కూడా ట్రంప్ సుంకాలు చట్టవిరుద్ధమని తీర్పు ఇచ్చింది. ట్రంప్ తిరిగి అప్పీలు చేయనున్న నేపథ్యంలో అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు కీలకం కానుంది.



అమెరికా నాశనమవుతుంది: ట్రంప్

ఫెడరల్ అప్పీల్స్ కోర్టు తీర్పుపై ట్రంప్ 'ట్రూత్' వేదికగా స్పందించారు. ప్రపంచ దేశాలపై తాము విధించిన టారిఫ్‌లు యథాతథంగా కొనసాగుతాయని చెప్పారు. కోర్టు తీర్పు పూర్తిగా ఏకపక్షం, పక్షపాతంతో కూడుకున్నదని విమర్శించారు. అయినా చివరికి అమెరికాయే గెలుస్తుందని పేర్కొన్నారు. "కోర్టు తీర్పు అమలైతే.. అమెరికా సర్వనాశనం అవుతుంది. ఇక్కడి ఉత్పత్తిదారులు, రైతులు, పనివారు తీవ్రంగా నష్టపోతారు. వివిధ దేశాలు అమెరికా దిగుమతులపై అన్యాయంగా విధిస్తున్న సుంకాలను, భారీ వాణిజ్య లోటును ఎదుర్కోవడానికి వాటిపై సుంకాలు విధించాల్సిందే. సుంకాల అమలుకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇస్తుందన్న నమ్మకముంది" అని ట్రంప్ పేర్కొన్నారు.

వలసదారుల అంశంలోనూ దెబ్బ!

అమెరికాలో సరైన పత్రాలు లేకుండా ఉంటున్నవారిని వేగంగా తిప్పిపంపేసేందుకు ట్రంప్ యంత్రాంగం చేపట్టిన చర్యలను వాషింగ్టన్ డీసీ డిస్ట్రిక్ట్ కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. వలసదారులను జడ్జి ఎదుట హాజరుపర్చకుండా, వారు చెప్పే అంశాలను పరిశీలించకుండా నేరుగా తిప్పిపంపేయడం సరికాదని కోర్టు జడ్జి జియా కోబ్ పేర్కొన్నారు. వలసదారులకు అమెరికా చట్టసభ కాంగ్రెస్ ఇచ్చిన వెసులుబాట్లను కాదనలేమని స్పష్టం చేశారు.

సుంకాలు నిలిచిపోతాయా?

1977 నాటి అమెరికా 'అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ)' ప్రకారం.. వివిధ దేశాలు, వాటి నుంచి వచ్చే దిగుమతులు అమెరికాకు ముప్పుగా పరిణమించే పరిస్థితులు నెలకొంటే, అధ్యక్షుడు అత్యవసరంగా ఆయా దేశాలపై పలురకాల ఆంక్షలు విధించవచ్చు. ఇందుకోసం చట్టసభ (కాంగ్రెస్) అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ట్రంప్ విధిస్తున్న సుంకాలు ఈ చట్టం పరిధిలోకి రావని, అడ్డగోలు సుంకాల వసూలు చేసేందుకు ట్రంప్‌కు చట్టసభ అనుమతి ఇవ్వలేదని కోర్టులు పేర్కొంటున్నాయి. ఒకవేళ సుప్రీంకోర్టు కూడా వ్యతిరేకంగా తీర్పు ఇస్తే సుంకాలు నిలిచిపోతాయా, ట్రంప్ ఏం చేస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. అయితే అధ్యక్షుడిగా ఉన్న అధికారాలతో ట్రంప్ సుంకాలు విధించేందుకు ఇతర చట్టాలు కూడా ఉన్నాయని.. కాకపోతే ట్రంప్ ఇప్పటిలా దూకుడుగా, ఇష్టం వచ్చినట్టు టారిఫ్‌లు వేయడం కుదరదని అమెరికా చట్టాల నిపుణులు చెబుతున్నారు.

ఆందోళనకరంగా బిల్ క్లింటన్ ఆరోగ్యం!

» గుండె వ్యాధులతో తీవ్ర ఇబ్బంది

» లయ సరిచేసేలా గుండెకు డీఫిబ్రిలేటర్



డీఫిబ్రిలేటర్ బ్యాగుతో క్లింటన్

న్యూయార్క్, ఆగస్టు 30: అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఇప్పటికే గుండె సంబంధిత వ్యాధులతో ఆయన బాధపడుతున్నారు. దీనికి సంబంధించి పలుమార్లు సర్జరీలు కూడా అయ్యాయి. ఇటీవల ఆయన అమెరికాలోని హ్యాంప్టన్స్ ఎయిర్‌పోర్టులో డీఫిబ్రిలేటర్ అనే వైద్య పరికరంతో కనిపించారు. ఆయనతో పాటు భార్య హిల్లరీ క్లింటన్ కూడా ఉన్నారు. పోర్టబుల్ డీఫిబ్రిలేటర్ ఉన్న బ్యాగును ఆమె తీసుకుని వెళుతున్నారని డెయిలీ మెయిల్ వార్తా సంస్థ పేర్కొంది. 79 ఏళ్ల క్లింటన్‌కు 2004లోనే హార్ట్‌ఎటాక్ వచ్చింది. నాలుగుసార్లు బైపాస్ సర్జరీ కూడా జరిగింది. కాగా, డీఫిబ్రిలేటర్ ఓ వైద్య పరికరం. గుండెలో అసాధారణ స్పందనలను సరిచేయడానికి ఉపయోగిస్తారు. ఇది గుండెకు ఓ నియంత్రిత స్థాయిలో విద్యుత్ షాక్‌ను ఇస్తుంది. దీంతో లయ తప్పిన గుండెను సాధారణ పరిస్థితిలోకి తీసుకువచ్చే వీలవుతుంది. ప్రాణాంతక గుండె లయ, అరిథ్మియా పరిస్థితుల నుంచి రోగిని కాపాడే అవకాశం కలుగుతుంది.

విదేశీ విద్యార్థులకు ట్రంప్ ని'బంధనాలు'!

ఎఫ్-1 వీసా నిబంధనల్లో త్వరలో మార్పులు.. అమలులోకి వస్తే వర్సిటీలు, కోర్సుల మార్పు కష్టమే

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వచ్చే విదేశీ విద్యార్థులకు ఇచ్చే ఎఫ్-1 వీసా నిబంధనల్లో మార్పులకు ట్రంప్ యంత్రాంగం చేసిన ప్రతిపాదనలు భారతీయుల డాలర్ డ్రీమ్స్‌ను దెబ్బకొట్టేలా ఉన్నాయి. ముఖ్యంగా విద్యార్థి వీసాపై అమెరికా వెళ్లి ఏదో ఒక కోర్సు చేస్తున్నామని చెబుతూ అక్కడే సెటిల్ అయిపోదామనుకునే వారి ఆశలను దెబ్బతీసేలా కనిపిస్తున్నాయి. ప్రస్తుతమున్న నిబంధనల ప్రకారం.. ఎఫ్-1 వీసాతో అమెరికా వెళ్లిన విద్యార్థులు తాము చదువుకునే కోర్సు కాలపరిమితి ప్రకారం ఆ దేశంలో ఉండవచ్చు. కోర్సులో చేరిన తర్వాత మేజర్స్ లేదా ప్రోగ్రామ్‌ను కూడా మార్చుకోవచ్చు. కోర్సు అధికారికంగా పూర్తయిన తర్వాత అదనంగా మరో 60 రోజులు అక్కడే ఉండవచ్చు. ఆ తర్వాత కూడా మరికొన్ని రోజులు అక్కడే ఉండాలనుకుంటే ఓపీటీ(ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్) లేదా స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) ఓపీటీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపిక చేసుకున్న కోర్సులు లేదా ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఆధారంగా వీసా గడువును పొడిగిస్తారు. అయితే, ట్రంప్ యంత్రాంగం తాజాగా చేసిన ప్రతిపాదనలు ఈ నిబంధనలను మరింత కఠినతరం చేయనున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు తమ మేజర్స్, ప్రోగ్రామ్స్‌ను అమెరికా వెళ్లిన తొలి సంవత్సరంలో మార్చుకునే వీలు ఉండదని అంటున్నారు. ఓ డిగ్రీని అమెరికాలో పూర్తి చేసి అదే స్థాయి లేదా అంతకంటే తక్కువ స్థాయి డిగ్రీ చేసేందుకు మళ్లీ ఎఫ్-1 వీసా పొందాలంటే ఇక కుదరదని చెబుతున్నారు. అలాగే, ఓ కోర్సు చేసేందుకు ఎఫ్-1 వీసాపై అమెరికా వెళ్లి మరో కొత్త కోర్సు చేస్తామంటే అంగీకరించరని అంటున్నారు. కొత్త కోర్సు చేయాలనుకునే వారు స్వదేశానికి వచ్చి వీసా కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందేనని చెబుతున్నారు.

డీహెచ్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాల్సిందే


ప్రతిపాదిత నిబంధనల ప్రకారం కోర్సు కాల పరిమితి ప్రకారం గరిష్ఠంగా నాలుగేళ్ల కాల పరిమితితో ఎఫ్-1 వీసా జారీ చేస్తారు. ఆ తర్వాత కూడా అమెరికాలో ఉండాలనుకునే వారు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్‌ఎస్)కు దరఖాస్తు చేసుకోవాల్సిందే. ప్రస్తుతం ఎఫ్-1 వీసాదారులు తమ కోర్సు పూర్తయిన తర్వాత 60 రోజులు దాకా అమెరికాలో ఉండవచ్చు. ఈ సమయంలో చాలామంది ఉద్యోగం సాధించి హెచ్-1బీ వీసా పొందుతున్నారు. ఇప్పుడు 60 రోజుల గడువును 30 రోజులకు కుదించనున్నారు. దీంతో విద్యార్థి వీసాతో అమెరికా వచ్చి ఆ తర్వాత హెచ్-1బీ వీసా పొందడం మరింత కష్టం కానుందని భారతీయ అమెరికన్ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఓపీటీ ఎక్స్‌టెన్షన్ వస్తుందని ఆశించే వారు ఇకపై ఈఓఎస్‌తో పాటు వర్క్ ఆథరైజేషన్ కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగాలే లక్ష్యం కావాలి



ప్రతిపాదిత నిబంధనలు అమల్లోకి వస్తే ఓపీటీ ద్వారా హెచ్-1 బీ వర్క్ వీసా పొందడం, విద్యార్థులు ఎంట్రీ లెవల్ ఉద్యోగాల్లో చేరడం కష్టం అవుతుంది. అందువల్ల విద్యార్థులు మేజర్స్/ప్రోగ్రామ్‌లలో మార్పులు తగ్గించుకోవాలి. చివరి నిమిషం వరకూ వేచి ఉండకుండా ఈఓఎస్(ఎక్స్‌టెన్షన్ ఆఫ్ స్టే)కు త్వరగా దరఖాస్తు చేసుకోవాలి. ఈఓఎస్ నిబంధనలకు అనుగుణంగా ఓపీటీ/స్టెమ్ అప్లికేషన్‌లు ఉండేలా చూసుకోవాలి. అధిక జీతం వచ్చే ఉద్యోగాలను లక్ష్యంగా చేసుకోవాలి. అప్పుడే హెచ్-1 బీకు అవకాశం ఉంటుంది.

- దిలీప్ కుమార్ నూనె, రిజిస్టర్డ్ మైగ్రేషన్ ఏజెంట్, కాస్మిక్ ఓవర్‌సీస్ కన్సల్టెంట్స్



చంద్రకాంత రాయితో చేసిన గిన్నె

జపాన్ బుల్లెట్ రైలులో మోదీ

» టోక్యో నుంచి సెండాయ్ వరకు జపాన్ ప్రధాని షిగేరు ఇషిబాతో కలిసి ప్రయాణం

» షిగేరు దంపతులకు మోదీ కానుకలు

» ఆంధ్రప్రదేశ్‌లో అరుదుగా దొరికే చంద్రకాంత రాయితో చేసిన బౌల్స్ బహుమతి

టోక్యో, ఆగస్టు 30: జపాన్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ శనివారం బుల్లెట్ రైలులో ప్రయాణించారు. సెండాయ్ నగరానికి టోక్యో నుంచి జపాన్ ప్రధాని షిగేరు ఇషిబాతో కలిసి బయలు వెళ్లారు. అంతకు ముందు ఆయన తూర్పు జపాన్ రైల్వే కంపెనీ(జేఆర్ ఈస్ట్)లో శిక్షణ పొందుతున్న భారతీయ లోకో పైలట్లతో ముచ్చటించారు. కొత్తగా రూపొందించిన ఆల్ఫా-ఎక్స్ రైలును ఇరువురు ప్రధానులు పరిశీలించారు. అందుకు సంబంధించిన చిత్రాలను ఎక్స్‌లో పోస్టు చేశారు. బుల్లెట్ రైలు ప్రయాణానికి ముందు మోదీ 16 మంది జపాన్ గవర్నర్లతో భేటీ అయ్యారు. మరోవైపు, జపాన్ పర్యటన సందర్భంగా మోదీ.. ఆ దేశ ప్రధాని షిగేరు ఇషిబాతో, ఆయన సతీమణికి ప్రత్యేక కానుకలు– రామెన్ బౌల్స్, వెండి చాప్‌స్టిక్స్, కశ్మీరీ శాలువాలను అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అరుదుగా లభించే చంద్రకాంత రాయితో రామెన్ బౌల్స్‌ను తయారు చేస్తారు. చంద్రకాంత రాయిని ప్రేమ, రక్షణ, సమతౌల్యానికి ప్రతీకగా భావిస్తారు. రామెన్ బౌల్ అడుగు భాగాన్ని రాజస్థాన్ పార్చిన్‌కారి శైలిలో.. అరుదైన రాళ్లతో పొదిగిన మక్రానా పాలరాతితో తయారు చేసినట్లు సమాచారం. దీంతోపాటు.. షిగేరు ఇషిబా సతీమణికి జమ్మూకశ్మీర్ హస్తకళల విశిష్టతను చాటేలా పశ్మీనా శాలువాను బహూకరించారు.



మోదీ చైనా పర్యటన వేళ ఇండియాలో ఉన్న ఆ దేశ రాయబార కార్యాలయం ఎక్స్‌లో వినాయకుడి ఫొటోను షేర్ చేసింది. ఈ విగ్రహం చైనాలో క్రీ.శ 618-907 మధ్య పాలించిన టాంగ్ వంశం కాలం నాటిది కావడం విశేషం. చైనా, భారత్‌ల మధ్య 11వందల ఏళ్ల నాటి నుంచే కళలు, విశ్వాసాలు, సంస్కృతుల కలయిక ఉందని చెప్పడానికి ఈ వినాయకుడి విగ్రహమే గుర్తు అని ఎంబసీ అధికార ప్రతినిధి యూ జింగ్ అన్నారు.

ప్రపంచం దృష్టంతా ఆ ముగ్గురు దేశాధినేతల మీదే!

ఎస్‌సీవో సదస్సు కోసం చైనాకు చేరుకున్న ప్రధాని మోదీ

» నేడు జిన్‌పింగ్‌తో ప్రత్యేక భేటీ

» రేపు మోదీతో పుతిన్ సమావేశం

తియాంజిన్, ఆగస్టు 30: ప్రధాని మోదీ ఏడేళ్ల విరామం తర్వాత చైనా గడ్డపై కాలు పెట్టారు. జపాన్ పర్యటనను ముగించుకొని ఆయన శనివారం సాయంత్రం తియాన్‌జిన్‌కు చేరుకున్నారు. ఇక్కడ ఆయన షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) సదస్సులో పాల్గొంటారు. అమెరికాతో తీవ్రమైన వాణిజ్య పరమైన ఉద్రిక్తతల వేళ మోదీ చైనాలో పర్యటించడం, జిన్‌పింగ్‌తో సమావేశం కానుండటంతో పాటు వాణిజ్య ఉద్రిక్తతలకు కారణమైన రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇదే సమయంలో చైనాలో పర్యటిస్తుండటం, మోదీతో ప్రత్యేకంగా సమావేశం అవుతారన్న వార్తల నేపథ్యంలో ఇప్పుడు ప్రపంచం దృష్టి అంతా ఈ ముగ్గురు నేతలపైనే ఉంది. జపాన్ పర్యటన సమయంలో ప్రధాని మోదీ ఓ ఇంటర్వ్యూలో.. "ప్రపంచ ఆర్థిక స్థిరత్వం కోసం చైనా, ఇండియా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది" అని నొక్కి చెప్పారు. మరోవైపు, పుతిన్ చైనాను 'ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి కీలకమైన దేశం'గా అభివర్ణించారు. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు దేశాధినేతలు తమ భేటీల్లో ఏ నిర్ణయాలు తీసుకుంటారన్నదానిపై ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వేత్తలు ఆసక్తిగా ఉన్నారు. జిన్‌పింగ్, మోదీ ఆదివారం భేటీ అవుతారు. పుతిన్, మోదీ సమావేశం సోమవారం ఉంటుందని రష్యా అధ్యక్ష కార్యాలయం ఇదివరకే ప్రకటించింది. మోదీ చివరిసారిగా 2018 జూన్‌లో చైనాలో పర్యటించారు. అప్పుడు ఎస్‌సీవో సదస్సులో పాల్గొన్నారు. 2019అక్టోబరులో జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించారు. మరుసటి ఏడాది గల్వాన్ ఘర్షణతో రెండు దేశాల మధ్య సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. అయితే, ట్రంప్ టారిఫ్ యుద్ధం మొదలు పెట్టిన తర్వాత, రెండు దేశాలు మళ్లీ వాణిజ్య చర్చలను ప్రారంభించాయి. కాగా, ఎస్‌సీవో సదస్సు ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు జరగనుంది.



గతేడాది కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో జిన్‌పింగ్, పుతిన్, మోదీ

ప్రధాని మోదీకి జెలెన్‌స్కీ ఫోన్

ప్రధాని మోదీకి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శనివారం ఫోన్ చేశారు. యుద్ధం ముగింపునకు రష్యా అధినాయకత్వంతో చర్చలకు తాను సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ట్రంప్‌తో ఇటీవల జరిగిన చర్చల వివరాలను తెలిపారు. అయితే తక్షణమే కాల్పుల విరమణ జరగాలని పేర్కొన్నారు. శాంతిని నెలకొల్పేందుకు చేసే అన్ని రకాల ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని మోదీ జెలెన్‌స్కీకి ఈ సందర్భంగా తెలిపారు.

హాయ్! నేను షియావో!

» ఎస్‌సీవో సదస్సులో అత్యాధునిక ఏఐ హ్యూమనాయిడ్ రోబో సేవలు



బీజింగ్, ఆగస్టు 30: చైనా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్‌సీఓ శిఖరాగ్ర సదస్సులో హ్యూమనాయిడ్ రోబోలు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా సర్వీస్‌డెస్క్, ప్రెస్ సెంటర్‌లో ఉన్న షియావో హీ అనే రోబో విలేకర్లకు సహాయకారిగా మసలుకుంటోంది. అచ్చం ఒక యువతిలా కనిపించే ఈ రోబో.. జర్నలిస్టులు ఎదురుపడగానే చిరునవ్వుతో పలకరించి, అభివాదం చేస్తుంది. సదస్సుకు స్వాగతం పలుకుతుంది. తెలివితేటలు, భావోద్వేగాలు కలిగి ఉండటం ఈ రోబో విశిష్టత. ఏఎన్ఐ అనే వార్తా సంస్థ షియావోను ఇంటర్వ్యూ కూడా చేయటం విశేషం. 'టియాన్‌జిన్ నగరంలో నిర్వహిస్తున్న ఎస్‌సీఓ సదస్సు కోసం అత్యాధునిక కృత్రిమమేధ పరిజ్ఞానంతో నన్ను తయారుచేశారు. అడిగిన వెంటనే సమాచారం ఇవ్వటం, చైనీస్, రష్యన్, ఇంగ్లిష్ భాషల్లో సేవలందించటం వంటి పనుల్ని నేను చేయగలను' అని షియావో తెలిపింది. తనలో భావోద్వేగాలను గుర్తించే అడ్వాన్స్ అల్గారిథమ్స్, అడాప్టివ్ లెర్నింగ్ మాడ్యూల్స్ ఉన్నాయని పేర్కొంది. అంతర్జాతీయ ప్రతినిధులు, విలేకర్లు, సదస్సు నిర్వాహకుల మధ్య నిరంతర సమన్వయానికి అవసరమైన సమగ్ర నాలెడ్జ్ డేటాబేస్‌లను తనలో నిక్షిప్తం చేశారని, వాటి సాయంతోనే తాను సేవలు అందించగలుగుతున్నానని వెల్లడించింది. ఎస్‌సీఓ సదస్సులో షియావో మాత్రమేగాక ఇతర రోబోలు కూడా సేవలందిస్తున్నాయి. సదస్సు ప్రతినిధులకు ఐస్‌క్రీం అందించటానికి కూడా ఓ రోబో ఉండటం విశేషం.

రుషికొండ ప్యాలెస్‌తో పర్యావరణం నాశనం



- 453 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం
- ఆ భవంతి ఎందుకు కట్టుకున్నారో చెప్పాలి: నాదెండ్ల

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రుషికొండపై పర్యావరణాన్ని నాశనం చేసి, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి విలాసవంతమైన భవంతిని ఎందుకు కట్టుకున్నారో జగన్ చెప్పాలని జనసేన పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ డిమాండ్ చేశారు. రూ.453 కోట్లతో రుషికొండపై ప్యాలస్ కట్టుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. విశాఖలోని ఇందిరా ప్రియదర్శిని మునిసిపల్ స్టేడియంలో శనివారం 'సేనతో సేనాని' సమావేశంలో తొలుత నాదెండ్ల మనోహర్ మాట్లాడారు. "రుషికొండ భవంతిని పరిశీలించేందుకు మేం వెళితే దానిపై దుష్ప్రచారం చేస్తున్నారు. పెచ్చులూడి, నీరు చేరిన విషయాన్ని గుర్తించి చూపిస్తే.. కావాలని చేసినట్లుగో ఓ పత్రికలో రాశారు. ఇంతకంటే దుర్మార్గం ఉంటుందా?. మీడియాలో చేస్తున్న ఈ తరహా దుష్ప్రచారాన్ని కార్యకర్తలు తిప్పికొట్టాలి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి ఎంతో నష్టం జరిగింది. ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో పోటీ చేయలేని స్థితిని ఆ పార్టీ నాయకులు తీసుకువచ్చారు. వైసీపీ పాలనను అందరూ గుర్తుపెట్టుకోవాలి. ప్రతి కుటుంబాన్ని ఎలా ఇబ్బంది పెట్టిందో గుర్తుంచుకోవాలి. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తోంది. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలు గురించి తెలుసుకుని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలి. జనసేన పార్టీ రిజిస్టర్ పార్టీ స్థాయి నుంచి రికగ్నైజ్ పార్టీ స్థాయికి చేరుకుంది. ప్రతి ఒక్కరికీ పదవులు రావాలని, నాయకత్వం అందించాలన్నదే పవన్‌కల్యాణ్ ఉద్దేశం" అని చెప్పారు. జనసేన సభలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఎంపీలు బాలశౌరి, టి.ఉదయ్ శ్రీనివాస్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డికి ప్రభుత్వం షాక్



- ఆయన భార్య స్వర్ణలత, బినామీల డీకేటీ భూముల రిజిస్ట్రేషన్ల రద్దు
- అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు
- అక్రమాలకు సహకరించిన అధికారులపైనా చర్యలు

రాయచోటి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డు పెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద షాక్ ఇచ్చింది. పెద్దిరెడ్డి భార్య స్వర్ణలత, బినామీల పేరు మీద జరిగిన డీకేటీ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ శనివారం ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిసింది. ఈ అక్రమాలకు సహకరించిన అధికారులపైనా క్రమశిక్షణ చర్యలకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం వలసపల్లెలో సర్వే నంబరు 558లో 48.68 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల్లో గయాలుగా నమోదైంది. ఈ భూమిని 1991లో 1 నుంచి 11 నంబర్ల వరకు సబ్ డివిజన్ చేశారు. ఇందులో 558/11లోని 4.90 ఎకరాల భూమిని అసైన్‌మెంట్ నంబరు 112/4/1395 ద్వారా సి.గురుమూర్తి అనే వ్యక్తికి ప్రభుత్వం కేటాయించింది. ఇతను 2020లో చనిపోయారు. ఇతనికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొడుకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ ఇతర రాష్ట్రంలో ఉన్నారు. దీంతో గురుమూర్తి సోదరుడు వెంకటరమణ, అతడి కొడుకు సాయిప్రసాద్ ఆ భూమికి తప్పుడు, నకిలీ పత్రాలు సృష్టించి.. రెవెన్యూ రికార్డుల్లో గురుమూర్తి వారసుల పేరుకు బదులుగా తన పేరు ఎక్కించుకున్నాడు. 1బీ రికార్డులు కూడా తీసుకున్నాడు. ఈ భూమికి 2024 జనవరి 3న ఫ్రీహోల్డ్ ప్రొసీడింగ్స్ పొందాడు. తర్వాత 2024 ఫిబ్రవరి 2న ఈ భూమిని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భార్య స్వర్ణలతకు (డాక్యుమెంటు నంబరు 1213/2024) అమ్మేశాడు. ఈ విషయమై గురుమూర్తి కొడుకు కుమార్ మదనపల్లె కోర్టులో దావా వేశారు. చట్టబద్ధ వారసులమైన తమకే భూమి దక్కాలని కోరారు. తన భూమిని అక్రమంగా కొన్నారని ప్రశ్నించిన గురుమూర్తి కొడుకు కుమార్‌ను పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డి బెదిరించాడంటూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మదనపల్లె సబ్‌కలెక్టర్ విచారణ జరిపి నివేదిక ఇవ్వడంతో ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌ను కలెక్టర్ రద్దు చేసి, ఈ భూమిపై ఎటువంటి రిజిస్ట్రేషన్లు జరక్కుండా చూడాలని జిల్లా రిజిస్ట్రార్‌కు శనివారం ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిసింది. భూమిని నిషేధిత జాబితాలో చేర్చమని మదనపల్లె తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇదే గ్రామంలోని సర్వే నంబరు 546/1లో 3.34 ఎకరాల భూమిని సైతం చట్ట విరుద్ధంగా అమ్మేశారు. ఈ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలంటూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు కలెక్టర్ లేఖ రాసినట్లు తెలిసింది. కాగా, వలసపల్లెలోని సర్వే నంబరు 546/1లో 3.34 ఎకరాల డీకేటీ భూమిని ఎస్ఎస్‌వీ మౌనీష్ కుమార్‌రెడ్డి పేరు మీద పీలేరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ పూతలపట్టు రాజు రిజిస్ట్రేషన్ (డాక్యుమెంటు నంబరు 620/2024) చేసేశారు. ఈ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. పూతలపట్టు రాజుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు.

ప్రతి చెరువూ నింపుతాం!



హంద్రీనీవా కాలువ వద్ద జలహారతి ఇస్తున్న సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

రెండేళ్లకు ముందే కృష్ణా పుష్కరాలు వచ్చినట్లుగా ఉంది. కృష్ణమ్మ పరవళ్లు చూసి నా మనసు పులకించి పోయింది. నా జీవితంలో ఇది పవిత్రమైన రోజు. రాష్ట్రంలో నదులన్నింటినీ అనుసంధానం చేసి కరువు లేకుండా చేయడమే నా జీవితాశయం' అని సీఎం తెలిపారు. 1999లో హంద్రీ-నీవాకు తానే శంకుస్థాపన చేశానని గుర్తుచేశారు. ఇప్పుడు 2025లో.. శ్రీశైలం మల్లన్న వద్ద నుంచి కుప్పంలోని కంగుంది మల్లన్న వరకు నీళ్లు వచ్చాయని ఆనందంతో చెప్పారు. కుప్పంలోని గంగమ్మ తల్లి.. కృష్ణమ్మ తల్లిని కుప్పానికి తీసుకొచ్చిందని.. పరమసముద్రంలో నీటిని చూసి తన మనసు ఉప్పొంగిపోయిందన్నారు. 'మల్యాలలో ప్రారంభమై.. 27 ఎత్తిపోతల ద్వారా.. పలు సొరంగాల గుండా.. 738 కిలోమీటర్లు ప్రయాణించి.. కుప్పంలోని పరమసముద్రం చెరువు వరకు కృష్ణా జలాలు తరలి వచ్చాయి. ఇది సాధారణ విషయం కాదు' అని స్పష్టంచేశారు. ఇది తన జీవితంలో మరచిపోలేనిదన్నారు. వైసీపీకి చేతనైతే అభివృద్ధిలో, సంక్షేమంలో పోటీ పడాలన్నారు. ఇంకా ఏమన్నారంటే..

> గోదావరి నుంచి 1,630 టీఎంసీలు, కృష్ణా నదిలో 600 టీఎంసీల నీళ్లు సముద్రంలోకి వృథాగా పోయాయి. అలా పోతున్న జలాలను రెండు తెలుగు రాష్ట్రాలూ సమర్థంగా ఉపయోగించుకోగలిగితే ప్రతి ఎకరాకు నీరు అందుతుంది.
>
> పోలవరం, బనకచర్ల ప్రాజెక్టులను పూర్తి చేసి.. వంశధార నుంచి పెన్నా వరకు నదుల అనుసంధానం చేయగలిగితే రాష్ట్రంలో కరువనేది ఉండదు. అదే నా జీవితాశయం.
>
> - సీఎం చంద్రబాబు

పంచెకట్టులో బాబు

చంద్రబాబు ఎప్పటిలా కాకుండా భిన్నంగా కనిపించారు, వ్యవహరించారు. శాంతిపురం మండలంలో ఇటీవలి స్వగృహ ప్రవేశంలో తప్ప ఆయన కుప్పం ప్రజలకు ఏ కార్యక్రమంలోనూ పంచెకట్టులో కనిపించలేదు. ఇప్పుడు జలహారతి సమయంలోనే గాక.. బహిరంగ సభలో కూడా పంచెకట్టు, చొక్కాతోనే పాల్గొన్నారు. తెలుగు సంప్రదాయంలో గంగమ్మను పూజించుకోవడమే కాక, సంప్రదాయ దుస్తులను పర్యటన ఆద్యంతం ధరించడం విశేషంగా ప్రజలు చెప్పుకొన్నారు. ఆయన ప్రసంగంలో జలాలు.. పొలాలు.. హలాలు.. అడుగడుగునా పలకరించాయి.

అందుకే కాటన్ దొర విగ్రహాలు..

మనల్ని పాలించడానికి వచ్చిన బ్రిటిష్ కాటన్ దొర గోదావరి వృథా జలాల సద్వినియోగానికి ధవళేశ్వరం, ప్రకాశం బ్యారేజీ కట్టాడు. దీంతో సంబంధిత డెల్టా జిల్లాల పరిస్థితి మారిపోయింది. అక్కడి ప్రజలకు నీటి విలువ తెలుసు. అందుకే కాటన్‌ను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటున్నారు. విగ్రహాలు పెడతారు.

మళ్లీ రతనాల సీమగా..

మన నాయకుడు ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కృష్ణాజలాలు వృథాగా సముద్రంలోకి వెళ్లకుండా రాయలసీమకు తీసుకురావాలని సంకల్పించారు. మా ఇంటి ఇలవేల్పు వేంకటేశ్వరస్వామి. ఏ పని కావాలన్నా ఆయన మీద భారం వేసి బుల్లెట్‌లా దూసుకెళ్తా. రాయలసీమను మళ్లీ రతనాల సీమగా మారుస్తానని ముందుగానే మాటిచ్చా. సీమ ప్రాజెక్టులకు 2014-19లో రూ.12,500 కోట్లు ఖర్చు పెట్టాం. వైసీపీ ప్రభుత్వం రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. ఈ ప్రాంతంలో హార్టికల్చర్‌కు ప్రాధాన్యమిచ్చి ప్రపంచానికే పండ్లను సరఫరా చేసేలా తయారుచేస్తాం.

అవి సినిమా సెట్టింగులు

ఎన్నికలకు ముందు సినిమాల్లో మాదిరిగా సెట్టింగులు వేసి బయటి నుంచి కుప్పానికి నీళ్లు తెచ్చి నాటకాలాడి జగన్ అభాసుపాలయ్యారు. మేమలా కాదు. ప్రతి చెరువుకూ నీళ్లిచ్చే బాధ్యత నాదీ. 2019లో మిగిలిపోయిన 20 శాతం పనులను వైసీపీ పూర్తి చేయలేదు. ఇప్పుడు రూ.3,850 కోట్లిచ్చి పనులు చేయించి కుప్పం దాకా నీళ్లు తెచ్చా. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో 110 చెరువులకు నీరిస్తున్నాం. హంద్రీ-నీవా రెండు దశల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు, పరిశ్రమలకు నీళ్లు అందుతాయి. ఫేజ్-1లో 2 లక్షల ఎకరాలకు, ఫేజ్ 2 కింద 4 లక్షల ఎకరాలకు నీరు అందుతుంది. కర్నూలులో కృష్ణగిరి, పత్తికొండ, అనంతపురంలో జీడిపల్లి రిజర్వాయర్లు నింపాం. పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 4 టీఎంసీలు తరలించాం. శ్రీ సత్యసాయి జిల్లాలో మారాల, గొల్లపల్లె, చెర్లోపల్లె, అన్నమయ్య జిల్లాలో శ్రీనివాసపురం, అడవిపల్లె రిజర్వాయర్లకు వచ్చే ఏడాది నీరిస్తాం. అప్పుడే చిత్తూరుకు కూడా నీళ్లిచ్చే బాధ్యత తీసుకుంటాం. కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు లైనింగ్ పూర్తి చేశాం. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీళ్లు ఇవ్వగలిగితే నా జన్మ ధన్యమవుతుంది. దీనికోసం నదులు అనుసంధానం చేయాలి. 45 ఏళ్ల రాజకీయ జీవితంలో పరిగెత్తే నీటిని నడిపించడానికి, నడిచే నీటిని నిలబెట్టడానికి, నిలబెట్టిన నీటిని భూమిలో ఇంకించేందుకు అనేక ప్రయత్నాలు చేశా.

2027లో పోలవరం జాతికి అంకితం..

2027కి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తా. ఎప్పుడో పూర్తి కావలసిన ప్రాజెక్టు. 2019లో టీడీపీ గెలిచి ఉంటే 2020లో పూర్తయ్యేది. ఏడేళ్లు ఆలస్యమైంది. రాజకీయ కక్షతో డయాఫ్రం వాల్‌ను రక్షించకపోవడంతో అది కొట్టుకుపోయింది. మళ్లీ రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రశాంతమైన కుప్పంలో వైసీపీ నేతలు రప్పారప్పా రాజకీయం చేయాలని చూశారు. దీనికి బదులుగా మేం పులివెందులకు నీళ్లిచ్చాం. రాజకీయమంటే అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు సేవ చేయడం తప్ప రప్పారప్పా రాజకీయం కాదు.

అభినవ రాయలు చంద్రబాబు: నిమ్మల

శాంతిపురం/గుడుపల్లె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 'ఆనాడు శ్రీకృష్ణ దేవరాయలు రాయలసీమను రతనాల సీమగా చేస్తే.. ఈనాటి అభినవ రాయలైన ముఖ్యమంత్రి చంద్రబాబు కృష్ణమ్మ జలాలను కరువు రాయలసీమకు తీసకొచ్చి పాడిపంటల సీమగా మార్చారు' అని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. కుప్పం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. హంద్రీ-నీవా కాలువను ఆసియాలోనే అతిపెద్ద కాలువగా అభివర్ణించారు. ఎంతో కష్టమైన కార్యాన్ని కష్టనష్టాలకోర్చి పూర్తిచేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. రాయలసీమకు తీరని ద్రోహం చేసిన పాలకుడిగా జగన్ మిగిలిపోయారని విమర్శించారు.

ఆరు కంపెనీలతో ఎంవోయూలు

ముఖ్యమంత్రి కుప్పం పట్టణాభివృద్ధి సంస్థ తరఫున ఆరు కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు ఏజీఎస్ ఐటీసీ.. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు షీలీడ్స్. ఫైబర్ బోర్డు ఉత్పత్తి కోసం కింగ్స్ ఉడ్ డెకార్ ప్రైవేట్ లిమిటెడ్, 2 సీటర్ ట్రైనింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ యూనిట్ ఏర్పాటు చేసే పయనీర్ క్లీన్ యాంప్స్ లిమిటెడ్.. స్పేస్ టెక్నాలజీ సంస్థ ఎతెరియల్ ఎక్స్‌ప్లొరేషన్ గిల్డ్.. అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ హబ్ ఏర్పాటుకు రెడ్ బెర్రీ ఫుడ్ లాజిక్స్ కంపెనీలతో ఒప్పందాలు కుదిరాయి.



పరమసముద్రం కాలువ వద్దకు తరలి వచ్చిన జనం





విశాఖలోని ఇందిరా ప్రియదర్శిని మునిసిపల్ స్టేడియంలో శనివారం సాయంత్రం జనసేన పార్టీ నిర్వహించిన 'సేనతో సేనాని' సభకు హాజరైన క్రియాశీలక కార్యకర్తలు.. పార్టీ పతాకం, భరతమాత చిత్రంతో కూడిన పతాకంతో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

జన సైనికుల కోసం

'త్రిశూల్'

> కుల పోరాటాలు, మత విద్వేషాలు, ప్రాంతీయ విభేదాలు ఎప్పుడూ ఉంటాయి. నిత్యం వాటి కోసం పనిచేస్తే.. ప్రజలకు కూడు, గూడు, ఉపాధి ఎవరు ఇస్తారు?
>
> - డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఇవన్నీ మనమే చేశాం

అధికారంలోకి వచ్చాక ఏంచేశారని చాలామంది ప్రశ్నిస్తున్నారు.. చాలానే చేశాం. విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ఆపాం. రెండు విడతలుగా రూ.8,625 కోట్లు, రూ.3,295 కోట్లు ఆర్థిక సాయం ఇప్పించాం. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,157 కోట్లు, రెండోసారి 5,936 కోట్లు మంజూరు చేయించాం. తల్లికి వందనంలో 67.27 లక్షల మంది తల్లులకు ఆర్థిక సాయం చేశాం. దీపం-2 పథకం కింద కోటి గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇప్పించాం. మూడుసార్లు ఉచిత గ్యాస్‌కు రూ.13,425 కోట్లు కేటాయించాం. స్త్రీశక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. దీనికి రూ.2 వేల కోట్లు కేటాయించాం. పంచాయతీల్లో 4 వేల కి.మీ.ల సీసీ రోడ్లు వేయించాం. జల జీవన్ మిషన్ కింద రూ.1.2 కోట్ల మందికి రూ.7,910 కోట్లతో తాగునీరు అందించే ఏర్పాట్లు చేశాం.

(మొదటి పేజీ తరువాయి)

'గుర్తింపు-నాయకత్వం-భద్రత'గా పేర్కొన్నారు. 'పదేళ్ల సమయం నాకు ఇవ్వండి.. దేశ పునర్నిర్మాణం చేసే నాయకులుగా మారుస్తా.. దేనినైనా తట్టుకుని నిలబడగలమని నమ్మకం ఉంటే ముందుకురండి.. మీ విజయం వెనుక నేనుంటా'.. అని జనసైనికులకు భరోసా ఇచ్చారు. విశాఖపట్నంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం సాయంత్రం 'సేనతో సేనాని' పేరిట క్రియాశీల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనికి 15 వేల మందిని ఆహ్వానించారు. ఒడిసా, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి కూడా అభిమానులు తరలివచ్చారు. వారినుద్దేశించి గంటసేపు ఆయన ప్రసంగించారు. జనసేన ఆవిర్భావం నుంచి కూటమి ప్రభుత్వ భాగస్వామిగా ఎదగడం వరకు పుష్కర కాలంలో ఎదుర్కొన్న ఆటుపోట్లను వివరించారు. భవిష్యత్‌లో పార్టీ ఎలా ఉంటుందో విశదీకరించారు. అన్నీ తట్టుకుని నిలబడినందునే ఇప్పుడు భారతదేశంలో 100 శాతం స్ట్రయిక్ రేట్ సాధించిన పార్టీగా గుర్తింపు వచ్చిందని చెప్పారు. 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్' పేరుతో చేపట్టే 'త్రిశూల్' కార్యక్రమంలో కార్యకర్తలకు గుర్తింపు కార్డులు ఇచ్చి.. సెంట్రల్ ఆఫీసు నుంచి, పార్టీ నాయకులతో, పనిచేసే వ్యవస్థతో అనుసంధానం చేస్తామని చెప్పారు. దీనికి బాధ్యులుగా పనిచేసే వారినే తీసుకుంటామని, గాలికి తిరిగే వారు అర్హులు కాదని స్పష్టంచేశారు. మానసిక స్థైర్యం ఉంటే జనసేన జాతీయ పార్టీగా మారుతుందని వ్యాఖ్యానించారు. కులం కోసం తాను రాలేదని, మానవాళి సంక్షేమం కోసం వచ్చానన్నారు. అన్ని మతాలను గౌరవిస్తానని చెప్పారు. డిప్యూటీ సీఎం ఇంకా ఏమన్నారంటే..

ఆంధ్రాలో పోరాట పటిమ ఉంది

ఆంధ్రప్రదేశ్‌లో పోరాట పటిమ లేదని చాలామంది వ్యాఖ్యానిస్తున్నారు. కానీ ఇక్కడ ఆ పటిమ ఉంది. అందుకే కూటమికి 164 సీట్లు, జనసేనకు అందులో 21 ఇచ్చారు. నాయకత్వం పదవి కాదు.. బాధ్యత. ప్రజాసమస్యల పట్ల అంకిత భావంతో పనిచేసే వారు నిలబడతారు. పార్టీలో సభ్యుడిగా చేరితే క్రియాశీల కార్యకర్తగా.. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయి నాయకులుగా జనసేన నడిపిస్తుంది. దీనికోసం శిక్షణ, వర్క్‌షాపులు వంటివి నిర్వహిస్తాం. త్వరలో కర్షక, కార్మిక విభాగాలు కూడా ప్రారంభిస్తాం. పోరాడి నిలబడడానికి నాకు పుష్కర కాలం పట్టింది. మీరు కూడా మీ ప్రాంతాల్లో గట్టిగా నిలబడితే పోరాటానికి అవసరమైన వనరులను నేనందిస్తా. ఇకపై పార్టీని మండల స్థాయి నుంచి నేనే పర్యవేక్షిస్తా. రోజుకు నాలుగు గంటలు పార్టీకి కేటాయిస్తా. పార్టీ సంస్థాగత నిర్మాణం ఎలా ఉండాలనే దానిపై ఇప్పటికే ప్రణాళిక రూపొందించాం.

కూటమి బలంగా ఉండాలి.. లేదంటే రాష్ట్రానికే నష్టం

కూటమి బలంగా ఉండాలి. తెలుగుదేశం పార్టీతో ఏమైనా చిన్నచిన్న ఇబ్బందులు ఉంటే నాకు చెప్పండి. వాటిని సరిచేస్తాం. కోపతాపాలకు పోయి కూటమి విడిపోయేలా చేయొద్దు. అలా చేస్తే ప్రజలకు, రాష్ట్రానికి నష్టం జరుగుతుంది. మళ్లీ అరాచక పాలకులు వస్తారు.

కన్‌ఫ్యూజన్‌లో ఉన్నానన్నారు..

2019-24 మధ్య ఐదేళ్లు అన్ని విధాలుగా నాటి అధికార పార్టీ నలిపేసింది. కులాలను కలిపే ఆలోచన చేశా.. పర్యావరణం గురించి మాట్లాడా.. అవినీతి రహిత సమాజం కావాలన్నా.. రోజుకొక మాట చెబుతాడు. కన్‌ఫ్యూజన్‌లో ఉన్నాడని చాలామంది అన్నారు. కానీ కార్యకర్తలైన మీరంతా నమ్మారు.. మీరు నాలో భవిష్యత్ చూశారు. ఆ ఫలితమే 21 మంది జనసేన నుంచి గెలుపొందారు. జనసేన 150 మందితో మొదలై నేడు 15 వేల మంది క్రియాశీల కార్యకర్తలు, 12 లక్షల మంది సభ్యత్వం కలిగిన పార్టీగా ఎదిగింది. ఉద్దానంలో కిడ్నీ సమస్యకు పరిష్కారం చూపించింది. గిరిజన గ్రామాలకు డోలీ మోతలు తప్పించి రహదారులు వేయగలిగింది. 2019లో పార్టీ ఓడిపోగానే చాలామంది పారిపోయారు. నత్తగుల్లలు వెళ్లిపోయాయి. రత్నాలు మిగిలాయని భావించా. నిస్వార్థంగా పనిచేయడం వల్లే ఫలితాలు వచ్చాయి. అధికారంలో భాగస్వాములు కాగలిగాం.

మీరంతా అన్‌సంగ్ హీరోస్..

పార్టీ కోసం అనేక కష్టనష్టాలు ఓర్చి పనిచేస్తున్న జన సైనికులు, వీర మహిళలు 'అన్‌సంగ్ హీరోస్'. కష్టమైనా వెరవకుండా అండగా నిలబడ్డారు ఇక నుంచి ప్రతి ఒక్కరూ వేదికపై నుంచి మాట్లాడి తమ అభిప్రాయాలు చెప్పాలి. గడచిన పదేళ్లలో తగిలిన ప్రతి దెబ్బతో రాటుదేలుతూ ఒక్కొక్క అడుగూ వేసుకుంటూ ముందుకెళ్తా.. మరింత ధైర్యంతో పనిచేస్తున్నాను. ఈ ప్రయాణంలో ఏ పదవి, హోదా ఆశించకుండా పనిచేసే వీరమహిళలు, జన సైనికులు నిజంగా అన్‌సంగ్ హీరోస్. మీరంతా నిజమైన యుద్ధవీరులే. సినిమాల్లో హీరోనే అయినా 'లోపల రగిలే అగ్నిగుండం' ఉంది. అది బయటవారికి తెలియదు. జనవాణి కోసం నేను విశాఖ వస్తే నోవాటెల్ హోటల్‌లో బంధించారు. భీమిలి జనసేన నాయకులపై హత్యాయత్నం కేసులు పెట్టారు. అయినా ఏ రోజూ భయపడలేదు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా తెలుసు. అయినా ఒక్క ఫోన్ కాల్ కూడా చేయలేదు. ఇది నా నేల.. నేనే తేల్చుకుంటానని పోరాడా. జనసేన వీర మహిళలు వీధిలో పేరంటాలకు వెళ్లాలి.. ఊళ్లో పోరాటాలు కూడా చేయాలి. మహిళలకు 33% రిజర్వేషన్ తప్పనిసరిగా అమలు చేస్తాం. అయితే అవి భర్తల అజమాయిషీలో పనిచేసేవారికి కాదు. స్వతంత్రంగా పనిచేసేవారికే ఇస్తాం.

గురజాడ ఇల్లు నిలబెడతాం

విజయనగరంలో గురజాడ అప్పారావు ఇల్లు పాడైందని, దానిని కాపాడాలని ఆయన మనవళ్లు పోస్టుకార్డు ఉద్యమం చేశారు. ఆయన ఇంటిని ఆధునికీకరించి, రచనలన్నీ డిజిటలైజేషన్ చేయిస్తామని హామీ ఇస్తున్నా.

ఖరీఫ్‌ను ఆదుకున్న ఆగస్టు

విశాఖపట్నం, అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నైరుతి సీజన్‌లో జూన్, జూలై నెలల్లో తీవ్ర దుర్భిక్షం నెలకొన్నా.. ఆగస్టు నెల ఆదుకుంది. ఆగస్టులో కోస్తా, రాయలసీమల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. జూన్ ఒకటో తేదీ నుంచి జూలై నెలాఖరు వరకు 416.5 మి.మీ.కు గాను 255.7 మి.మీ. వర్షపాతం (సాధారణం కంటే 25.1 శాతం తక్కువ) నమోదయ్యింది.. సగానికి పైగా మండలాల్లో మెట్ట పంటలు ఎండిపోయాయి. విత్తనాలు, నాట్లు వేసేందుకు అవకాశం లేకుండా పోయింది. అయితే ఆగస్టులో 160.8 మి.మీ.కుగాను 204.5మి.మీ. వర్షపాతం నమోదుకావడంతో వర్షపాతం లోటు 25.1 నుంచి 4.9 శాతానికి తగ్గింది. అల్పపీడనాల ప్రభావంతో వర్షాలు కురవడంతో ఖరీఫ్ పంటలకు ప్రాణం పోసినట్టయింది. అయితే, విస్తారంగా వర్షాలు కురిసినా 26 జిల్లాలకు గాను ఇంకా పశ్చిమ గోదావరి, అంబేడ్కర్ కోనసీమ, కడప, నెల్లూరు జిల్లాలు లోటు వర్షపాతంలో ఉన్నాయి. మొత్తం 670 మండలాలకుగాను 154 మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. నెల్లూరు జిల్లాలో 23, కోనసీమలో 14, పశ్చిమ గోదావరిలో 13, కడపలో 20 మండలాల్లో వర్షాభావం కొనసాగుతోంది. అయితే విచిత్రంగా ఈ ఏడాది రాష్ట్రంలోని పలు ప్రాంతాలు, ఉత్తరకోస్తాలో అనుకున్నమేర వర్షాలు కురవలేదని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. రుతుపవనాల్లో మార్పుల ప్రభావంతో ఒక చోట భారీవర్షాలు, మరోచోట తక్కువ వర్షాలు కురుస్తున్నాయన్నారు. మూడు నెలల కాలంలో సగటున 46 రోజులు వర్షాలు కురిశాయి. మెట్ట ప్రాంతాల్లో ఆలస్యంగానైనా వర్షాలు కురిశాయి. కానీ పల్లపు ప్రాంతాలు, వాగులు, కాలువల సమీప పొలాలు ముంపు బారిన పడ్డాయి. మిగతా చోట్ల ఖరీఫ్ పంటలు బాగానే పడ్డాయి. ఈ సీజన్‌లో 77.90 లక్షల ఎకరాల్లో 21 రకాల వ్యవసాయ పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేయగా.. ఇప్పటివరకు 55.30లక్షల ఎకరాల్లో పంటలు సాగులోకి వచ్చాయి.

ఖరీఫ్ ప్రధాన పంటల వివరాలు (లక్షల ఎకరాల్లో)

పంట	సాధారణ విస్తీర్ణం	వాస్తవ సాగు
వరి	37.17	29.97
చిరుధాన్యాలు	4.97	4.62
అపరాలు	7.67	5.47
నూనె గింజలు	13.87	5.20
పత్తి	13.20	9.67

రెండురోజుల్లో అల్పపీడనం!

సోమవారం రాత్రి లేదా మంగళవారం ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ తెలిపింది. ఇది నాలుగో తేదీన ఒడిశా తీరం దాటి మధ్య భారతం వైపు పయనిస్తుందని అంచనా వేసింది. అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలు ముఖ్యంగా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అల్లూరి జిల్లాల్లో మంగళవారం నుంచి వర్షాలు పెరుగుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. సెప్టెంబరు రెండో వారం చివరిలో మరో అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా వేస్తున్నారు.

'ప్రమాదకర' స్థాయిలో వరద గోదారి



- భద్రాచలం, ధవళేశ్వరంలలో మొదటి హెచ్చరిక జారీ
- వేలేరుపాడులో జలదిగ్బంధంలో 23 గ్రామాలు
- భయం గుప్పెట్లో కోనసీమ లంక గ్రామాలు

రాజమహేంద్రవరం/ధవళేశ్వరం/పోలవరం/వేలేరుపాడు/కుక్కునూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఇటీవల బాగా పెరిగి.. శాంతించిన గోదావరికి మళ్లీ వరద పోటెత్తుతోంది. భద్రాచలం వద్ద ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. శనివారం రాత్రి 7 గంటలకు అక్కడ నీటిమట్టం 47.7 అడుగులకు చేరింది. ఇది 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రాత్రి 8:35 గంటలకు నీటి మట్టం 11.75 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 10 గంటలకు నీటిమట్టం 11.90 అడుగులకు చేరిందని ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ హెడ్ వర్క్సు ఈఈ శ్రీనివాస్ తెలిపారు. బ్యారేజీ నుంచి రాత్రి 10 గంటల సమయానికి 10,06,819 క్యూసెక్కుల వరద సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరిలో నీరు అంతకంతకూ పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టు నుంచి 9,69,595 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. విలీన మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో గోదావరి వరద నిలకడగా ఉంది. లోతట్టు ప్రాంతాలు నీటిలోనే ఉన్నాయి. వేలేరుపాడు మండలంలో 23 గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. కుక్కునూరు మండలం దాచారం గుండేటి వాగు లోలెవల్ బ్రిడ్జి నీట మునిగి ఉండడంతో ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరిలో వరద ప్రవాహం పెరుగుతు ఉండటంతో కోనసీమలోని లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

612 టీఎంసీలు కడలిపాలు!

అమరావతి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వందలాది టీఎంసీల కృష్ణా జలాలు కడలి పాలయ్యాయి. జల వనరుల శాఖ లెక్కల ప్రకారం శనివారానికి 612.05 టీఎంసీల కృష్ణా జలాలు సముద్రంలో కలసిపోయాయి. శ్రీశైలం జలాశయంలో 215.81 టీఎంసీలకుగాను 198.36 టీఎంసీలు, పులిచింతలలో 45.77 టీఎంసీలకుగాను 39.22 టీఎంసీల నిల్వ ఉంది.

అనంతలో బైక్.. కార్ రేస్





పుట్లూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పుట్లూరు మండలం మడుగుపల్లి గ్రామ శివారులో బైకు, కార్ రేస్ పోటీలు జరుగుతున్నాయి. 'దక్షణి డేర్ క్రాస్ కంట్రీ ర్యాలీ అండ్ బైక్ రేస్' పేరిట ఈ పోటీలను 3 రోజుల పాటు నిర్వహిస్తున్నారు. పుట్లూరు మండలం నుంచి నార్పల మండలం వరకూ ఉన్న కొండ ప్రాంతాల్లో జరుగుతున్న బైక్, కార్ రేస్‌లో ఏపీ, తెలంగాణ, గోవా, తమిళనాడు, కేరళల రేసర్లు పాల్గొన్నారు.

మొక్కవోని నృత్య 'దీక్ష'!

ఏకధాటిగా 9 రోజులు.. 216 గంటలపాటు.. నిర్విరామంగా భరత నాట్యం



విదుషీ దీక్షను సత్కరిస్తున్న కర్ణాటక డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): భరత నాట్యం అంటే కేవలం నృత్యమే కాదు.. అకుంఠిత 'దీక్ష', భక్తి, తపస్సు కలయిక!.. ఆమెలోని మొక్కవోని దీక్షే 170 గంటల పాత రికార్డును అధిగమించి, కొత్త రికార్డు సృష్టించింది. ఉడుపి జిల్లా బ్రహ్మావర తాలూకా ఆరూరు గ్రామానికి చెందిన 23 ఏళ్ల వి. విదుషీ దీక్ష నిర్విరామంగా 216 గంటలపాటు భరత నాట్యం చేసి గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. రత్నసంజీవ కళా మండలం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉడుపిలోని డాక్టర్ జి.శంకర మహిళా ప్రభుత్వ కళాశాల ప్రాంగణం వేదికైంది. ఈ నెల 21వ తేదీన భరతనాట్యం ప్రారంభించిన దీక్ష.. శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు 216 గంటల ప్రదర్శన పూర్తి చేశారు. గతంలో మంగళూరుకు చెందిన రెమోనో ఇవెట్ పిరేరా పేరిట ఉన్న 170 గంటల రికార్డును అధిగమించారు. తొమ్మిది రోజుల పాటు నిరంతర భరతనాట్యం చేయడం ద్వారా సరికొత్త రికార్డును నెలకొల్పారు. తొలిరోజు ప్రేక్షకులు కొంతమందే ఉన్నా.. ఆ తరువాత ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పెరుగుతూ వచ్చారు. చివరి రోజు భారీ సంఖ్యలో హాజరై.. ఆమెపై పూలు చల్లి హర్షధ్వానాలు చేశారు. నిర్విరామ భరతనాట్యం అంటే ప్రతి గంటకూ 15 నిమిషాల విరామం ఉంటుంది. ఎనిమిది గంటల ప్రదర్శన అనంతరం దుస్తులు మార్చుకునేందుకు, ఆహార పానీయాలు తీసుకునేందుకు ఒక గంటపాటు పూర్తి విరామం ఉంటుంది. ఈ ప్రదర్శనకు మణిపాల్‌కు చెందిన రత్న సంజీవ కళాకారులు వాయిద్య సహకారం అందించారు. ప్రదర్శన చివరి రోజు శనివారం కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై సత్కరించారు. కార్యక్రమంలో దీక్ష నృత్యగురువు విద్వాన్ శ్రీధర్‌రావ్, తండ్రి విఠల్ పూజారి, తల్లి శుభ, భర్త రాహుల్, మాజీ ఎమ్మెల్యే రఘుపతిభట్, పారిశ్రామికవేత్తలు శంకర్, మహేష్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

ఆ గాయకుడి రికార్డే స్ఫూర్తి: విదుషీ దీక్ష

విదుషీ దీక్ష వయసు 23 ఏళ్లు. ఆమె బీఎస్సీ పూర్తి చేసి, బీఈడీ కోర్సు చేస్తున్నారు. దీక్ష బాల్యం నుంచే భరతనాట్యం, యక్షగానం, వీణ, మద్దెల వాయించడం నేర్చుకున్నారు. గాయనిగా కూడా గుర్తింపు పొందారు. 'ఈ ఏడాది జూన్‌లో మంగళూరులో గాయకుడు యశ్వంత్ ఎంజీ ఓ రికార్డు సృష్టించారు. ప్రముఖ నేపథ్య గాయకుడు బాలసుబ్రమణ్యం పాడిన 270 పాటలను 24 గంటలలో ఆలపించారు. అదే స్ఫూర్తితో భరతనాట్యంలో రికార్డు సృష్టించాలని భావించాను.' అని దీక్ష అన్నారు.



విదుషీ దీక్ష భరతనాట్య ప్రదర్శన

ముగిసిన కి'లేడీ' విచారణ

- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే హత్యకు కుట్ర సహా శ్రీకాంత్ పెరోల్‌పై ప్రశ్నించిన ఎస్పీ!
- 3 రోజుల్లో 90 ప్రశ్నలు సంధించిన అధికారులు
- ఎక్కువ వాటికి తెలియదని సమాధానం



నెల్లూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన నెల్లూరు జిల్లాకు చెందిన కి'లేడీ' నిడిగుంట అరుణ విచారణ ముగిసింది. మూడవ రోజు శనివారం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆమెను పలు కోణాల్లో ప్రశ్నించారు. ప్రధానంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని చంపితే డబ్బే డబ్బు అని రౌడీషీటర్లు మాట్లాడుకున్న వీడియో వైరల్ కావడంతో ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఈ వీడియోలో ఉన్న రౌడీషీటర్లకు జీవిత ఖైదీగా ఉన్న శ్రీకాంత్, అరుణలతో సంబంధాలు ఉండటంతో పోలీసులు ఆదిశగా విచారణ చేశారు. శ్రీకాంత్ పెరోల్‌పై విడుదలైంది ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని చంపడానికేనన్న ప్రచారం తెరమీదికిరావడంతో దీనిలో నిజానిజాలు తెలుసుకోవడానికి ఎస్పీ కృష్ణకాంత్ నేరుగా రంగంలోకి దిగారని తెలిసింది. ఈ క్రమంలో ఎస్పీ శనివారం సాయంత్రం కోవూరు స్టేషన్‌కు వెళ్లి అరుణను గంటకు పైగా విచారించారు. విశ్వసనీయ సమాచారాన్ని బట్టి.. ఎమ్మెల్యే హత్యకు నిజంగా ఏదైనా కుట్ర జరుగుతోందా..? అనే కోణంలో ఎస్పీ విచారించినట్టు తెలిసింది. అదేవిధంగా శ్రీకాంత్ పెరోల్ విషయంపైనా ఆమెను ప్రశ్నించినట్టు సమాచారం. అయితే.. కోటంరెడ్డిని చంపాల్సిన అవసరం తమకు లేదని, పెళ్లి చేసుకునేందుకే పెరోల్ కోసం ప్రయత్నించామని అరుణ సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. మొత్తంగా మూడు రోజుల పాటు సాగిన ఈ విచారణలో పోలీసులు మొత్తం 90 ప్రశ్నలు అడిగారు. "మీ నేరసామ్రాజ్యం విస్తరణకు ఎవరు సహకరించారు?." అనే అంశంపై సమాధానం రాబట్టడానికి పోలీసులు ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ ప్రశ్నకు సంబంధించి శనివారం కూడా అరుణ పలువురి పేర్లను ప్రస్తావించినట్లు తెలిసింది. వీటిలో రాజకీయ నాయకులతో పాటు పోలీసు అధికారుల పేర్లు కూడా ఉన్నట్లు సమాచారం. అయితే, ఎక్కువ ప్రశ్నలకు ఆమె తెలియదని, మరిచిపోయానని తప్పించుకునే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. మరోవైపు, మూడు రోజుల విచారణ ముగియడంతో శనివారం సాయంత్రం అరుణను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఆదివారం ఉదయం ఆమెను ఒంగోలు జైలుకు తరలిస్తారు. శనివారం జరిగిన విచారణలో ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీ శ్రీనివాసులు, ఒంగోలు డీఎస్పీలు అరుణ నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

సంచార జాతుల అభివృద్ధే బీజేపీ లక్ష్యం

ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ వెల్లడి.. గత వైసీపీ పాలనలో ఆ జాతులపై నిర్లక్ష్యం: మాధవ్



సంచార జాతుల విముక్తి దినోత్సవంలో కొమ్ము తలపాగాలతో బీజేపీ నేతలు కె.లక్ష్మణ్, మాధవ్

- నేటికీ వెనుకబడిన సంచార జాతులు: ఆర్ కృష్ణయ్య
- ఘనంగా విముక్తి దినోత్సవం



విజయవాడలో సంచార జాతుల విముక్తి దినోత్సవానికి హాజరైన జనం

విజయవాడ సిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సంచార జాతులకు లబ్ధి చేకూర్చి, వారికి అభివృద్ధి ఫలాలను అందజేయడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ స్పష్టం చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు సంచార, అర్ధ సంచార జాతుల సంక్షేమాన్ని విస్మరించాయని ఆరోపించారు. ఆ కారణంగా నేటికీ సమాజంలో వారు వెనుకబడి ఉన్నారన్నారు. విజయవాడలో శనివారం సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి లక్ష్మణ్ మాట్లాడుతూ గరీబీ హటావో అని నినాదాలు చేసే కాంగ్రెస్ నాయకులు గతంలో సంచార జాతులకు ఏమీ చేయలేదన్నారు. కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో దేశంలో చీలికలు తీసుకొచ్చేందుకు రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలోనే సంచార జాతులపై దేశ వ్యాప్తంగా అధ్యయనం జరిగిందన్నారు. సంచార జాతులను ఆదుకున్న మొట్టమొదటి ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వమే అన్నారు. విద్య, ఉద్యోగాల్లో సంచార, అర్ధ సంచార జాతులకు మోదీ ప్రభుత్వం అవకాశం కల్పించిందని చెప్పారు. 5 లక్షల సంచార జాతులకు ఆయుష్మాన్ భారత్ కార్డులను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రకరకాల పేర్లతో వీరిని పిలుస్తున్నామని, ఈ పేర్లను మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. వీరి సంక్షేమం కోసం ఈ నెల 31న అద్భుతమైన రాయితీలను కేంద్రం ప్రకటించబోతోందని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని సంచార జాతుల సంక్షేమ, అభివృద్ధిని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. వారికి కేంద్రం కేటాయించిన నిధులను వైసీపీ నాయకులు పక్కదారి పట్టించారని ఆరోపించారు. త్వరలో వీరికి గుర్తింపు(ఎన్‌టీ, డీఎన్‌టీ) సర్టిఫికెట్‌ల ను ఇస్తామని తెలిపారు. కలెక్టర్ల వద్దకు తీసుకెళ్లి తామే స్వయంగా సర్టిఫికెట్‌లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దేవాలయాల్లో ప్రదర్శనలు చేసేలా, తిరుమల బ్రహ్మోత్సవాల్లో వీరి నృత్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీ పాకా సత్యనారాయణ మాట్లాడుతూ..1939 జనాభా లెక్కల్లో వీరు లేకపోవడంతో నేటికీ అట్టడుగున ఉండిపోయారన్నారు. రాష్ట్రంలోని సంచార, అర్ధ సంచార జాతుల సమస్యల ను కేంద్రానికి చేర్చడమే బీజేపీ రాష్ట్ర నాయకుల లక్ష్యమన్నారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల్లో ఎంతో మంది సంచార జాతులు ఉన్నారని, వారంతా నేటికీ ఆర్థికంగా సామాజికంగా ఎంతో వెనుకబడి ఉన్నారని తెలిపారు. దేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతున్న వీరికి ప్రజలందరూ రుణపడి ఉండాలన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగా వీరు ఇంకా వెనుకబడిపోయారని, ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోనే వీరికి అన్ని రకాలుగా న్యాయం జరుగుతుందని తెలిపారు. తొలుత సంచార జాతుల విన్యాసాల నడుమ బీజేపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

తొలుత గంగిరెద్దుల, దొమ్మర్ల, పంబల విన్యాసాలు నడుమ బీజేపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. బాలసంతు, బండార, బుడబుక్కల, దాసరి, దొమ్మర, గంగిరెద్దుల, జంగం, జోగి, కాటికాపరి, కొర్చ, మొండివారు, పిచ్చిగుంట్ల, పాముల, పార్ధి, పంబల, దమ్మాలి, వీరముష్టి, గూడల, కంజార, కాప్మారే, మొండిపట్ట, నొక్కార్, పరికి, మగ్గుల, యాట, చోపేమారి, కైకాడి, జోషినందివాలా, మందుల, కునపులి, పత్రా, రాజనాల, కాసికపాడి జాతులవారు చేసిన ప్రదర్శలు, పాటలు ఆకట్టుకున్నాయి. పలు రకాల డప్పు వాయిద్యాలు, సన్నాయిలు, ఇతర సంగీత సాధనాలతో తరతరాల వారసత్వంగా వస్తున్న కట్టుబాట్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు రామకృష్ణారెడ్డి, విష్ణుకుమార్‌రాజు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోస్తూనే.. పోతున్న ఊపిరి!

విధుల్లో తీవ్ర ఒత్తిడితో కుప్పకూలిపోతున్న వైద్యులు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలు పోసే వైద్యులు వారు.. రాత్రిపగలు తేడా లేకుండా.. నిద్రాహారాలనూ సరిగా పట్టించుకోకుండా.. రోగుల బాగోగులు చూసే ప్రాణదాతలు వారు.. కానీ అలా ప్రాణం పోస్తూనే ఊపిరి వదులుతున్నారు. తీవ్ర ఒత్తిళ్ల మధ్య అకస్మాత్తుగా కుప్పకూలిపోతున్నారు. గుండెపోటు వంటివాటితో ప్రాణాలు వదులుతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి చెందిన సీనియర్ వైద్యుడు.. డ్యూటీ చేసి వెళ్లాక ఇంట్లో భోజనం చేస్తూనే కుప్పకూలిపోయారు. అంతకు రెండుమూడు రోజుల ముందే ఆయన ఆరోగ్య పరీక్షలు చేయించుకోగా అంతా సాధారణంగానే ఉన్నట్టు తేలింది. కానీ తీవ్ర ఒత్తిడితో గుండెపోటుతో కన్నుమూశారు. తాజాగా తమిళనాడులోని చెన్నైలో కార్డియాక్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ గ్రాడ్లిన్ రాయ్.. ఆస్పత్రి వార్డులో రోగులను పరిశీలిస్తూనే గుండె పోటుతో ప్రాణాలు వదిలారు. మన దేశంలో ప్రజల సగటు ఆయుర్దాయం 69-72 ఏళ్లుకాగా.. వైద్యుల సగటు జీవితకాలం 59 ఏళ్లలోపేనని భారత వైద్య అసోసియేషన్(ఐఎంఏ) అధ్యయనంలో వెల్లడైంది.

తీవ్రమైన ఒత్తిడితో కూడిన జీవితం

వైద్యులు తీవ్ర ఒత్తిడితో నలిగిపోతున్నారు. ఉదయం 8కి ఆస్పత్రికి వస్తే రాత్రి 10 గంటల వరకు సేవల్లోనే ఉంటున్నారు. ఉదయం, సాయంత్రం ఔట్ పేషెంట్లను చూడటం, వార్డుల్లో రోగులతో మాట్లాడటం, వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించడంతోనే గడిచిపోతుంది. ఏవైనా శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంటే తెల్లవారుజాము నుంచే ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. ఇంటికి వచ్చినా.. రోగుల పరిస్థితిపై నర్సులు, ఆస్పత్రి సిబ్బంది నుంచి వచ్చే ఫోన్లు మాట్లాడటం, తగిన సూచనలు చేయడం తప్పదు. ఇక ఏదైనా ఎమర్జెన్సీ కేసు వచ్చినా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారి పరిస్థితిలో తేడా వచ్చినా రాత్రిపగలు తేడా లేకుండా పరుగెత్తుకు రావాల్సిందే. ఈ క్రమంలో తీవ్ర ఒత్తిళ్లకు లోనవుతున్నారు. సరైన సమయంలో నిద్రాహారాలు లేక నీరసించిపోతున్నారు. ఇక కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు ఓపీ రోగుల సంఖ్య, ఆపరేషన్లు, ల్యాబ్ పరీక్షలపై వైద్యులకు టార్గెట్లు పెడుతుంటాయని.. పైగా ప్రతినెలా దీనిపై రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ఇది వైద్యుల్లో ఆందోళనకు దారితీస్తోందని అంటున్నాయి. మరోవైపు సొంతంగా ఆస్పత్రులు ఉన్నవారి పరిస్థితీ ఇంతే. కేవలం రోగుల వ్యవహారాలే కాకుండా ఆస్పత్రుల నిర్వహణ పనులూ చూసుకోవాలి. దానికి తోడు మంచి గుర్తింపు పొందాలన్న ఉద్దేశంతోనూ ఒత్తిడికి లోనవుతున్నారు.

ప్రజల కంటే పదేళ్లు తక్కువ బతుకుతున్నాం..



ప్రజల సగటు జీవితకాలం 69-72 ఏళ్లు ఉంటే.. వైద్యులు సగటున 59ఏళ్లకే కన్నుమూస్తున్నారు. సాధారణ ప్రజల జీవితకాలంతో పోలిస్తే పదేళ్లు తక్కువ. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యయనం ప్రకారం.. చాలా మంది వైద్యులు 50-55 ఏళ్ల వయసులోనే చనిపోతున్నారు. అమెరికాలో వైద్యులు రోజుకు 8 గంటలే పనిచేస్తారు. కానీ మన వద్ద రాత్రి పగలు పరుగులు పెట్టాల్సిందే. రోగులు మాపై భరోసాతో, నమ్మకంతో వస్తారు. ఎవరినీ కాదనలేం.

\- డాక్టర్ రమేష్ గూడపాటి, సీనియర్ కార్డియాలజిస్టు, జాయింట్ ఎండీ, స్టార్ ఆస్పత్రి

ఆరోగ్యంపై దృష్టిపెట్టాల్సి ఉంది




విదేశాల్లో అయితే వైద్యులు వారానికి ఐదు రోజులే పనిచేస్తా రు. మిగతా 2 రోజులు విశ్రాంతి. మన దగ్గర ఆరు రోజు లు, అదీ ఎక్కువ పనిగంటలు తప్పవు. కొన్నిసార్లు ఆదివారం కూడా ఆస్పత్రికి రావాలి. ఈ క్రమంలో చాలా మంది వైద్యులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్యులు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాల్సి ఉంది.

\- డాక్టర్ సుధీర్ కోగంటి, సీనియర్ కార్డియాలజిస్టు, సిటిజన్ ఆస్పత్రి

ఆసుపత్రి రౌండ్స్‌లో గుండెపోటు

- యువ కార్డియాక్ సర్జన్ మృతి
- నూరు శాతం పూడుకుపోయిన ప్రధాన ధమని
- ఉధృతంగా వచ్చిన గుండెపోటుతో కార్డియాక్ అరెస్ట్



డాక్టర్ గ్రాడ్లిన్ రాయ్

చెన్నై, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి వార్డులో రోగులను పరీక్షిస్తూ గుండెపోటుతో ఓ యువ గుండె శస్త్ర చికిత్సా నిపుణుడు కుప్పకూలాడు. సహచర వైద్యులు, సీనియర్ వైద్య నిపుణులు ఆయనను కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. చెన్నై సవిత వైద్య కళాశాలలో ఇటీవల చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. డాక్టర్ గ్రాడ్లిన్ రాయ్(39) నిపుణుడైన గుండె శస్త్రచికిత్సా వైద్యునిగా పేరుపొందారు. గత బుధవారం ఆయన యథావిధిగా వార్డులో రోగులను పరీక్షిస్తుండగా హఠాత్తుగా గుండెపోటుకు గురై కుప్పకూలారు. గమనించిన సహచరులు, సిబ్బంది ఆయనకు సీపీఆర్(కార్డియో-పల్మనరీ రిససిటేషన్) చేశారు. హుటాహుటిన ఐసీయూకు తరలించారు. అత్యవసరంగా చేయవలసిన అన్ని అత్యాధునిక చికిత్సలను అందించారు. చివరికి ఎక్మో యంత్రాన్ని అమర్చి కృత్రిమంగా ఊపిరినందించడానికీ ప్రయత్నించారు. ఎన్ని చేసినా గుండెకు రక్తం సరఫరా చేసే ప్రధాన ధమని 100% పూడుకుపోవడంతో వచ్చిన గుండెపోటు కావడంతో జరిగిన నష్టాన్ని పూడ్చడం వైద్యులకు సాధ్యం కాలేదు. దీంతో డాక్టర్ రాయ్ మరణించినట్లు ప్రకటించారు. మృతునికి భార్య, కుమారుడు వున్నారు. డాక్టర్ రాయ్‌కు గతంలో ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని సహచరులు పేర్కొన్నారు.

బెదిరింపులకు భయపడను

- విద్యార్థి దశ నుంచే ఎన్నో చూశా..: కోటంరెడ్డి
- రౌడీషీటర్ల సంభాషణల వెనుక వైసీపీ ఉందేమో!



నెల్లూరు రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రత్యర్థుల బుడ్డ బెదిరింపులకు భయపడే వ్యక్తిని కాదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. రౌడీషీటర్ల సంభాషణ వెనుక వైసీపీ హస్తం ఉం దన్న అనుమానం వ్యక్తం చేశారు. నెల్లూరులో శనివారం ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే అనేక హెచ్చరికలు చూశానన్నారు. 25 ఏళ్లపాటు రాజ్యాధికారం తనదేనంటూ విర్రవీగిన జగన్‌ను, అధికారాన్ని వదులుకుని 16 నెలలు ముందుగానే వైసీపీ నుంచి బయటకు వచ్చానని గుర్తుచేశారు. రౌడీషీటర్ల సంభాషణ చూసి దిగ్భ్రాంతికి గురయ్యానన్నా రు. అయితే ఇది గిరిధర్‌రెడ్డి కుట్రం టూ వైసీపీ శ్రేణులు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. అ లాంటి సంస్కృతి తమ ఇంటా వం టా లేదన్నారు. కుటుంబ సభ్యులను చంపుకోవాల్సిన కర్మ తనకు పట్టలేదని, అది వైసీపీ నాయకులకే అలవాటని.. ఇలాంటి ఆలోచనలు వైసీపీ డీఎన్‌ఏలోనే ఉన్నాయని దుయ్యబట్టారు. జూలై 1న రౌడీషీటర్లు మాట్లాడుకున్న వీడియో తాజాగా బయటకు రావడం, ఆ వీడియో తన దృష్టికి మూడు రోజుల ముందే వచ్చిందని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ప్రకటించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమాచారం తనకివ్వకపోవడంతో అసంతృప్తిగా ఉన్నానన్నారు. ఈ ఘటనపై హోం మంత్రి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఫోన్ చేసి పరామర్శించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. 'నన్ను చంపితే డ బ్బే, డబ్బంటూ రౌడీషీటర్లు చెప్పడం ఆశ్చర్యం కలిగించిం ది. ఆ డబ్బు వారికి ఎవరిస్తానన్నారు? ఆ అవసరం ఏ ముందో నిజాలను లోతుగా విచారించాల్సిన బాధ్యత జిల్లా పోలీసు శాఖపై ఉంది. తాజాగా బయటకు వచ్చిన బెదిరింపులతో శ్రేణులెవరూ ఆందోళన చెందవద్దు. జాగ్రత్తలు తీసుకుంటున్నాను' అని ఎమ్మెల్యే తెలిపారు. శ్రీధర్‌రెడ్డికి సంఘీభావం తెలిపేందుకు కార్యాలయానికి వచ్చిన మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా పోలీసు యంత్రాంగం రౌడీషీటర్ల అంతు చూడాలని సూచించారు.

చెవిరెడ్డికి కోర్టులో చుక్కెదురు

- మధ్యంతర బెయిల్ పిటిషన్ డిస్మిస్

విజయవాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో విజయవాడ జిల్లా జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. దీనికి సంబంధించి న్యాయాధికారి పి.భాస్కరరావు శనివారం తీర్పు వెలువరించారు. వెన్నె నొప్పితో బాధపడుతున్న తనకు స్విమ్స్‌లో ఫిజియోథెరపి చేయించుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఇంతకుముందు పిటిషన్ దాఖలు చేశారు. దానిని కోర్టు కొట్టేయడంతో.. మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమంలో ఫిజియోథెరపి చేయించుకోవడానికి మధ్యంతర బెయిల్ ఇవ్వాలని మరో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదనలు పూర్తవ్వడంతో న్యాయాధికారి తీర్పు వెలువరించారు.

ప్రభుత్వంలో వైసీపీ ఫేక్‌లు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించింది. రెండు రోజుల క్రితం ఏపీ పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ కంపెనీలు, కార్పొరేషన్లు, సొసైటీల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 నుంచి 65 సంవత్సరాలకు పెంచుతున్నట్లు హల్చల్ చేసిన నకిలీ జీవో.. ఈ ఫేక్ గ్యాంగ్ బరితెగింపునకు నిదర్శనం. ఆగస్టు 29న జీవో(ఆర్టీ) నంబరు 1575ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. పదవీ విరమణ చేసే ఉద్యోగులకు చెల్లించాల్సిన డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం వద్ద లేకపోవడంతో పదవీ విరమణ వయసును 65 ఏళ్లకి పెంచిందంటూ తప్పుడు ప్రచారానికి తెరదీశారు. వాస్తవానికి జీవో 1575ను ఆగస్టు 28నే విడుదల చేశారు. అది ఓ ఐఏఎస్ అధికారి నివాసం అద్దెకు సంబంధించిన జీవో. అంతేకానీ, ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపునకు సంబంధించింది కాదు. ఆగస్టు 22న ప్రభుత్వం జీవో(ఆర్టీ) నంబరు 1545ను విడుదల చేసింది. దీనిని ఏపీ పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ కంపెనీలు, కార్పొరేషన్లు, సొసైటీల్లో పనిచేసే ఉద్యోగుల పదవీవిరమణ వయసును 60 నుంచి 62కి పెంచే ప్రతిపాదనను పరిశీలించేందుకు మంత్రివర్గ బృందాన్ని నియమిస్తూ విడుదల చేశారు. వీటన్నింటినీ మరుగునపరుస్తూ.. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేలా వైసీపీ గ్యాంగులు తప్పుడు జీవోలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. తద్వారా ప్రభుత్వ ఉద్యోగుల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం 'ఫ్యాక్ట్ చెక్' పేరుతో నకిలీ జీవో, వాస్తవ జీవోలను పక్కపక్కన పెట్టి వివరణ ఇచ్చి వదిలేసింది. కానీ, అదేసమయంలో తప్పుడు జీవోలు సృష్టించిన వారిపై కఠినచర్యలు తీసుకునే దిశగా ఎలాంటి చర్యలూ చేపట్టలేదు.

ఉదాసీనతే వారి ధైర్యం

రాజధాని అమరావతి మునిగిపోయిందని ప్రచారం చేసినా.. ప్రకాశం బ్యారేజీ గేట్లు ఊడిపోయి విజయవాడ నగరం మునిగిపోనుందని అసత్య కథనాలు వండివార్చినా.. చేతులు బాగుండీ.. లేనట్టు నటిస్తూ తనకు వస్తున్న దివ్యాంగుల పింఛను తొలగించారంటూ డ్రామా ఆడినా.. కూటమి ప్రభుత్వం పట్టించుకోదు. మహా అయితే చిన్నపాటి కేసులతో సరిపెట్టేస్తుంది అన్న ధైర్యమే వైసీపీ ఫేక్ ముఠా రెచ్చిపోవడానికి కారణమవుతోంది. ఆ బరితెగింపే ఇప్పుడే ఏకంగా ప్రభుత్వంలోకి చొరబడేలా చేసింది. జీవోల రూపకల్పన తీరుతెన్నులు బాగా తెలిసిన వారే ఫేక్ జీవోలను సృష్టించగలరు. రాష్ట్ర ప్రభుత్వ పాలనకు కేంద్ర స్థానమైన సచివాలయంలోని కీలక విభాగాల్లో ఇప్పటికీ అధిక శాతం మంది వైసీపీ వీరాభిమానులే విధులు నిర్వహిస్తున్నారు. వీరి అండతోనే వైసీపీ ఫేక్ గ్యాంగ్ ఏకంగా నకిలీ జీవోలను సృష్టించగలుగుతోంది.

వెంట్రామిరెడ్డి రెడ్డి హవా!

వైసీపీ హయాంలో ఓ వెలుగు వెలిగిన ఉద్యోగుల సంఘం నేత వెంకట్రామిరెడ్డి ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు. అయినా, ఆయన హవానే సచివాలయంలో ఇంకా నడుస్తోందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అమరావతిపై ఆగని కక్షసాధింపు

నిన్నటి వరకు అమరావతి మునిగిపోయిందంటూ ప్రచారం చేసిన వైసీపీ ఫేక్ ముఠాలు ఇప్పటికీ రాజధానిపై రకరకాలుగా విషం చిమ్ముతూనే ఉన్నాయి. ఎక్కడో తమిళనాడులో జరిగిన ఘటనకు సంబంధించిన వీడియోను రెండు రోజుల క్రితం పోస్టు చేసి దాన్ని విజయవాడలో జరిగినట్లు చూపారు. 'అమరావతి ఎప్పటికీ ఆంధ్రుల రాజధాని కాలేదు.' అంటూ ఫేక్ పోస్టులు పెట్టి ప్రచారం చేశారు. ఆ వీడియోలో ఓ దళిత మహిళకు దూరంగా నిలబడి.. ఓ అగ్రవర్ణ మహిళ చెంబుతో నీరు పోస్తున్నట్లు ఉంది. ఈ వీడియోను పోస్టు చేసి అమరావతిలో కులగజ్జి ఉందంటూ వైసీపీ ఫేక్ గ్యాంగ్ ప్రచారం చేసింది. ఈ ఫేక్ పోస్టుపై మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ మరో పోస్టు చేశారు. 'అమరావతి పైనా.. ఆంధ్రప్రదేశ్‌పైనా మీ కక్ష ఇంకా తీరలేదా జగన్ రెడ్డీ?. తమిళనాడులోని వీడియోను తెచ్చి అమరావతిలో అంటూ ప్రచారం చేయించారు. అమరావతి అందరిదీ.. ఇక్కడ వివక్ష ఉండదు. ప్రాంతాల మధ్య విద్వేషాలు, కులాల కుంపట్లు, మతాల మధ్య మంటలు రేపి చలికాచుకునే మీ కుతంత్రాలకు కాలం చెల్లింది.' అని లోకేశ్ ప్రతిస్పందించారు. వైసీపీ ఫేక్ గ్యాంగులు ఫేక్ పోస్టులు పెట్టడం, వాటికి కూటమి పెద్దల ఖండనలు.. ఫ్యాక్ట్ చెక్‌లు పెట్టుకోవడం సమస్యకు పరిష్కారం కాదని పలువురు చెబుతున్నారు. అవాస్తవాలను ప్రచారం చేసే నకిలీ ముఠాలపై కఠిన చర్యలు తీసుకునే దిశగా అడుగులు పడితేనే ఈ ఫేక్ ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని సూచిస్తున్నారు.

ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపి, చర్చనీయాంశంగా మారిన శ్రీకాంత్ పెరోల్ జీవో విడుదలలో అసలేం జరిగిందనే విషయాన్ని ప్రభుత్వ పెద్దలు ఇంత వరకు నిగ్గు తేల్చలేకపోయారు. సచివాలయంలో కీలక స్థానాల్లో ఉన్న జగన్ వీరాభిమానులే ఈ పనులు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

నాడు ముందే మార్పులు

2019 ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించిన మరుక్షణం సచివాలయంలోని కీలక అధికారులపై దృష్టి సారించింది. జగన్ ప్రమాణస్వీకారం జరుగుతుండగానే సచివాలయంలో కీలక స్థానాల్లో ఉన్నవారందరినీ బదిలీ చేశారు. తమకు అనుకూలంగా ఉండరని భావించిన అధికారులందరినీ పక్కన పెట్టారు. ఆ తర్వాత కూడా ప్రభుత్వ సమాచారాన్ని లీక్ చేస్తున్నారని అనుమానించి కొందరు సెక్షన్ ఆఫీసర్లపై సస్పెన్షన్ వేటు వేశారు. అయితే, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం వచ్చి 14 నెలలు గడుస్తున్నా సచివాలయంలోని కీలక స్థానాల్లో అధిక శాతం మంది వైసీపీ మద్దతుదారులే ఉన్నారు. మంత్రుల పేషీల్లోనూ వైసీపీ సానుభూతిపరులే పాగా వేశారు. సీఆర్డీయే వంటి కీలక విభాగంలోనూ జగన్ అనుకూలురే చక్రం తిప్పుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయంలో కీలక స్థానాల్లో ఉన్న అధికారులను మార్పు చేయాల్సి ఉంది. కానీ, ఆ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ లేవు. దాని ఫలితంగా తాము ఏం చేసినా ఎవరూ ఏం చేయలేరనే ధీమాతో వైసీపీ సానుభూతిపరులైన కొందరు అధికారులు రెచ్చిపోతున్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సంబంధించిన కీలక సమాచారాన్ని వైసీపీకి చేరవేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను ఎక్కడ దిగజారేలా చేయవచ్చో వీరే.. వైసీపీ నేతలకు సలహాలు ఇచ్చి మరీ మీడియా ముందు మాట్లాడిస్తున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.